www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 4-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 290 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 2.31 తదుపరి అష్టమి; నక్షత్రం: అశ్విని రా. 9.50 తదుపరి భరణి; వర్జ్యం: సా. 6.04-7.34; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.50, రా. 10.18-11.07; అమృతఘడియలు: మ. 3.04-4.34; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పడిపోతున్న ప్రాజెక్టు నిల్వలు

వేసవికి ముందే తగ్గుతున్న నీటిమట్టాలు

శ్రీశైలం జలాశయంలో 40 శాతం, నాగార్జున సాగర్‌లో 68శాతం లోటు

నదుల పరివాహకంలోనూ ఇదే స్థితి



12



గవర్నరా? రాష్ట్రపతా!?

రిటైర్మెంట్ తర్వాత రాజీవ్‌కుమార్‌కు ఏ పదవిస్తున్నారు?

అందుకే సీఈసీ బీజేపీకి సాగిలపడుతున్నారు

ఎన్నికల్లో బీజేపీ పది శాతం ఓట్లను రిగ్గింగ్ చేయవచ్చు

15 శాతం ఆధిక్యం ఇస్తేనే వాళ్ల అక్రమాలకు అడ్డుకట్ట


ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు

హస్తినలో ముగిసిన ప్రచారం.. రేపే 70 సీట్లకు పోలింగ్

హస్తినలో 'జైలు' రాజకీయం!.. సానుభూతికి ప్రయత్నం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పదవీ విరమణ తర్వాత ఇస్తామంటున్న పదవుల కోసం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బీజేపీ ఒత్తిళ్లకు సాగిలపడిపోయారని ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యాన్ని పణంగా పెడుతున్నారని ఆరోపించారు. బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ పక్షపాతం చూపిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారానికి సోమవారం చివరి రోజు. ఈ సందర్భంగా దేశ రాజధానిలో

మిగతా 2వ పేజీలో...



మైతేయీలను తుపాకులు దోచుకోనివ్వండి

ఆడియోలో మణిపూర్ సీఎం బీరేన్ ఆదేశాలు!

ఆడియో క్లిప్‌లకు ట్రూత్ ల్యాబ్స్ ఫోరెన్సిక్ పరీక్ష

93 శాతం సరిపోలిన ముఖ్యమంత్రి స్వరం

సుప్రీంకు నివేదిక సమర్పించిన ప్రశాంత్‌భూషణ్

హింసాగ్నికి ముఖ్యమంత్రి వ్యాఖ్యల ఆజ్యం?

సుప్రీంకోర్టులో 'కోహుర్' సంస్థ పిటిషన్

మార్చి 24కు వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: మణిపూర్‌లో జాతుల మధ్య హింసకు ఆ రాష్ట్ర సీఎం బీరేన్ సింగ్ ప్రేరేపించారంటూ లీకైన ఆడియో క్లిప్‌పై హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ట్రూత్ ల్యాబ్స్ ఇచ్చిన ఫోరెన్సిక్ నివేదిక సంచలనం రేపుతోంది. "ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయుధాలను లూటీ చేసేందుకు మైతేయీలకు అవకాశమివ్వండి" అంటూ ఆదేశించే ఆడియో క్లిప్ వైరల్ అయిన విషయం తెలిసిందే.! ఈ క్లిప్‌లోని ఆడియోతో.. సీఎం బీరేన్ సింగ్ గొంతు 93% వరకు మ్యాచ్ అవుతోందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సోమవారం సుప్రీంకోర్టుకు

మిగతా 2వ పేజీలో...



రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి

9,417 కోట్లు

ఉమ్మడి రాష్ట్రంలో కంటే 11 రెట్లు అధికం

ప్రస్తుతం ఏపీలో 43 ప్రాజెక్టులూ అమలు

వీటి విలువ రూ.84,559 కోట్లు

పదేళ్లలో 1,560 కి.మీ. కొత్త ట్రాకులు

770 రైల్ ఫ్లైఓవర్ల నిర్మాణం

65 లిఫ్టులు, 34 ఎస్కలేటర్లు కూడా

509 స్టేషన్లలో వైఫై ఏర్పాటు

రూ.1,132 కోట్లతో విశాఖ, నెల్లూరు, తిరుపతి, రాజమండ్రి స్టేషన్ల అభివృద్ధి

2,051 కోట్లతో 73 అమృత్ స్టేషన్లు

రాష్ట్రంలో 2,981 కి.మీ. మేర కవచ్

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల కాలంలో కేటాయించిన రైల్వే బడ్జెట్ కంటే 11 రెట్లు అధికంగా.. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రకు కేటాయించామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2009-14 నడుమ ఏపీ, తెలంగాణతో కూడిన ఉమ్మడి రాష్ట్రానికి సగటున ఏటా రూ.881 కోట్లు ఇవ్వగా.. 2025-26లో కేవలం నవ్యాంధ్రకే రూ.9,417 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణకు రూ.5,337 కోట్లు కేటాయించామన్నారు. సోమవారం ఢిల్లీలోని రైల్వే భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో సహకరిస్తున్నారంటూ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్రం, రాష్ట్రప్రభుత్వం మధ్య సమన్వయంతో రైల్వే పనులు

మిగతా 14వ పేజీలో...

ఇంకా శ్రమించాలి!

వైసీపీ పాలనలో 20-30 ఏళ్లు వెనక్కి



సోమవారం ఢిల్లీలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాతో సమావేశమైన సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ అధికారులు

నిత్యం కేంద్రంతో టచ్‌లో ఉన్నాం

బడ్జెట్‌తో రాష్ట్రానికి 'ఆక్సిజన్'

సమస్యల పరిష్కారం.. నిధులూ!

మోదీ నేతృత్వంలో బలమైన బ్రాండ్ ఇండియా

జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం సరళతరం చేయాలి

పేదలకు సంపన్నుల చేయూతపై చర్చ జరగాలి

సంపద సృష్టించకుండా పంచే హక్కు లేదు

ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

ఉదారంగా నిధులు కేటాయించండి

ఫైనాన్స్ కమిషన్‌కు చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ 20-30 సంవత్సరాలు వెనక్కు వెళ్లిందని, కునారిల్లిపోయిన ఆర్థిక వ్యవస్థతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆక్సిజన్ అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జరిగిన నష్టం పూరించడానికి ఇంకా శ్రమించాల్సి ఉందని... ఏపీ విషయంలో నిత్యం కేంద్రంతో టచ్‌లోనే ఉన్నామని చెప్పారు. ఏడు నెలల నుంచి పెండింగ్‌లో

మిగతా 13వ పేజీలో...

సామాన్యుల కోసమే సీఎం తపన

చంద్రబాబు ఓ విజనరీ.. ఎందరికో స్ఫూర్తి

ప్రముఖ నటుడు సోనూసూద్ వెల్లడి

అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ

ప్రభుత్వానికి నాలుగు అంబులెన్స్‌లు విరాళమిచ్చిన 'సూద్ చారిటీ ఫౌండేషన్'

సోనూసూద్ చొరవ స్ఫూర్తిదాయకం: సీఎం

ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టీకరణ

14



సోమవారం తనను కలిసిన నటుడు సోనూ సూద్‌ను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మరో 216 కోట్లు

రెండు, మూడు రోజుల్లోనే విడుదల: లోకేశ్

విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం

ఇంజనీరింగ్ కాలేజీలతో త్వరలో వర్క్‌షాప్

ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు పదేళ్లు

యాజమాన్యాల సమస్యలు పరిష్కరిస్తాం

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు, పాఠశాలల ప్రతినిధులకు మంత్రి హామీ

13



2

మేకిన్ ఇండియా గుడ్.. కానీ విఫలం!

ఉద్యోగ కల్పనలో ఎన్డీయే, యూపీఏ ప్రభుత్వాలు రెండూ విఫలమయ్యాయి

లోక్‌సభలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



2

రాష్ట్రపతి గౌరవానికి భంగం కలిగించారు

కాంగ్రెస్ అగ్రనేత సోనియాపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు

రాజ్యసభ చైర్మన్‌కు అందజేసిన 40 మంది బీజేపీ ఎంపీలు

మహా కుంభమేళాలో వేలాదిమంది మృతి!

రాజ్యసభలో ఖర్గే సంచలన వ్యాఖ్యలు

మృతదేహాలను సంగంలో విసిరేశారు

ఎంపీ జయా బచ్చన్ ఆరోపణ

ఉభయసభలను కుదిపేసిన 'తొక్కిసలాట'

2



హిందూపురం మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన డీఈ రమేశ్‌కు డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి ఆనంద్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ బీకే పార్థసారథి తదితరులు

పురపాలికల్లో కూటమి జెండా

అన్నింటా అభ్యర్థుల విజయం

టీడీపీ ఖాతాలో హిందూపురం మునిసిపల్ చైర్మన్ పదవి

నెల్లూరు డిప్యూటీ మేయరూ, ఏలూరులో రెండు డిప్యూటీ మేయర్ పదవులూ కైవసం

గుంటూరు స్టాండింగ్ కౌన్సిల్‌లో 6 స్థానాలు కూడా

వీటిలో జనసేనకు ఒకటి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో దాదాపు 93 శాతం స్థానాలను గెలుచుకున్న టీడీపీ కూటమి... తాజాగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయం సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల పదవులకు జరిగిన ఎన్నికల్లో అన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వివిధ కారణాలతో ఖాళీ అయిన పదవులకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మునిసిపల్ చైర్మన్ స్థానాన్ని టీడీపీ సొంతం చేసుకుంది. ఏలూరు కార్పొరేషన్‌లో రెండు డిప్యూటీ మేయర్ పదవులను, నూజివీడు మునిసిపల్ వైస్ చైర్మన్ పదవిని, నెల్లూరు డిప్యూటీ మేయర్

మిగతా 13వ పేజీలో...

తిరుపతి, తునిలో నేటికి వాయిదా

'రాజ్‌తరుణ్- లావణ్య' కేసులో మలుపు!



కోర్టు వద్ద మస్తాన్ సాయి

మహిళలకు డ్రగ్స్ అలవాటు చేసి నగ్న వీడియోలు తీసిన మస్తాన్ సాయి

వందల మంది అమ్మాయిల వీడియోలు తీసి, బ్లాక్‌మెయిల్ చేశాడు

పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్య.. హార్డ్‌డిస్క్ అందజేత

హార్డ్‌డిస్క్ కోసం లావణ్యపై దాడికి యత్నం.. డయల్-100కు ఫోన్

ఆమె ఇంటికెళ్లి మస్తాన్ సాయిని అరెస్టు చేసిన తెలంగాణ పోలీసులు

అతడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు కేసులు

9

ఎందుకీ వివక్ష?

గౌరవ వేతనం కోసం రెండు కేటగిరీలుగా కార్పొరేషన్లు

గత నెలలో సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు

బీసీలతో పాటు పలు కార్పొరేషన్లలో ఏ, బీ కేటగిరీలు

చైర్మన్లు, డైరెక్టర్లు, సిబ్బంది వేతనంలో భారీ వ్యత్యాసం

ఏ-కేటగిరి చైర్మన్లకు రూ.1.25 లక్షలు..

బీ-కేటగిరి చైర్మన్లకు రూ.60 వేలు గౌరవ వేతనం

ఇంత తేడాలెందుకంటూ బీ-కేటగిరీ చైర్మన్ల విమర్శ

కేటగిరీలుగా విభజించడంపై అసంతృప్తి

ఏ ప్రాతిపదికన ఈ నిర్ణయం తీసుకున్నారంటూ ప్రశ్న



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కార్పొరేషన్ల పదవులు భర్తీ చేసి వాటిలో జోష్ నింపిన రాష్ట్ర ప్రభుత్వం.. వాటి చైర్మన్లు, సిబ్బందికి గౌరవ వేతనం నిర్ణయించడంలో మాత్రం తప్పటడుగులు వేసింది. ఆ విషయంలో కార్పొరేషన్లను రెండు కేటగిరీలుగా విభజించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, సిబ్బంది గౌరవ వేతనాన్ని నిర్ణయిస్తూ

మిగతా 14వ పేజీలో...

క్యాన్సర్ కబళిస్తోంది

దేశంలో భారీగా పెరుగుతున్న మహమ్మారి

ఆగ్నేయాసియాలో పరిస్థితి ఆందోళనకరం

2022లో 24 లక్షల కేసులు వెలుగులోకి

వారిలో 56 వేల మంది చిన్నారులు

ఆ ఏడాది 15 లక్షల మంది మృత్యువాత

వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా డబ్ల్యూహెచ్‌వో నివేదిక

ఐఐటీ మద్రాస్‌లో క్యాన్సర్ జీనోమ్ డేటాబేస్ ప్రారంభం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ప్రపంచ మానవాళికి సవాల్ విసురుతున్న అతిపెద్ద ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ఒకటి. దీనికి భారత దేశం మినహాయింపేమీ కాదు. దేశంలో క్యాన్సర్ మహమ్మారి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) నివేదిక స్పష్టం చేస్తోంది. అలాగే భారత్‌లో ప్రతి తొమ్మిది మందిలో ఒకరు తమ జీవితకాలంలో క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్‌సీఆర్‌పీ) నివేదించింది. తాజాగా ప్రపంచ

మిగతా 2వ పేజీలో...

ఇంద్రనూయి సోదరికి గ్రామీ అవార్డు

- 71 ఏళ్ల వయసులో చంద్రిక ఘనత
- త్రివేణి ఆల్బమ్‌కు దక్కిన గౌరవం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: పెప్సికో మాజీ సీఈవో ఇంద్రనూయి సోదరి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు చంద్రికా కృష్ణమూర్తి టాండన్ ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. భారత సంతతికి చెందిన అమెరికా పౌరురాలైన ఆమె పారిశ్రామికవేత్తగా ఉంటూనే గాయనిగా ఈ ఘనత సాధించారు. 67వ గ్రామీ అవార్డుల్లో భాగంగా "బెస్ట్ న్యూ ఏజ్, యాంబియంట్ ఆర్ చాంట్ ఆల్బమ్" విభాగంలో ఆమె ఆల్బమ్ త్రివేణికి గ్రామీ అవార్డు దక్కింది. ఈ విభాగంలో రికీ కెజ్, అనౌష్క శంకర్ లాంటి వారు పోటీపడినా 71 ఏళ్ల చంద్రికనే గ్రామీ వరించింది. తన సంగీత సహకారులైన దక్షిణాఫ్రికాకు చెందిన ఫ్లూట్ విద్వాంసుడు వౌటెర్ కెల్లర్‌మ్యాన్, జపాన్‌కు చెందిన సెల్లో విద్వాంసుడు యెరు మట్సుమోటోతో కలసి చంద్రిక ఈ అవార్డు సాధించారు. పారిశ్రామికవేత్తగా, మహా వితరణశీలిగా ఇంద్రనూయి అక్క చంద్రిక గతంలోనే గుర్తింపుపొందారు. చంద్రకా టాండన్ 1954లో చెన్నైలో జన్మించారు. అహ్మదాబాద్ ఐఐఎంలో పట్టా పొందిన తర్వాత సిటీ బ్యాంక్‌లో పనిచేయడానికి లెబనాన్ వెళ్లారు. అంతర్యుద్ధం కారణంగా అక్కడి నుంచి న్యూయార్క్ వెళ్లి ప్రఖ్యాత మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ కంపెనీ మెకెన్సీలో చేరారు. 2015లో భర్త రంజన్ టాండన్‌తో కలసి 100 మిలియన్ డాలర్లు న్యూయార్క్ వర్సిటీకి విరాళంగా ఇచ్చారు.

జాతీయ హైవేలపై ఒకే టోల్ విధానం: గడ్కరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఏకరూప టోల్ విధానాన్ని తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో.. అధిక టోల్ చార్జీల విధింపు, రహదారుల పరిస్థితిపై వాహదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందన్న అంశాన్ని ప్రస్తావించిన సందర్భంగా ఏకరూప టోల్ విధానం గురించి గడ్కరీ పేర్కొన్నారు.

'యూఎస్ఎయిడ్' ఓ నేర సంస్థ: ఎలాన్ మస్క్

వాషింగ్టన్, ఫిబ్రవరి 3: నేర సంస్థగా మారిన యూఎస్ఎయిడ్‌ను (యూఎస్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్) మూసివేస్తామని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మస్క్ వ్యాఖ్యలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం సమర్థించారు. మూర్ఖులైన అతివాదుల ఆధ్వర్యంలో యూఎస్ఎయిడ్ పనిచేస్తోందనీ, వారందరినీ ఇంటికి పంపిస్తామన్నారు. ఈ వ్యాఖ్యలు వారు చేసిన కొద్ది గంటల్లోనే వాషింగ్టన్‌లోని యూఎస్ఎయిడ్ ప్రధాన కార్యాలయానికి తాళాలు పడ్డాయి. ఒక రోజు కోసం మూసివేస్తున్నామని సిబ్బందికి ప్రభుత్వం మెయిల్స్ పంపింది. విదేశాలకు మానవతా సాయం అందిస్తున్న సంస్థల్లో అతి పెద్దది యూఎస్ఎయిడ్. అభివృద్ధి, భద్రతా అవసరాల కోసం వందకుపైగా దేశాలకు ఈ సంస్థ రూపాయల కోట్ల సాయం అందిస్తోంది.

డీప్‌సీక్‌కు పోటీగా చాట్‌జీపీటీలో 'డీప్ రీసెర్చ్'

వాషింగ్టన్, ఫిబ్రవరి 3: చైనా తన కృత్రిమ మేధ(ఏఐ) టూల్ 'డీప్‌సీక్‌'ను తీసుకువచ్చిన నేపథ్యంలో.. దానికి పోటీగా ఓపెన్‌ఏఐ సంస్థ తన చాట్‌జీపీటీలో 'డీప్ రీసెర్చ్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకోసం జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్(ఎస్‌బీ) సహకారం తీసుకుంది. ఈ రెండు సంస్థలు కలిసి 'ఎస్‌బీ ఓపెన్‌ఏఐ జపాన్' పేరుతో డీప్ రీసెర్చ్‌ను పరిచయం చేశాయి. డీప్ రీసెర్చ్ ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాట్‌జీపీటీకి ఏజెంట్‌గా పనిచేస్తుంది. చాట్‌జీపీటీలో సెర్చ్ చేసేప్పుడే.. డీప్‌సెర్చ్‌కు సంబంధించిన ఆప్షన్‌ను ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. డీప్ రీసెర్చ్ కొన్ని వందల ఆన్‌లైన్ సోర్స్‌లను పరిశీలించి, ఉత్తమ ఫలితాలతో పరిశోధన పత్రాన్ని సిద్ధం చేస్తుందని ఓపెన్ ఏఐ పేర్కొంది.

సుంకాల విధింపులో మెక్సికోకు ఊరట

- నెల రోజుల పాటు నిలిపివేసిన ట్రంప్



వాషింగ్టన్, ఫిబ్రవరి 3: సుంకాల విధింపుతో ప్రకంపనలు సృష్టిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మెక్సికో విషయంలో కాస్త శాంతించారు. మెక్సికోపై విధించిన సుంకాలను నెలరోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్- ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. మెక్సికో నుంచి అమెరికాకు మాదకద్రవ్యాలు, ఫెంటానిల్ అక్రమ రవాణా, అక్రమ వలసలను కట్టడి చేసేందుకు 10 వేల మంది సైనికులకు సరిహద్దుకు తరలిస్తామని షీన్‌బామ్ హామీ ఇవ్వడంతో ట్రంప్ సుంకాల విధింపును నెలరోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు తమపై సుంకాలు విధించిన అగ్రరాజ్యంపై ప్రతీకారానికి కెనడా సిద్ధమైంది. అమెరికా ఉత్పత్తులపై తామూ 25% సుంకం విధిస్తామని కెనడా ప్రధాని ట్రూడో ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఉత్తర ఒంటారియోలోని గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు స్టార్‌లింక్‌తో చేసుకున్న రూ.869.92 కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు కెనడాలోని రాష్ట్రం ఒంటారియో ప్రభుత్వం ప్రకటించింది. తమ దేశంతో జగడం పెట్టుకున్నందుకు అమెరికా వాణిజ్య సంస్థలు తప్పక బాధపడతాయని దీనికి ట్రంప్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. మరోవైపు, పనామాపై త్వరలో శక్తివంతమైన చర్య ఉండబోతోందని, ట్రంప్ హెచ్చరించారు. కాసేపటికే చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు నుంచి తాము వైదొలుగుతున్నట్లు పనామా అధ్యక్షుడు ములినో ప్రకటించారు. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ములినో నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

మహారాష్ట్రలో మొదటి ఏఐ యూనివర్సిటీ!

హైదరాబాద్, ఫిబ్రవరి 3: దేశంలోనే మొదటిసారిగా మహారాష్ట్రలో కృత్రిమ మేధ (ఏఐ) యూనివర్సిటీని నెలకొల్పబోతున్నారు. దీని కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని ఆ రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి ఆశిష్ షెలార్ తెలిపారు. ఈ యూనివర్సిటీ ఏఐ, దాని అనుబంధ రంగాల పరిశోధనను ప్రోత్సహించడంతో పాటు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా నిలుస్తుందన్నారు.

గవర్నర్ పదవా!? రాష్ట్రపతా!?

(మొదటి పేజీ తరువాయి)



ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఏ స్థాయిలో బీజేపీకి దాసోహమైందంటే.. దేశంలో అసలు ఎన్నికల కమిషన్ లేదన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. రాజీవ్ కుమార్ ఈ నెలాఖరులోనే పదవీ విరమణ చేస్తున్నారు. ఆ తర్వాత ఆయనకు ఏ పదవిని ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గవర్నర్ పదవా!? ఏకంగా రాష్ట్రపతి పదవినే ఇచ్చేస్తున్నారా!? చేతులు జోడించి రాజీవ్ కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నా! మీ విధిని మీరు నిర్వర్తించండి. ఇంకా పదవులు చేపట్టాలనే దురాశను వదిలేసుకోండి. కెరీర్ చివర్లో దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయకండి" అని విజ్ఞప్తి చేశారు. రాజీవ్ కుమార్ తన బాధ్యతలను నైతిక నిష్ఠతో నిర్వహించాలని, ప్రజాస్వామ్యాన్ని పణంగా పెట్టి వ్యక్తిగత ఆకాంక్షలను నెరవేర్చుకోరాదని విజ్ఞప్తి చేశారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని, 'డబుల్ ఇంజిన్' సర్కారు అశాంతిని ప్రోత్సహిస్తోందని, పోలీసులకు అధికారాలు లేకుండా చేశారని, ఢిల్లీ పోలీసులు కూడా భయపడుతున్న ఆ గూండా ఎవరని ప్రశ్నించారు.

10 శాతం ఓట్లు రిగ్గింగ్ చేయొచ్చు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం)ల ద్వారా బీజేపీ పది శాతం వరకూ ఓట్లను రిగ్గింగ్ చేయవచ్చంటూ ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేశారు. "అందుకే మీరంతా పెద్దఎత్తున ఓటింగ్‌కు తరలి రావాలి. ప్రతి ఓటూ చీపురు కట్ట (ఆప్ గుర్తు)కే వేయాలి. 15 శాతం ఓట్ల ఆధిక్యం వస్తేనే.. వాళ్లు ఎన్ని అక్రమాలు చేసినా మన విజయం ఖాయమవుతుంది. వాళ్ల ఈవీఎంలను ఓడించాలంటే పది శాతం.. ఆపైనే ఆధిక్యం మనకు అవసరం" అంటూ ఓ వీడియో సందేశాన్ని ఢిల్లీ ఓటర్లకు విడుదల చేశారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఎన్నికల అక్రమాల నేపథ్యంలో ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, పోలింగ్ రోజు ప్రతి అంశాన్నీ ఇందులో అప్‌లోడ్ చేస్తామని చెప్పారు. ఒకవేళ, ఈసీ, తమ వెబ్‌సైట్‌లోని గణాంకాల మధ్య తేడా వస్తే అక్రమాలు జరిగినట్లు నిర్ధారణకు వస్తామని చెప్పారు. అలాగే, ఎన్నికకు ముందు బీజేపీ ప్రలోభాలకు చెక్ పెట్టడానికి మురికివాడల్లోని ప్రజలకు స్పై, బాడీ కెమెరాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు.

హస్తినలో ముగిసిన ప్రచారం

రేపే 70 నియోజకవర్గాల్లో ఎన్నికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి3: దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రచార గడువు ముగిసే చివరి క్షణం వరకూ ఆప్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో హోరెత్తించారు. మూడోసారి అధికారంలోకి రావాలని ఆప్, ఎలాగైనా గెలిచి తీరాల్సిందేనని బీజేపీ హోరాహోరీ ప్రచారం నిర్వహించాయి. ఈసారి ప్రతి చోటా పది శాతం అధికంగా ఓట్లు పెరిగేలా చూడాలని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఈసీ రాజీవ్ కుమార్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ కేజ్రీవాల్ ఆరోపించారు. మరోవైపు ఢిల్లీలో నిన్న బీజేపీ మొత్తం 22 రోడ్ షోలు నిర్వహించింది. ఢిల్లీ నుంచి ఆపద ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రధాని మోదీ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో కొందరు విద్యార్థులతో ముచ్చటించిన ఆయన ఆప్ విద్యావిధానంపై విమర్శలు గుప్పించారు. గ్యారంటీగా పాస్ అవుతారనుకునే విద్యార్థులనే పదో తరగతి పరీక్షలు రాసేందుకు అనుమతించి విగతా వారిని అడ్డుకుంటున్నారని, ప్రభుత్వం పరువు పోతుందని విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదన్నారు. ఆప్ పాలనలో ఢిల్లీకి దక్కింది చెత్త, విషపు నీరేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. తమకు అధికారమిస్తే ఢిల్లీని ప్రపంచస్థాయి నగరంగా మారుస్తామని హామీ ఇచ్చారు. కుంభకోణాల ఆప్ సర్కారును సాగనంపి వికసిత్ ఢిల్లీ కోసం బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఎన్నికలకు గట్టి భద్రత

ఢిల్లీలో రేపు మొత్తం 70 నియోజకవర్గాల్లో ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడతాయి. 42 వేల మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 220 కంపెనీల భద్రతా బలగాలను మోహరించారు. 660 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశారు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు ఉండగా 13,766 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 3 వేల పోలింగ్ కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించారు. డ్రోన్ల ద్వారా నిఘా కొనసాగిస్తున్నారు.

లోకం తీరు



55% మంది ప్రజల్లో ఆప్ సర్కారుపై అసంతృప్తి!

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వంపై 55% మంది ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని 'సీ-ఓటర్' సర్వే తెలిపింది. అలాగే కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి వర్గాన్ని బాగానే ప్రభావితం చేస్తోందని వెల్లడించింది. ఈ నెల 1 వరకు సేకరించిన డేటా ఆధారంగా సర్వే ఫలితాలను సోమవారం విడుదల చేసింది. సర్వే ప్రకారం.. ప్రస్తుత ఆప్ సర్కారుపై 43.9% మంది ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వం మారాలని కోరుకుంటున్నారు. ఇంకో 10.9% మంది కూడా అసంతృప్తితో ఉన్నప్పటికీ ప్రభుత్వం మారాలని మాత్రం కోరుకోవడం లేదు. 46.1% మంది సర్కారుపై సంతృప్తిగా ఉన్నారు. ఇదే కొనసాగాలని భావిస్తున్నారు. అయితే మొత్తంగా 55% మందిలో అసంతృప్తి ఉండడం పోలింగ్ ముంగిట ఆప్‌ను ఆందోళనకు గురిచేస్తోంది.

హస్తినలో 'జైలు' రాజకీయం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఈ దఫా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జైలు చుట్టూ తిరుగుతున్నాయి. జైలుకు వెళ్లివచ్చిన నేతలు సానుభూతి కోసం పదే పదే తమను అన్యాయంగా కారాగారంలో పడేశారని ప్రచారం చేసుకుంటున్నారు. కరుడుగట్టిన నిజాయితీపరుడినని చెప్పుకొనే ఆప్ అధినేత కేజ్రీవాల్ మద్యం పాలసీ స్కాం కేసులో జైలుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన సన్నిహితుడు సిసోదియా కూడా ఇదే కేసులో అరెస్టయి 17 నెలలు జైల్లో ఉన్నారు. వీరిద్దరి కంటే ముందు నాటి ఆరోగ్యమంత్రి సత్యేంద్ర జైన్ మనీ లాండరింగ్ చట్టం కేసులో అరెస్టయి ఏడాదిన్నర జైల్లో గడిపారు. ఈ ముగ్గురూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇక వాయవ్య ఢిల్లీ అల్లర్ల కేసు (2020) నిందితులైన తాహిర్ హుస్సేన్, షిఫా-ఉర్-రహమాన్ కూడా జైల్లో ఉండి నామినేషన్లు వేశారు. నిరుడు లోక్‌సభ ఎన్నికలకు ముందు మద్యం పాలసీ స్కాం కేసులో కేజ్రీవాల్ అరెస్టయ్యారు. కానీ సీఎం పదవికి అప్పుడు రాజీనామా చేయలేదు. ప్రచారం నిమిత్తం ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. ఆయన విస్తృతంగా ప్రచారం చేసినప్పటికీ ఢిల్లీలో ఒక్కచోట కూడా ఆప్ అభ్యర్థిని గెలిపించుకోలేకపోయారు. పంజాబ్‌లో ఆప్ మూడు స్థానాలకే పరిమితమైంది. హరియాణాలో కనీసం పోటీ ఇవ్వలేకపోయింది. కేజ్రీవాల్‌పై ఓటర్లు సానుభూతి చూపలేదని, ఆప్‌పై వారు పెట్టుకున్న భ్రమలు తొలగిపోయాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే, సీఎం కార్యాలయానికి వెళ్లరాదని.. ఫైళ్లపై సంతకాలు చేయరాదన్న షరతులతో మద్యం కేసులో సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన తన పదవికి రాజీనామాచేసి.. ఆతిశీని సీఎం స్థానంలో కూర్చోబెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ మళ్లీ గెలిచాకే ఆ పదవి చేపడతానని శపథం చేశారు. కాంగ్రెస్‌తో కూడా తెగతెంపులు చేసుకున్నారు. తనను దొంగగా చిత్రించేందుకే బీజేపీ తనను అరెస్టు చేయించిందని విస్తృతంగా ప్రచారం చేశారు. కాగా.. జైలుకు వెళ్లడం అభ్యర్థుల విజయావకాశాలను ఏ మాత్రం ప్రభావితం చేయదని ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్ అభిషేక్ వ్యాఖ్యానించారు. దేశంలో చాలా మంది నేతలపై క్రిమినల్ కేసులున్నాయని.. అవి వారి రాజకీయ జీవితాలను దెబ్బతీయలేదన్నారు. ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం.. ఢిల్లీలో పోటీచేస్తున్న అభ్యర్థుల్లో 19% మందిపై క్రిమినల్ కేసులున్నాయి.

ఢిల్లీ ముస్లిం ఓటర్ల డైలమా!

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలో అక్కడి ముస్లిం ఓటర్లు తేల్చుకోలేకపోతున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఢిల్లీ ఓటర్ల సంఖ్య 1.55 కోట్లు. ఇందులో 13% మంది ముస్లిం ఓటర్లు ఉన్నట్లు అంచనా. మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో కనీసం ఏడు చోట్ల పెద్ద సంఖ్యలోనే ముస్లిం ఓటర్లు ఉన్నారు. పలు స్థానాల్లో ఫలితాలను ప్రభావితం చేయగల స్థాయిలో వారు ఉన్నారని తెలుస్తోంది. ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో మూడు రకాల ఆలోచనలు నడుస్తున్నాయి. మొదటిది.. బీజేపీని ఎలాగైనా అడ్డుకోవాలి. ఇందుకోసం ఆప్ పార్టీకే ఓటేయాలి. రెండోది.. 2020లో ఢిల్లీలో అల్లర్లు జరిగినప్పుడు ఆప్ తమను గాలికొదిలేసిందని పలువురు ముస్లింలు ఆగ్రహంతో ఉన్నారు. అందుచేత ఈసారి కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని భావిస్తున్నారు. మూడోది.. ఆప్, కాంగ్రెస్‌లతో వెళ్లడం వల్ల లాభం లేదని.. ఈ సారి ఎంఐఎంతో వెళ్దామని.. ఆ పార్టీ కనీసం ముస్లింల సమస్యలను లేవనెత్తుతోందని ఈ ఆలోచన ఉన్నవారు అంటున్నారు. 2020 అల్లర్ల సూత్రధారులుగా భావిస్తున్న తాహిర్ హుస్సేన్, షిఫా-ఉర్-రహమాన్ ఎంఐఎం అభ్యర్థులుగా పోటీచేస్తుండడంతో మూడో ఆలోచనపై కొందరిలో మొగ్గు కనిపిస్తోంది.

మేకిన్ ఇండియా గుడ్.. కానీ విఫలం!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం లోక్‌సభలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'మేకిన్ ఇండియా' కార్యక్రమం బాగుందని, ఇది మంచి ఆలోచనని చెప్పారు. అయితే.. ఆచరణలో ఇది విఫలమైందని తెలిపారు. "ప్రధాని ప్రతిపాదిత 'మేకిన్ ఇండియా' కార్యక్రమం నా దృష్టిలో మంచి ఆలోచన. దీని తాలూకు ఫలితం మీ ముందే ఉంది. జీడీపీలో తయారీ రంగం వాటా 2014లో 15.3 శాతం ఉండగా, ప్రస్తుతం అది 12.6 శాతానికి పడిపోయింది. 60 ఏళ్ల చరిత్రలో అత్యంత కనిష్ఠస్థాయికి దిగజారడం ఇదే ప్రథమం. నేనేమీ ప్రధానిని తప్పుపట్టడం లేదు. ఆయన ప్రయత్నించలేదని చెప్పడమూ సరికాదు. ప్రధాని ప్రయత్నించారు. కానీ, విఫలమయ్యారు" అని వ్యాఖ్యానించారు. ఒక దేశంగా ఉత్పత్తి రంగంలో విఫలమై.. దీనిని చైనా చేతిలో పెట్టామని ఆయన విమర్శించారు. అదేవిధంగా ఉద్యోగ, ఉపాధి కల్పనపై రాహుల్ మాట్లాడుతూ.. "మనం వృద్ధి చెందుతున్నాం. కానీ.. మనం ఎదుర్కొంటున్న సార్వత్రిక సమస్య నిరుద్యోగం. దీనిని పరిష్కరించలేకపోతున్నాం. గత యూపీఏ ప్రభుత్వం కావొచ్చు, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం కావొచ్చు. నిరుద్యోగ సమస్యకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నాం" అని అన్నారు. ఇక, రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగంపై కూడా రాహుల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె ప్రసంగం బోర్ కొట్టిందన్నారు. కృత్రిమ మేధ(ఏఐ) గురించి ప్రస్తావిస్తూ.. మనం ఈ రంగంలో చైనా కంటే పదేళ్లు వెనుకబడ్డామని ఆక్షేపించారు.

మహాకుంభ్ తొక్కిసలాటలో వేలాది మరణాలు

ఇది నా అంచనా.. అసలు లెక్క చెప్పండి.. రాజ్యసభలో ఖర్గే సంచలన వ్యాఖ్యలు

- సంగమంలో శవాలు విసిరేశారు
- మహాకుంభ్ కలుషితం: జయా బచ్చన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: మహాకుంభమేళాలో ఇటీవల చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన పార్లమెంటు ఉభయ సభలనూ కుదిపేసింది. విపక్ష పార్టీలకు చెందిన సభ్యులు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మౌని అమావాస్య సందర్భంగా కోట్ల మంది భక్తులు వస్తారని తెలిసినా సరైన ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని సభ్యులు ఆరోపించారు. తొక్కిసలాట ఘటనలో వేలాది మంది చనిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే సంచలన ప్రకటన చేశారు. వారందరికీ నివాళులర్పిస్తున్నానన్నారు. దీనిపై అధికార పక్ష సభ్యుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీనిపై స్పందించిన చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్.. ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఖర్గే స్పందిస్తూ.. "తొక్కిసలాట మృతుల విషయంలో ఇది నా అంచనా! ఒకవేళ ఇది తప్పయితే వాస్తవం ఏంటో మీరు చెప్పండి. సరిచేసుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నా" అని అన్నారు. ఎవరినో తప్పుపట్టేందుకు తాను 'వేలాదిమంది' అని అనలేదని, కనీసం ఇప్పటికైనా ఎంత మంది చనిపోయారో సమాచారం ఇస్తారని అలా అన్నానని తెలిపారు. ఒకవేళ తాను తప్పు చేసి ఉంటే క్షమాపణలు చెబుతానన్నారు. తొక్కిసలాటలో ఎంత మంది మృతి చెందారో.. ఎంత మంది అదృశ్యమయ్యారో ఇప్పటికైనా లెక్కలు చెప్పాలన్నారు.

మృతదేహాలను విసిరేశారు: జయా బచ్చన్

తొక్కిసలాటలో మృతి చెందిన వారి పార్థివ దేహాలను సంగమంలోకి విసిరేశారని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) సభ్యురాలు జయా బచ్చన్ ఆరోపించారు. దీంతో పవిత్ర మహాకుంభమేళా కలుషితం అయిపోయిందన్నారు. ఆమె పార్లమెంటు బయట మీడియాతో మాట్లాడారు. "ప్రస్తుతం నీరు ఎక్కువగా కలుషితం అయింది ఎక్కడ? కచ్చితంగా అది కుంభ్‌లోనే. ఎందుకంటే తొక్కిసలాట మృతుల పార్థివ దేహాలను సంగమంలోనే పడేశారు" అన్నారు.

లోక్‌సభలో తీవ్ర నిరసన

మహా కుంభమేళా తొక్కిసలాట ఘటనపై లోక్‌సభలో విపక్ష పార్టీల సభ్యులు ఆందోళన చేశారు. ఈ ఘటనపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని రద్దు చేసి తొక్కిసలాట ఘటనపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ నేతలు గౌరవ్ గొగోయ్, కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని దుయ్యబట్టారు. తొక్కిసలాట ఘటన విపత్తు కాదని, ప్రభుత్వ వైఫల్యమేనని సమాజ్‌వాదీ ఎంపీ నరేశ్ చంద్ర అన్నారు. సర్కారు వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు.

సోనియాపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు

కాంగ్రెస్ ఎంపీ సోనియాకు వ్యతిరేకంగా 40 మంది బీజేపీ సభ్యులు రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిచ్చారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తర్వాత ఆమెపై సోనియా అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఎంపీలు ఆరోపించారు. 'పాపం పూర్ లేడీ' అంటూ రాష్ట్రపతిని అవమానించారన్నారు.

మైతేయీలను తుపాకులు దోచుకోనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)



సమర్పించారు. కేంద్రం, మణిపూర్ సర్కారు తరఫున వాదనలను వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(సీఎఫ్ఎస్ఎల్) పరిశీలన జరగాలని, మూడు వారాల గడువు కావాలని కోరారు. దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. సీల్డ్ కవర్‌లో సమగ్ర నివేదికను అందజేయాలని సీఎఫ్ఎస్ఎల్‌ను ఆదేశించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. గత ఏడాది మే 3 నుంచి మణిపూర్‌లోని మైదాన ప్రాంతాలకు చెందిన మైతేయీలు, కొండ ప్రాంతాలకు చెందిన కుకీలకు మధ్య జరిగిన ఘర్షణల్లో 200 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.! ఈ హింసతో 70 వేల మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. జాతుల మధ్య వైరానికి సీఎం బీరేన్‌సింగ్ ప్రేరేపించారనే ఆరోపణలకు సంబంధించిన ఆడియో క్లిప్‌లపై కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్(కోహుర్) అప్పట్లోనే సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై తొలుత అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కోహుర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలను వినిపించారు. నవంబరు 14న జరిగిన విచారణలో.. సీఎం బీరేన్‌దిగా చెబుతున్న ఆడియో క్లిప్‌నకు ఫోరెన్సిక్ పరీక్ష నిర్వహించాలని.. అత్యంత విశ్వసనీయమైన ప్రైవేట్ ఎఫ్ఎస్ఎల్ ట్రూత్ ల్యాబ్స్‌లో ఆ పరీక్షలు జరిపేందుకు అనుమతినివ్వాలని కోరారు. కోర్టు అనుమతితో ప్రశాంత్ భూషణ్ ట్రూత్ ల్యాబ్స్‌ను సంప్రదించగా.. గత నెల 18న నివేదిక వచ్చింది. ఆడియోలో ఉన్న వాయిస్‌కు.. సీఎం బీరేన్‌కు చెందిన వాయిస్‌కు మధ్య 93% సారూప్యత ఉందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఈ కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారిస్తోంది. సోమవారం జరిగిన విచారణ సందర్భంగా ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి ట్రూత్ ల్యాబ్స్ నివేదికను సమర్పించారు. అయితే విచారణ ప్రారంభానికి ముందు.. ధర్మాసనంలో తాను ఉండడం పిటిషనర్‌కు అభ్యంతరమా? అని జస్టిస్ సంజయ్‌కుమార్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌ను పరోక్షంగా అడిగారు. దానికి ప్రశాంత్ భూషణ్ ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. మణిపూర్ హింసకు సీఎం బీరేన్ ప్రేరేపించారని, ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని ధర్మాసనాన్ని కోరారు. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషన్ వేసిన కోహుర్ సంస్థ వివాదాస్పదమైనదని.. రాజ్యాంగంలోని 226వ అధికరణ మేరకు ఈ కేసును మణిపూర్ హైకోర్టు విచారించాలని వ్యాఖ్యానించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కేసును మేము విచారించాలా? మణిపూర్ హైకోర్టా? అనేదాన్ని తదుపరి విచారణ సందర్భంగా నిర్ణయిస్తామని వ్యాఖ్యానించింది.


క్యాన్సర్ కబళిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కూడా భారత్ సహా ఆగ్నేయాసియా అంతటా క్యాన్సర్ కేసులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆగ్నేయాసియా ప్రాంతంలో 2022లో కొత్తగా 24 లక్షల కేసులు బయటపడ్డాయని, వారిలో 56 వేల మంది చిన్నారులు కూడా ఉన్నారని తెలిపింది. 2022లో క్యాన్సర్‌తో 15 లక్షల మంది చనిపోయారని వెల్లడించింది. ఈ ప్రాంతంలో నోటి, గర్భాశయ, బాల్య కేన్సర్లు ఎక్కువగా నమోదయ్యాయని డబ్ల్యూహెచ్‌వో ఆగ్నేయాసియా ప్రాంత డైరెక్టర్ సైమా వాజెద్ సోమవారం తెలిపారు. 2050 నాటికి ఈ ప్రాంతంలో కొత్త క్యాన్సర్ కేసులు, మరణాలు 85 శాతం పెరిగే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ఆయా ప్రభుత్వాల నేతృత్వంలో డబ్ల్యూహెచ్‌వో, ఇతర భాగస్వాముల మద్దతుతో పెరుగుతున్న క్యాన్సర్ ముప్పుని ఎదుర్కోవడానికి ఈ ప్రాంతాన్ని సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని వాజెద్ పిలుపునిచ్చారు.

సమష్టి పోరాటం అవసరం

మానవాళికి సవాల్ విసురుతున్న క్యాన్సర్ గురించి అవగాహన పెంచడం, దాని నివారణకు చర్యలు తీసుకోవడం, ముందస్తుగానే గుర్తించి మెరుగైన చికిత్సను ప్రోత్సహించడం వంటి లక్ష్యాలతో ప్రతిఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎంపిక చేసిన థీమ్ 'యునైటెడ్ బై యూనిక్'.. కూడా క్యాన్సర్‌కు వ్యతిరేకంగా సమిష్టిగా పోరాడాలని సూచిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌ను కట్టడి చేయడానికి డబ్ల్యూహెచ్‌వో కృషి చేస్తోంది. అయినప్పటికీ ఆగ్నేయాసియాలో క్యాన్సర్ బాధితులు పెరగడంపై సైమా వాజెద్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలోని కొన్ని దేశాలు క్యాన్సర్ నియంత్రణలో గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయని అంటూనే.. దీనికోసం మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. భూటాన్ 2020లో హెల్త్ ఫ్లాగ్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేసిందని తెలిపారు. ఇక్కడి 'క్యాన్సర్ ఎనీవేర్' కార్యక్రమం ద్వారా థాయ్‌లాండ్ క్యాన్సర్ నిర్వహణకు యూనివర్సల్ హెల్త్ కవరేజీ విధానాన్ని అవలంబిస్తోందని వాజెద్ చెప్పారు. ఎనిమిది దేశాలు వ్యాక్సినేషన్‌ను ప్రవేశపెట్టాయన్నారు. స్థానిక సంస్థల ద్వారా పిల్లల్లో వచ్చే క్యాన్సర్ల నియంత్రణకు పది దేశాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. ఆగ్నేయాసియా ప్రాంతంలో క్యాన్సర్‌కు కారణమైన పొగాకు వాడకం బాగా తగ్గిందని.. ఈ దిశగా డబ్ల్యూహెచ్‌వో అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేసిందని చెప్పారు. క్యాన్సర్ నియంత్రణకు దేశాలు తీసుకుంటున్న చర్యలు ఏకరీతిగా లేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న క్యాన్సర్ నివారణ చర్యలు, కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. ఇది లక్షలాది కొత్త కేసులకు దారితీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగ్నేయాసియా ప్రాంతంలో సభ్యదేశాలతో కలిసి 2024-2030 మధ్య క్యాన్సర్ నివారణ, నిర్వహణ కోసం ప్రాంతీయ వ్యూహాన్ని రూపొందించిందని, దీని అమలుకు 77వ ప్రాంతీయ కమిటీ ఆమోదించిందని వాజెద్ పేర్కొన్నారు.



ఐఐటీ మద్రాస్‌లో కేన్సర్ జీనోమ్ డేటాబేస్ ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ ఉన్నత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఐఐటీ-మద్రాస్ తొలిసారిగా కేన్సర్ జీనోమ్ డేటాబేస్‌'ను ప్రారంభించింది. ఈ విషయాన్ని ఐఐటీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ వి కామకోటి ప్రకటించారు. వివిధ రకాలైన కేన్సర్ చికిత్సల కోసం జన్యుపరమైన ఖాళీని భర్తీ చేసేందుకు వీలుగా కేన్సర్ జీనోమ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా సేకరించిన 480 బ్రెస్ట్ కేన్సర్ రోగుల కణజాల నమూనాల నుంచి 960 ఎక్సోమ్ సీక్వెన్సింగ్‌ను పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. భారత్ కేన్సర్ జీనోమ్ అట్లాస్ (బీసీజీఏ) పేరుతో ఈ డేటాబేస్‌ను విడుదల చేసినట్టు వెల్లడించారు.


టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి డీడీ అందజేస్తున్న మోహన

జీవితంలో దాచిన ప్రతి పైసా శ్రీవారికే..

- టీటీడీకి 50 లక్షలు విరాళం అందజేసిన మహిళ
- శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ ట్రస్ట్‌కు అందజేత

తిరుమల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి సోమవారం ఓ అరుదైన విరాళం అందింది. భారత్ సహా వివిధ దేశాల్లో విపత్తు అధికారిగా సేవలందించిన రేణిగుంటకు చెందిన సీ మోహన తన జీవితకాలంలో ఆదా చేసిన ప్రతి పైసాను శ్రీవారికి కానుకగా ఇచ్చారు. టీటీడీకి చెందిన శ్రీ వేంకటేశ్వర సర్వ శ్రేయాస్ (ఎస్వీ బాలమందిర్) ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళంగా అందజేసిన ఆమె వాటిని టీటీడీ విద్యా సంస్థల్లో చదువుతున్న అనాథ, పేద పిల్లల సంక్షేమం కోసం వినియోగించాలని కోరారు. విరాళం మొత్తాన్ని మంగళవారం డీడీ రూపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

ఒక్కొక్కటిగా పరిష్కారం...

- 'ఆంధ్రజ్యోతి' సదస్సులో లేవనెత్తిన సమస్యలపై చర్యలు



నూజివీడులో పారిశుధ్య పనులు చేపడుతున్న మున్సిపల్ అధికారులు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన "అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా" సదస్సులో లేవనెత్తిన ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు సోమవారం నూజివీడు ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టారు. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మురుగు కాలువల్లో ఎవరైనా వ్యర్థాలు వేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు. కుక్కలు, కోతుల దాడుల వల్ల ప్రజలు గాయాల పాలవుతున్న విషయాన్ని స్థానికులు ప్రస్తావించిన నేపథ్యంలో.. ఈ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. కుక్కల సంతతి నివారణకు ప్రత్యేకంగా వ్యాక్సినేషన్ నిర్వహించేందుకు వాటిని పట్టి తరలించారు.



నేడు సప్త వాహనాలపై శ్రీవారి విహారం

తిరుమలలో ఘనంగా రథసప్తమి ఏర్పాట్లు

తిరుమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమికి తిరుమల క్షేత్రం సిద్ధమయ్యింది. మంగళవారం తిరుమలలో ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఏడు ప్రధాన వాహనాలపై శ్రీవారు విహరిస్తారు. వాహన సేవలను తిలకించేందుకు దాదాపు 3 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా. వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటను దృష్టిలో పెట్టుకుని మాడవీధుల్లో పటిష్ట ఏర్పాట్లు చేశారు. పుష్ప, విద్యుత్ అలంకరణలతో తిరుమల క్షేత్రాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ముందుగా సూర్యప్రభ వాహనం ఆ తర్వాత వరుసగా చిన్న శేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు విహరిస్తారు.

అరసవల్లిలో రథసప్తమి వేడుకలు ప్రారంభం

- ఆదిత్యునికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం
- పట్టువస్త్రాలు సమర్పించిన దేవదాయశాఖ ముఖ్య కార్యదర్శి

శ్రీకాకుళం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో కొలువైన శ్రీసూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు సోమవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయి. రాత్రి 12 గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించారు. 12.30 గంటలకు దేవదాయశాఖ తరఫున ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఒంటిగంటకు స్వామివారికి క్షీరాభిషేకం ఆరంభమైంది. రాత్రి 10.30 గంటల నుంచే సుదూర ప్రాంతాల నుంచి భక్తులు శ్రీకాకుళం చేరుకుని.. క్యూలైన్లో వేచి ఉన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈసారి సామాన్య భక్తులు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా నేరుగా వెళ్లి దర్శనం చేసుకునేలా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి దర్శనానికి వచ్చారు.


అరసవల్లిలో సోమవారం రాత్రి క్యూలైన్లలో ఉన్న భక్తులు

చేనేత జౌళి శాఖ | అవినీతి 'కార్పెట్'

రూ.210 కార్పెట్.. తెలంగాణలో రూ.316కు కొనుగోలు

- 2.99 లక్షల వస్త్రాలకు ఆర్డర్.. ఇప్పటికే 23,481 సేకరణ
- వెలుగులోకి వస్తున్న అధికారుల అవినీతి లీలలు
- కమీషన్ల కోసం ఏపీ చేనేతలకు అన్యాయం
- సర్కారుకు ఫిర్యాదులు.. విజిలెన్స్ విచారణ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మన రాష్ట్రంలోని చేనేత కార్మికుల పొట్ట కొట్టి అధికారులు పొరుగు రాష్ట్రంలో అవినీతి కార్పెట్ పరిచారు. ఇక్కడ కార్పెట్లు అందుబాటులో ఉన్నా కొనకుండా తెలంగాణలో అధిక ధర చెల్లించారు. తెలంగాణ సర్కారు అక్కడి ప్రభుత్వ అవసరాలకు ఒక్కో కార్పెట్ రూ.210కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీ అధికారులు అవే కార్పెట్లను రూ.316కు కొనుగోలు చేస్తున్నారు. అంటే.. ఒక్కోదానిపై రూ.106 ఎక్కువ. మొత్తం 2.99 లక్షల కార్పెట్లకు ఆర్డర్ ఇవ్వగా.. ఇప్పటికే 23,481 సేకరించారు. చేనేత జౌళి శాఖ అధికారుల అవినీతి లీలలు వెలుగులోకి రావడంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించబోతోంది. ఎవరెవరి పాత్ర ఏమిటి? కమీషన్లు ఎవరికి అందాయి? సూత్రధారులు ఎవరు? మధ్యవర్తుల లింకు లేంటి? చేనేత సొసైటీలకు, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేసిన మోసం ఎంత? తదితర వివరాలను విజిలెన్స్ అధికారులు సేకరించినట్లు తెలిసింది. చేనేత కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఒక అధికారి సొంత ప్రాంతం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నడిరోడ్డుపై దుస్తులు విక్రయిస్తున్న నేతన్నల దుస్థితిని ఫొటోలతో సహా ప్రభుత్వానికి అందజేసినట్లు సమాచారం.



సర్కారుకు ఫిర్యాదులు

వ్యవసాయం తర్వాత గ్రామీణుల్లో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత పరిశ్రమే. ఏపీలో లక్షన్నరకు పైగా చేనేత మగ్గాలు ఉండగా.. వాటిలో లివరీ వస్త్రాలు కూడా తయారవుతున్నాయి. రాష్ట్రంలో చేనేత సొసైటీల వద్ద వస్త్ర నిల్వలను పరిగణనలోకి తీసుకోకుండా తెలంగాణలోని మ్యాక్ సొసైటీల్లో ఏపీ అధికారులు కొనుగోలు చేయడంపై ప్రభుత్వానికి, విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందాయి. మొత్తం వ్యవహారంలో ఆప్కో అధికారితో పాటు ఒక టెక్నీషియన్ సూత్రధారిగా ఉన్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు చేసిన ఫిర్యాదులో చేనేతలు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు దీనిపై ఆరా తీశారు. చేనేత జౌళి శాఖ అధికారులను సీఎంవో అధికారి ప్రశ్నించారు. అక్రమాలు జరిగినట్లు సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు వెల్లడించారు. రాష్ట్రంలో చేనేతలు ఆత్మహత్యలు చేసుకొంటున్నా పట్టని సంబంధిత అధికారులు పొరుగు రాష్ట్రంలో కొనుగోళ్ల వెనుక భారీ అవినీతికి పాల్పడినట్లు సమాచారం. డిసెంబరు మొదటి వారంలో 2.99 లక్షల దుప్పట్లు, కార్పెట్లు ఇతర లివరీ వస్త్రం కోసం ఏపీ చేనేత జౌళి శాఖ అధికారులు తెలంగాణలోని కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని చేనేత సొసైటీలకు ఆర్డర్లు ఇచ్చారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి నివేదిక త్వరలో ఇస్తామని సీఎంవో అధికారులకు ప్రాథమిక నోట్ ద్వారా తెలియజేసినట్లు సమాచారం. కర్నూల జిల్లాకు చెందిన ఒక అధికారి, ఆయనతో అంటకాగిన వారిపై వేటు తప్పదనే చర్చ జరుగుతోంది.

సర్కారు ఆదేశించినా..

ప్రభుత్వ శాఖలు అవసరమైన లివరీ వస్త్రాలను తప్పనిసరిగా చేనేతల నుంచి కొనుగోలు చేయాలి. చంద్రబాబు ప్రభుత్వం ఈ మేరకు స్పష్టమైన జీవో జారీ చేసింది. అయినా కమీషన్లకు అలవాటు పడ్డ చేనేత జౌళి శాఖ అధికారులు అవేవీ పట్టించుకోకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణతో పోలిస్తే రాష్ట్రంలో పది రెట్లు ఎక్కువగా చేనేత మగ్గాలు ఉన్నా ఇక్కడి ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన దుప్పట్లు, తువ్వాళ్లు, బెడ్ షీట్లు పొరుగు రాష్ట్రం నుంచి కొనుగోలు చేస్తున్నారు. లివరీ బెడ్ షీట్లు సంక్షేమ శాఖల అవసరాలకు సరిపడా ఏపీలోని చేనేత సొసైటీల్లో ఉత్పత్తి లేదని ఆప్కో అధికారులు చెబుతున్నారు. అందులో వాస్తవం లేదని.. కర్నూలు, కడప, మంగళగిరి, రాజమహేంద్రవరం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని చేనేత సొసైటీల్లో లివరీ వస్త్రాలు నిల్వ ఉన్నాయని చేనేత సహకార సంఘాలు ప్రభుత్వానికి లేఖ రాశాయి. పొరుగు రాష్ట్రంలోని మ్యాక్ సొసైటీల్లో ఆప్కో కొనుగోలు చేయడం వెనుక అవినీతి ఉందని ఆరోపించాయి. ఆప్కో అధికారులు చెబుతున్నది అబద్ధమని రుజువు చేస్తామంటూ విజిలెన్స్ అధికారులకు ఆధారాలు పంపుతున్నాయి.

31.52 టన్నుల ధాన్యం కొనుగోలు

- రైతుల ఖాతాల్లో రూ.7,222 కోట్ల జమ: మంత్రి నాదెండ్ల వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 5,00,352 మంది రైతుల నుంచి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 31,52,753 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రభుత్వానికి ధాన్యాన్ని విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.7,222.35 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ఇది తమ కూటమి ప్రభుత్వం సాధించిన ఘనత అని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మనోహర్ పేర్కొన్నారు.

హైవేలతో రాష్ట్ర రహదారుల అనుసంధానం

- 3,500 కి.మీ. రహదారులకు ప్రణాళిక సిద్ధం
- ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



తాడిపత్రి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఫోర్‌లైన్, డబుల్‌లైన్ రహదారులను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దీనికోసం 3,500కి.మీ. మేర పీపీ మోడల్ తరహాలో అంచనాలు తయారు చేశామని, త్వరలో కేంద్రమంత్రి గడ్కరీని కలిసి వీటిని అందజేస్తామని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనతో రాష్ట్రం నాశనమైందని విమర్శించారు. రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయని, ఆ గుంతలను పూడ్చడానికి కూటమి ప్రభుత్వం రూ.1,061 కోటు మంజూరు చేసిందని తెలిపారు. మొత్తం 23,400 కి.మీ. మేర రహదారులు పాడవగా, ఆరు నెలల్లోనే 18వేల కి.మీ. రహదారులపై గుంతలు పూడ్చి, నాణ్యమైన రహదారులు వేశామని చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఇప్పటికే 5 లక్షల ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు.

మహిళా వైద్యులకు ప్రోత్సాహం: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహిళా వైద్యులు తమ నైపుణ్యం, కరుణతో ఆరోగ్యకరమైన ప్రపంచ నిర్మాణానికి మార్గం సుగమం చేస్తున్నారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన మహిళా వైద్యులకు అభినందనలు తెలిపారు. ఆరోగ్య రంగంలో మహిళా వైద్యుల అంకిత భావం, సహాయ సహకారాలకు వందనాలు తెలిపారు.

పీఏసీఎస్‌లు రద్దు చేస్తే పోరాటమే

- సహకార సంఘ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా(పీఏసీఎస్)లను నష్టాలు వస్తున్నాయన్న నెపంతో రద్దు చేస్తారన్న సమాచారం వస్తోందని, అదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్‌ల నష్టానికి జిల్లా బ్యాంకుల విధానాలే కారణమని ఆరోపించారు.

ఫీజు పోరు జగన్ ప్యాలెస్ ముందు చేయాలి

- 3 వేల కోట్లు బకాయి పెట్టిన వైసీపీ ప్రభుత్వం: బ్రహ్మం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'ఫీజు పోరు చేయాల్సింది కలెక్టరేట్ల ముందు కాదు. జగన్ యలహంక ప్యాలెస్ ముందు చేయాలి' అని వైసీపీ శ్రేణులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం సూచించారు. సోమవారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'లోకేశ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి విద్యార్థుల్లో మానసిక ధైర్యాన్ని కల్పించారు. ధర్నాల ద్వారా వైసీపీ నాయకులు తమ ముఖాలపై పేడ నీళ్లు చల్లించుకోవడానికి సిద్ధంగా ఉండాలి. 2024 వరకు వైసీపీ ప్రభుత్వం విద్యార్థుల తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సుమారు రూ.3,000 కోట్లు బకాయిపెట్టి పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎనిమిది నెలల్లో మంత్రి లోకేశ్, రూ.800 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం కోడిగుడ్ల బకాయిలు రూ.200కోట్లు, చిక్కీల బకాయిలు రూ.56కోట్లు, విద్యార్థులకు బ్యాగులు, బెల్టులు, బూట్లు బకాయిలు రూ.920కోట్లు పెట్టింది' అని బ్రహ్మం వివరించారు.

అంతరిక్ష పరిశోధనలకు 13,415 కోట్లు

- ప్రధాని మోదీకి ఇస్రో చైర్మన్ నారాయణన్ కృతజ్ఞతలు


ఇస్రో చైర్మన్ నారాయణన్‌ను సత్కరిస్తున్న గ్రామస్థులు

చెన్నై, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో భారత అంతరిక్ష పరిశోధనలకు రూ.13,415 కోట్లు కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నారాయణన్ స్వగ్రామం కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని మేలకాట్టువిలై గ్రామస్థులు సోమవారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణన్ విలేకరులతో మాట్లాడుతూ... ఇటీవలే వందో రాకెట్ జీఎస్ఎల్వీ ఎఫ్-15ను విజయవంతంగా ప్రయోగించామని, ఇస్రో ఉద్యోగుల సమష్టి కృషికి ఈ విజయం నిదర్శనమని కొనియాడారు.

నేడు ఢిల్లీకి లోకేశ్.. కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, రైల్వే, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యేందుకు లోకేశ్ ఢిల్లీ వెళుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఢిల్లీ చేరుకుంటారు. సాయంత్రం 5.45 గంటలకు కేంద్ర మంత్రితో భేటీ అవుతారు. అనంతరం బుధవారం రాత్రే రాష్ట్రానికి తిరిగివస్తారు. ఏపీ ప్రభుత్వం కృత్రిమ మేధ(ఏఐ)కు అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విశ్వవిద్యాలయం ఏర్పాటు వంటి అంశాలపై కేంద్ర మంత్రితో లోకేశ్ చర్చించనున్నారు. కృత్రిమ మేధపై శిక్షణ, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు ఆర్టిఫిషియల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు ప్రారంభించనున్న నేపథ్యంలో వాటికి కేంద్రం నుంచి సహకారాన్ని కోరనున్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న... అందరి కోరిక: బాలకృష్ణ



హిందూపురం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'మా నాన్న నందమూరి తారకరామారావుకు భారతరత్న రావాలన్నది అందరి కోరిక' అని శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. హిందూపురంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'నాకు పద్మభూషణ్ వచ్చిన రోజుకంటే ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చిన రోజు ఎక్కువ సంతోషపడతా. ఎన్టీఆర్‌కు భారతరత్న వస్తుందని చాలా నమ్మకంగా ఉంది. వస్తుంది. నేను నటించిన పాత్రలకు ప్రజలు ఆమోదం తెలిపినందుకే నాకు ఈ అవార్డు దక్కిందని అనుకుంటున్నా. పద్మభూషణ్ రావడంతో నాలో కసి పెరిగింది. నేను నటించే పాత్రలను సవాల్‌గా తీసుకుంటా. నా పాత్రకు నేనే చాలెంజ్. పదవులకు నేను అలంకరణేమో కానీ, పదవులు నాకు అలంకరణ కాదు. నా రెండో ఇన్నింగ్స్ ప్రారంభమైంది' అని బాలకృష్ణ అన్నారు.


నెల్లూరు వీఆర్సీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సీపీఎం అగ్రనేతలు బృందాకరాత్, ఎంఏ బేబి, రాఘవులు, శ్రీనివాసరావు తదితరులు

రాష్ట్రాల అధికారాలను బుల్‌డోజ్ చేస్తున్న మోదీ

మతతత్వ వ్యతిరేక పోరాటాలకు సీపీఎం సిద్ధం: బృందాకరాత్

నెల్లూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల సార్వభౌమాధికారాలను బుల్‌డోజర్ పెట్టి తొక్కేస్తున్నాడు. ఏపీ సీఎం చంద్రబాబు ఆయనకు వంతపాడుతున్నాడు. దేశంలో లౌకిక వాదాన్ని పరిరక్షించడానికి ఎర్ర జెండాలు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాయి. మతతత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడటానికి సీపీఎం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది' అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరాత్ అన్నారు. నెల్లూరులో మూడు రోజులుగా జరుగుతున్న సీపీఎం 27వ మహాసభలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా సాయంత్రం నగరంలోని వీఆర్సీ మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. నరేంద్ర మోదీ, చంద్రబాబుపై ఘాటుగా విమర్శలు సంధించారు. ఆర్థిక గణన సర్వే ప్రకారం గత పదేళ్ల మోదీ పాలనలో దేశం 40 సంవత్సరాలు వెనుకబడిపోయిందని అన్నారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందనీ, రాష్ట్ర కేటాయింపుల్లో రూ.1.10 లక్షల కోట్ల కోత పడిందని కరాత్ అన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ, రాష్ట్ర విభజనకు చంద్రబాబే కారణమని అన్నారు. ఆ రోజు చంద్రబాబు వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడానికి అంగీకరించాడన్నారు. కృష్ణపట్నం పోర్టు నుంచి కంటైనర్ టెర్మినల్‌ను అదానీ తరలించినా చంద్రబాబు దాని గురించి నోరు మెదపడం లేదన్నారు. కంటైనర్ టెర్మినల్ మూసివేయడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడినా చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. సుదీర్ఘకాలం మంత్రులుగా ఉన్న వీరు వెలుగొండ, సీతారామ్‌సాగర్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా పార్టీ కార్యదర్శి మూలం రమేశ్ అధ్యక్షత వహించిన ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ బేబి, ఎంఏ గఫూర్, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితర నాయకులు పాల్గొన్నారు. కాగా, సభకు ముందు సీపీఎం నాయకులు, కార్యకర్తలు నగరంలోని ఆత్మకూరు బస్టాండు నుంచి వీఆర్‌సీ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులతో కార్యదర్శి శ్రీనివాసరావు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గం ఎన్నిక

- కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన శ్రీనివాసరావు
- ముగిసిన పార్టీ 27వ రాష్ట్ర మహాసభలు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా నెల్లూరులో జరుగుతున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. చివరి రోజు జరిగిన రాష్ట్ర ప్రతినిధుల సభలో పాల్గొన్న 510 మంది ప్రతినిధులు రాష్ట్ర నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వీ శ్రీనివాసరావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శివర్గంలోని 15 మందిలో 13 మంది పాతవారే. వీరిలో శ్రీనివాసరావుతోపాటు వై.వెంకటేశ్వర్లు, సీహెచ్.బాబూరావు, కె.ప్రభాకరరెడ్డి, డి.రమాదేవి, బి.తులసీదాస్, వి.వెంకటేశ్వర్లు, కే.లోకనాథం, కిల్లో సురేంద్ర, కె.సుబ్బరామమ్మ, ఏవీ.నాగేశ్వరరావు, మూలం రమేశ్, వి.రాంగోపాల్, వి.ఉమామహేశ్వరరావు, బి.బలరాం ఉన్నారు. ఈ కమిటీ మూడేళ్లపాటు కొనసాగుతుంది. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, 'ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తాం. నేడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ మతతత్వ శక్తులు పెట్రేగి పోతున్నాయి. ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ప్రస్తుతం కార్పొరేట్ శక్తులు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయి. అలాగే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు బలవంతంగా రుద్దుతున్నాయి. ఈ చర్యలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఎం తరఫున పార్టీలోని విద్యావంతులు పోటీలో ఉన్నారు. వారి గెలుపునకు అందరూ కృషి చేయాలి' అని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

మావోయిస్టు మృతి... కొనసాగుతున్న గాలింపు

చింతూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల వేట కొనసాగుతోంది. కాంకేర్, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. రెండు జిల్లాల సరిహద్దులో నార్త్ బస్తర్ మాడ్ డివిజన్ మావోయిస్టు కమిటీ సంచరిస్తోందని పోలీసులకు సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్, బీఎస్ఎఫ్ జవాన్లు సంయుక్తంగా ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఘటనా స్థలంలో ఒక మావోయిస్టు మృతదేహాన్ని బలగాలు కనుగొన్నాయి. మృతదేహానికి సమీపంలో ఎస్ఎల్ఆర్ రైఫిల్, సోలార్ ప్లేట్, ఇతర పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. మరికొందరు మావోయిస్టులు మృతి చెంది ఉండవచ్చని, లేదా తీవ్రంగా గాయపడి ఉంటారని పోలీసులు చెప్తున్నారు. మృతి చెందిన మావోయిస్టును గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కాగా మాడ్ ప్రదేశంలో గాలింపు కొనసాగుతోంది.


ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో లభ్యమైన ఎస్ఎల్ఆర్ రైఫిల్, సోలార్ ప్లేట్, ఇతర పేలుడు సామగ్రి

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

ఎటపాక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని కలహండి ఏరియా కమిటీ సభ్యుడు సోడి ఉంగ అలియాస్ శీను, ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం జేగురుగొండ మావోయిస్టు పార్టీ సభ్యుడు హేమల భీమా పోలీసుల ఎదుట లొంగిపోయారు. అల్లూరి జిల్లా ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఓఎస్డీ జగదీశ్ అడహళ్లి ఈ వివరాలను వెల్లడించారు. ఉంగ అలియాస్ శీను మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 2016 మేలో జేగురుగొండ ఎల్‌వోఎస్ కమాండర్ సోడి లింగే సమక్షంలో సభ్యుడిగా చేరాడు. ఇతడు 2016, 2018, 2020 సంవత్సరాల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు దహనం చేసిన ఘటనల్లో పాల్గొన్నాడు. హేమల భీమా 2021లో మావోయిస్టు పార్టీలో సభ్యుడిగా చేరాడు. 2023లో జేగురుగొండ సమీపంలోని కుందేడు గ్రామ శివారులో జరిపిన దాడిలో పాల్గొన్నాడు. ఈ ఘటనలో ఆరుగురు పోలీసులు మరణించారు. ఉంగ అలియాస్ శీనుపై రూ.4లక్షలు, భీమాపై రూ.లక్ష రివార్డులు ఉన్నాయి.


లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న అల్లూరి జిల్లా ఓఎస్డీ జగదీశ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యమునా తీరాన...

దేశరాజధాని ఢిల్లీకి వాయుకాలుష్యం కంటే ప్రచార కాలుష్యం ఎక్కువ హాని చేస్తోందని ఓ మేధావి వాపోయారు. బుధవారం ఎన్నికలు జరగబోతున్నందున రాజధానివాసులను ఇంతకాలమూ కుదిపేసిన ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. అన్ని పార్టీల నాయకులు ఆఖరునిముషం వరకూ ప్రచారాన్ని హోరెత్తించారు. యాభైఐదుస్థానాలతో మూడోసారి అధికారంలోకి వస్తానని చెప్పుకున్న ఆమ్ ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మళ్ళీ ఎన్నికల సంఘంమీద విరుచుకుపడ్డారు. సీఈసీ రాజీవ్‌కుమార్‌కు రిటైర్‌మెంట్ అనంతరం బీజేపీ ఏదో పెద్దపదవి కట్టబెట్టబోతున్నదన్న రీతిలో ఆయన నర్మగర్భమైన వ్యాఖ్యలు చేశారు. యమునానది కాలుష్యంతో ఢిల్లీ ప్రజల ప్రాణాలను పొరుగురాష్ట్రం హర్యానా ప్రమాదంలో పడవేస్తున్నదని విమర్శలు చేసినందుకు, ఎన్నికలసంఘం పెద్దలు పిలిచి వివరణ కోరడం కేజ్రీవాల్‌కు నచ్చలేదు మరి.

ఇంతకూ హర్యానా ముఖ్యమంత్రి యమున నీటిని తాగారా, తాగినట్టు నటించారా, తాగినట్టే తాగి తిరిగి ఉమ్మేశారా? ఈ ప్రశ్నలకు సమాధానం తెలిసేలోగా ఢిల్లీ ఎన్నికలు ముగుస్తాయి, యమున కాలుష్యం అంశం వెనక్కుపోతుంది, ఎప్పటిలాగానే ఆ నది విషపు నురగలు కక్కుతూ ప్రవహిస్తూనే ఉంటుంది. ఈ వివాదం ఇప్పటిదేమీ కాదు కానీ, కేజ్రీవాల్‌కు యమున కాలుష్యం, తన ప్రజల ఆరోగ్యానికి ముంచుకొచ్చిన ప్రమాదం ఇలా ఎన్నికల ముందే గుర్తుకురావడం బాగోలేదు. హర్యానా నిర్లక్ష్యం కారణంగా మార్గమధ్యంలో కలుషితమై, దేశరాజధానిని చేరుతున్న యమున నీటిని తాము ఎంత అత్యాధునికమైన యంత్రాలు వినియోగించి శుభ్రపరిచినా ఫలితం లేకుండా పోతున్నదని కేజ్రీవాల్ పొరుగురాష్ట్రం మీద దాడిచేసి, పరోక్షంగా బీజేపీని ఆత్మరక్షణలోకి నెట్టేశారు. యమున నీళ్ళు బాగానే ఉన్నాయని అన్నందుకు, దమ్ముంటే తాగిచూపించడంటూ నీళ్ళబాటిళ్ళు ముందుపెట్టుకొని మరీ సవాలు చేశారు. నేరుగా నదిలోనే తాగుతానంటూ సవాలు చేసిన హర్యానా ముఖ్యమంత్రి సైనీ నిజానికి ఆ నీటిని తాగలేదని, కేవలం నటించారని ఆ తరువాత విమర్శలు చేశారు. యమున నీటినాణ్యత మీద ఇంత పట్టింపు ఉన్న కేజ్రీవాల్ ఎన్నికల వరకూ ఆగకుండా నీటినాణ్యతమీద ఎప్పుడో చర్చకు దిగాల్సింది. ఢిల్లీని కుదిపేస్తున్న వాయుకాలుష్యానికి కేంద్రాన్నీ, పొరుగురాష్ట్రాలనూ ఆయన ఎలాగూ తప్పుబడుతూనే ఉన్నారు. ఉద్యమాలకు, పోరాటాలకు కేజ్రీవాల్ పెట్టింది పేరు కనుక, యమున కాలుష్యంమీద హర్యానా నిర్లక్ష్యాన్ని ఎండగట్టి, దానినీ, కేంద్రాన్నీ దారికి తెచ్చి అమీతుమీ తేల్చుకోవాల్సింది. ఇదేమీ చేయకుండా, తాము ఇంతకాలమూ తాగుతున్న యమున నీటిని తమ పాలకుడే ఎన్నికల ముందు విషం అన్నందుకు ఢిల్లీ వాసులకు ఆగ్రహం కలుగుతుందో, నిజం చెప్పినందుకు బీజేపీ పెద్దలతో పాటు ఎన్నికల సంఘం కూడా ఆయన వేధిస్తున్నదని జాలి కలుగుతుందో చూడాలి.

రాజధానిని చేజిక్కించుకోవడమే అంతిమలక్ష్యంగా అన్ని పార్టీలూ ఢిల్లీవాసులను వరాలజల్లులో తడిపేశాయి. గ్యారంటీల పేరిట ఉచితాలను అనుచితస్థాయికి తీసుకుపోయాయి. ఖజానా సొమ్మును పందేరం చేయడంలో పార్టీలన్నీ పోటీపడ్డాయి, హద్దులన్నీ చెరిపేశాయి. యోజన, సమ్మాన్, జీవన్‌రక్ష ఇత్యాది చక్కని పేర్లతో పోటాపోటీగా గుదిగుచ్చిన పథకాలన్నింటి లక్ష్యమూ ఒక్కటే. ఉచితాలను వెటకరించే, విమర్శించే నరేంద్రమోదీ కూడా ఢిల్లీలో మట్టుకు వెనక్కుతగ్గదల్చుకోలేదు. ఆయన పార్టీ ఒకపక్క వరాలు కురిపిస్తుండగా, తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ కొనసాగుతాయని ఆయన ప్రజలకు స్వయంగా హామీ ఇస్తున్నారు.

పదిహేనేళ్ళపాటు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్‌కు మళ్ళీ అధికారంలోకి రాగలిగేంత శక్తి లేకపోవచ్చును కానీ, ఆప్–బీజేపీ హోరాహోరీ పోరులో అది ఎవరికి ఎక్కువగా నష్టం చేయబోతున్నదన్నది ప్రశ్న. ఆప్ వరుసపాలనమీద విరక్తిచెందినవారు, కేజ్రీవాల్‌ను అవినీతిపరుడిగా నమ్మినవారు, డబుల్ ఇంజన్ సర్కారుకు మొగ్గవచ్చు. పదేళ్ళుగా కఠినంగా ఉన్న ఆర్థికమంత్రి ఢిల్లీ ఎన్నికల దృష్టితోనే ఇంత ఉదారంగా వ్యవహరించారని అనలేం కానీ, శనివారం నాటి కేంద్రబడ్జెట్‌లో ఆదాయం పన్నుమినహాయింపు పరిమితిని 12లక్షలకు పెంచడం మధ్యతరగతి జనాభా అత్యధికంగా ఉన్న దేశరాజధాని నగరాన్ని ప్రభావితం చేయకమానదు. ఆప్ కోటను బద్దలు కొట్టలేకపోయినా, కనీసం ముప్పైస్థానాల్లో బీజేపీ గెలవగలదన్న అంచనాల వల్ల కాబోలు, కేజ్రీవాల్ ఈమారు ఎంతో వినయంగా తన లెక్క తక్కువ చెప్పుకున్నట్టుంది.

అమెరికా గతం... భారత్‌కు భయం!



సామాజిక జీవితంలో అన్నికంటే కష్టమైంది.. గతాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నించటం! ప్రవహించే నదిలో రెండోసారి కాలుపెట్టలేమని గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ 2500 ఏళ్ల క్రితమే చెప్పాడు. ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటుంది కాబట్టి గతంలోకి వెళ్లనూలేం. దాన్ని పునరుద్ధరించనూ లేం. ఈ సత్యం సాధారణ వ్యక్తులకూ తెలుసు. అందుకే స్వతహాగా వాళ్లు ఆ ప్రయత్నాలు చేయరు. వర్తమానంలో పడుతున్న బాధలు గతంలో ఉండేవి కావనీ ధర్మం నాలుగు పాదాల మీద నడిచే యుగం ఒకప్పుడు ఉండేదన్న భావన అన్ని నాగరికతల్లో కనపడుతుంది. గతంలో ఉందో లేదో తెలియని అటువంటి యుగం.. భవిష్యత్తులో ఏర్పడాలని కోరుకోటానికీ, దానికోసం ప్రయత్నించటానికీ ఒక ఆదర్శంగా ప్రజలకది అప్పుడప్పుడూ ఉపయోగపడుతుంది. మంచికీ చెడుకూ దాన్ని వాడుకున్న సందర్భాలు చరిత్రలో కనపడతాయి. పలు గిరిజనుల పోరాటాల్లో అది ఎంతోకొంత ఉపయోగపడింది. దానికి భిన్నంగా మతోన్మాదం కోసం, జాత్యహంకారం కోసం, నియంతృత్వ స్థాపన కోసం దాన్ని వినియోగించుకున్న సంఘటనలూ ఉన్నాయి.

ఆధునిక ప్రజాస్వామ్యంలో సంప్రదాయ ధర్మయుగ పునరుద్ధరణకు ప్రయత్నించటం చాలా అరుదు. దాని జోలికి వెళ్లకపోయినా చరిత్ర పుటల్లోకి ఎక్కిన ఘనమైన గతాల పునరుద్ధరణకు ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మారుద్దామని (మేక్ అమెరికా గ్రేట్ అగెన్) డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరులూ చేస్తున్న హడావుడిలో ఇదే కనపడుతుంది. నిజమే! ఒకప్పుడు అమెరికాకు అన్నింటా ప్రథమ స్థానమే ఉండేది. అది క్రమేపీ పడిపోతున్నా ఇప్పటికీ అమెరికాకు ఆ స్థానం ఇంకా మిగిలే ఉంది.

భౌగోళికంగా ఎన్నో అనుకూలతలు, ప్రపంచ యుద్ధాల్లో జరిగిన అతితక్కువ నష్టం, వలసదోపిడీయే లేని చరిత్ర, ఆఫ్రికా నుంచి కొనుగోలుచేసిన నల్లజాతి వారితో చేయించిన కఠిన శ్రమ, తిండి గింజలకు ఏ దేశం వైపు చూడాల్సిన అవసరం లేని పరిస్థితి, నిరంతరం కొత్త భూముల్లోకి విస్తరించగలిగే సౌలభ్యం.. ఇలా ఎన్నో ప్రత్యేకతలు అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టాయి. ప్రపంచ యుద్ధాలు... యూరప్ దేశాలకూ ఆసియా, ఆఫ్రికాలకూ వినాశనాన్నీ విపరీత జననష్టాన్నీ తెస్తే అవే యుద్ధాలు అమెరికాను వస్తూత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపాయి. ఆయుధ తయారీ పరిశ్రమల్లో అమెరికాకు పోటీ లేకుండా చేశాయి.

ఏ దేశానికైనా భారీ పరిశ్రమలూ అవి ఉత్పత్తిచేసే యంత్రాలూ వాటితో తయారైన వస్తువులూ పరికరాలూ ఆయువుపట్టుగా ఉంటాయి. పారిశ్రామిక విప్లవం (1760) బాగా విస్తరించిన తర్వాత ఏ దేశ శక్తినైనా వాటితోనే కొలవటం సాధారణమైంది. ఇప్పుడు దానికి అమెరికాలో కొరత ఏర్పడింది. పలు భారీ పరిశ్రమలు వేరే దేశాలకు తరలిపోయాయి. పారిశ్రామిక ఉత్పత్తుల కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి వచ్చింది. ఎగుమతులతో పోల్చితే దిగుమతులు పెరిగాయి. 2023లో వాణిజ్యలోటు 779.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. పారిశ్రామిక ఉత్పత్తుల కోసమే కాదు సేవల రంగానికి (సర్వీస్ సెక్టర్) సంబంధించి కూడా ఇతర దేశాలపై ఆధారపడటం పెరిగింది. పొరుగు సేవలు (ఔట్‌సోర్సింగ్) అనివార్యమయ్యాయి. సమాచార సాంకేతికత వీటిని సులభం చేసింది. నిరుద్యోగం నిరంతరం పీడించే సమస్యగా మారింది. వలస వచ్చిన విదేశీ నిపుణులతో పోటీపడటం కష్టమైంది.

1945–1970 మధ్య కాలాన్ని ఆర్థికాభివృద్ధిపరంగా పాశ్చాత్య దేశాలకు స్వర్ణయుగంగా భావిస్తారు. ఉద్యోగ కల్పన గరిష్ఠస్థాయికి వెళ్లటం... సామాజిక భద్రతా పథకాల అమలు.. పారిశ్రామిక ఉత్పాదకతలో గణనీయ పెరుగుదల.. సంక్షేమ రాజ్యదృష్టితో ప్రభుత్వాలు వ్యవహరించటం.. కార్మిక సంఘాలు బలంగా ఉండటం.. అసమానతలు అదుపులో ఉండటం ఆ కాలంలో జరిగింది. ఆ తర్వాత సంక్షోభ కాలాలు మొదలయ్యాయి. 1973లో చమురు ఉత్పత్తి దేశాలు కూడబలుక్కుని ధరలు పెంచటం ప్రపంచాన్ని కుదిపివేసింది. 1970 నాటికి బ్యారల్ క్రూడ్ ఆయిల్ ధర 3.35 డాలర్లు ఉంటే 1980ల నాటికి అది 37.38 డాలర్లకు చేరుకుంది. అంతా సర్దుకున్నట్లే కొంతకాలం అనిపించటం, ఆ తర్వాత కొంతకాలానికే ఆర్థికంగా అతలాకుతలం అవ్వటం, తిరిగి మళ్లీ పుంజుకోవటం.. ఇలా ఆర్థిక వ్యవస్థ కొంతకాల వ్యవధిలో పైకీ కిందకీ అవ్వటం సాధారణమైపోయింది.

ఈ సంక్షోభాలకు ప్రభుత్వాల అతి నియంత్రణే కారణమనీ సంక్షేమరాజ్యం కొత్త ఆవిష్కరణలకు అడ్డంకిగా నిలిచిందనీ సామాజిక భద్రతా పథకాలు భారంగా మారాయనీ ప్రభుత్వాల అతి వ్యయం భారంగా పరిణమించిందనీ స్వేచ్ఛా వాణిజ్యానికి ప్రభుత్వాల విధానాలు అవరోధాలయ్యాయనీ, పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహాలకు అడ్డుగోడలు తయారయ్యాయనీ.. పలు వాదనలు బయలుదేరి సరళీకృత ఆర్థిక విధానాలే వీటికి విరుగుడనే భావన బాగా బలపడింది. మరోవైపు చైనాలోనూ రాజకీయ మార్పులు మొదలయ్యాయి. ప్రైవేటురంగానికి అక్కడ ప్రాధాన్యత పెరిగింది. 1980ల చివరినాటికి రష్యాతో సహా సోషలిస్టు ప్రభుత్వాలన్నీ కూలిపోయాయి. ప్రైవేటీకరణతో అంతా సర్దుకుని ఆర్థిక వృద్ధి పరుగులు తీస్తుందనే భావన ఎన్నాళ్లో నిలవలేదు. యుద్ధాలకూ అంతర్యుద్ధాలకూ అడ్డుకట్టపడలేదు. ఆర్థిక సంక్షోభాలూ సమసిపోలేదు. ఆగ్నేయాసియా దేశాల్లోనూ సంక్షోభం (1998) తలెత్తింది. ఇక 2007–08లో అమెరికాను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ప్రపంచమంతా ప్రభావాన్ని చూపింది.



■ రాహుల్ కుమార్

ఆర్థిక సంక్షోభాలు తీవ్రమైనప్పుడల్లా రాజకీయాల్లో విపరీత పోకడలు కనపడతాయి. శ్వేతజాతి ఆధిపత్య భావనలతో పాటు వలస జీవులపై వ్యతిరేకతలనూ ఎగదోయటం సంక్షోభాల కాలాల్లో చాలా సులువు. ట్రంప్ చేసిందీ అదే. గడిచిన వైభవాన్ని పునరుద్ధరిస్తామని పదేపదే చెప్పటం సంక్షోభాల కాలంలో ఎక్కువగా కనపడుతుంది. రెండోసారి అమెరికా అధ్యక్షుడైన వెంటనే 'మేక్ ఇన్ అమెరికా' తన ప్రాధాన్యతగా చెప్పటంతో పాటు ఇతర దేశాల్లో ఉత్పత్తిచేసి అమెరికాలో అమ్మాలనుకుంటున్న కంపెనీలు కనీవినీ ఎరగని పన్నులకు సిద్ధం కావాలనీ హెచ్చరించారు. ఇక అమెరికాలోనే తయారుచేసే ఉత్పత్తులకు కనీవినీ ఎరగనట్లుగా పన్నుల రాయితీలను ఇస్తామనీ ప్రకటించారు. పర్యావరణాన్ని పట్టించుకోకుండా చమురు, సహజవాయువు వెలికితీత కోసం 'డ్రిల్ బేబీ డ్రిల్' అనే నినాదానికీ ఊపు తెచ్చారు.

అర్భాటత్వం ఎంతగా ఉన్నా అమెరికాలో తయారీరంగాన్ని పునరుద్ధరించటం అంత తేలికకాదు. ఒక్క అమెరికానే కాకుండా పాశ్చాత్యదేశాల్లోనూ అది సులువు కాదు. వలస సామ్రాజ్యాల కాలంలో, ఆదిమ తెగలను తుదముట్టించిన కాలంలో ఉన్న అనుకూలతలు పాశ్చాత్య దేశాలకు ఇప్పుడు లేవు. ఏకపక్షంగా ముడిసరుకులను కొల్లగొట్టటమూ ఇప్పుడు సాధ్యంకాదు. ఆసియా దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానంలోనూ దూసుకువెళుతున్నాయి. ఇక అమెరికాలో స్థూలదేశీయ ఉత్పత్తిలో (జీడీపీ)లో తయారీరంగం వాటా 1950లో 28శాతం ఉంటే 2023 నాటికి 10.2 శాతానికి పడిపోయింది. శ్రామికశక్తిలో 25.6 శాతం మంది తయారీ రంగంలో అప్పుడు ఉంటే 2015 నాటికి ఆ శాతం 7.8కు చేరుకుంది. పరిశ్రమలతో పాటు గనుల తవ్వకం, నిర్మాణ రంగాన్ని కలిపిచూస్తే శ్రామికశక్తి వాటా 1955లో 35.9 శాతం ఉండేది. 2015నాటికి అది 13.6 శాతానికి పడిపోయింది. సేవలరంగంలో ఉద్యోగుల వాటా ఆనాడు 40.7 శాతం ఉంటే 2015 నాటికి అది 69.5 శాతమైంది.

ఆసియా దేశాల్లోని 2023 నాటి పరిస్థితితో పోల్చి చూసినా తయారీ రంగంలో అమెరికా వెనుకబాటు స్పష్టంగా కనపడుతుంది. భారత్ మినహా (13శాతం) చైనా (30.1శాతం), దక్షిణ కొరియా (25.6శాతం) తైవాన్ (33శాతం), జపాన్ (20.6శాతం), వియత్నాం (24శాతం), థాయ్‌లాండ్ (25శాతం), మలేసియా (23శాతం), సింగపూర్ (20–25శాతం) లాంటి దేశాలు తయారీ రంగంలో బాగా ముందున్నాయి. వలసపాలన తర్వాత పారిశ్రామిక అభివృద్ధి కోసం ఆసియా దేశాలు వ్యూహాలు రచించుకుని ముందడుగులు వేస్తున్న తరుణంలోనే అమెరికా పెట్టుబడులు కూడా ఎక్కువ లాభాల కోసం చౌకగా లభ్యమయ్యే శ్రమ, ముడిసరుకులను అన్వేషిస్తూ అక్కడికే చేరుకోవటం మొదలుపెట్టాయి. లాభాపేక్షతో, ఆధిపత్య అవసరాలతో తయారీ రంగం అమెరికాలో క్షీణించింది. సోవియట్ రష్యా, చైనాలను దృష్టిలో ఉంచుకుని జపాన్‌ను రెండో ప్రపంచయుద్ధం తర్వాత బాగా ప్రోత్సహించింది. ఆ దేశ ఎగుమతులను అందుకే ఆపలేక పోయింది. చివరికి జపాన్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌ను ముంచెత్తాయి. రాజకీయ, ఆర్థిక అవసరాలతో చైనాతో చెలిమి చేయాల్సి రావటంతో ఆ దేశ ఉత్పత్తులకు ద్వారాలు తెరవాల్సి వచ్చింది. ప్రస్తుతం చైనా (16.5శాతం), మెక్సికో (14.2 శాతం), కెనడా (13.6శాతం)లు అమెరికా దిగుమతుల అవసరాలు తీర్చటంలో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ దేశాలపై మొన్ననే పన్నుల యుద్ధానికి తెరతీశారు.

ఆసియాలో పెద్దదేశంగా ఉండి తయారీరంగంలో అమెరికాకు సవాల్ విసరలేకపోవటం భారత్ విశిష్టతగానే చెప్పుకోవాలి! మూడు దశాబ్దాలుగా బాగా దగ్గరై, అమెరికా కోరుకునే ఆర్థిక విధానాలు చేపట్టినప్పటికీ ట్రంప్ హెచ్చరికల వేడి భారత్‌కూ తగులుతోంది. అధిక పన్నులు తప్పవనే సంకేతాలను ఇవ్వటానికి ఏ అవకాశాన్నీ వదులుకోవటం లేదు. మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం ఇచ్చిన 10 ఏళ్ల నాటితో పోల్చితే తయారీరంగం వాటా పెరగలేదు. అప్పటికంటే (16.7శాతం) తగ్గింది. ట్రంప్–మోదీ మధ్య నడవడిక, భావ సారూప్యత సంగతెలా ఉన్నా ఇప్పుడు ఆర్థిక అంశాలే నివురుగప్పిన నిప్పులా మారాయి. మన ఎగుమతుల్లో అమెరికాకే ఎక్కువున్న నేపథ్యంలో పన్నుల యుద్ధం మొదలైతే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే వినియోగాన్ని పెంచటానికి ఆదాయపన్ను భారాన్ని తాజా బడ్జెట్‌లో బాగానే తగ్గించారు. ఆ పన్ను కట్టే ప్రజల సంఖ్య చాలా స్వల్పంగా ఉన్న మనదేశంలో ఈ ఆర్థిక వ్యూహం ఎంత ఫలిస్తుందో ఇప్పుడే చెప్పలేం. వ్యవసాయ, సామాజిక రంగాలకు కేటాయింపులు తగినంతగా పెరగకపోవటంతో జరిగే అనర్థాన్నీ తేలికగానూ కొట్టేయలేం.

చరిత్రను పునరావృతం చేయలేం. చేస్తామనే ఆలోచనే భయపెడుతుంది. మన పాలకుల్లోనూ అదెక్కడో కనపడుతోంది! అది ప్రాప్తకాలజ్ఞతే కావచ్చు! సమయోచిత అడుగు వేయటానికి సూచికే కావచ్చు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> ట్రంప్–మోదీ మధ్య నడవడిక, భావ సారూప్యత సంగతెలా ఉన్నా ఇప్పుడు ఆర్థిక అంశాలే నివురుగప్పిన నిప్పులా మారాయి. మన ఎగుమతుల్లో ఎక్కువ అమెరికాకే జరుగుతున్న నేపథ్యంలో పన్నుల యుద్ధం మొదలైతే ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే వినియోగాన్ని పెంచటానికి ఆదాయపన్ను భారాన్ని తాజా బడ్జెట్‌లో బాగానే తగ్గించారు. ఆ పన్ను కట్టే ప్రజల సంఖ్య చాలా స్వల్పంగా ఉన్న మనదేశంలో ఈ ఆర్థిక వ్యూహం ఎంత ఫలిస్తుందో ఇప్పుడే చెప్పలేం. వ్యవసాయ, సామాజిక రంగాలకు కేటాయింపులు తగినంతగా పెరగకపోవటంతో జరిగే అనర్థాన్నీ తేలికగానూ కొట్టేయలేం.

> ఆధునిక ప్రజాస్వామ్యంలో సంప్రదాయ ధర్మయుగ పునరుద్ధరణకు ప్రయత్నించటం చాలా అరుదు. దాని జోలికి వెళ్లకపోయినా చరిత్ర పుటల్లోకి ఎక్కిన ఘనమైన గతాల పునరుద్ధరణకు ప్రయత్నాలైతే జరుగుతున్నాయి. అమెరికాను మళ్లీ గొప్పదేశంగా మారుద్దామని డొనాల్డ్ ట్రంప్, ఆయన అనుచరులూ చేస్తున్న హడావుడిలో ఇదే కనపడుతుంది.

ఆయన బ్రతుకంతా సాహిత్యానిది

కృషికి సింహాసనం దగ్గరగా ఉంటుంది.
సాధనతో సంక్రాంతులుంటాయి.

ఈ మాటలకు ఒక ఉదాహృతి ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు.


"పుటక నీది/ చావు నీది/ బ్రతుకంతా దేశానిది" అన్న కాళోజీ కవితను చివర్లో కొంచెం అటూయిటూగా మారిస్తే "బ్రతుకంతా సాహిత్యానిది" అని చెప్పుకోవచ్చు. డా. తంగిరాల జీవితం అటువంటిదే.

బెంగుళూరులో, గత నెల 25వ తేదీన ఆ మహనీయుడు పరమపదించిన వార్త సాహితీలోకాన్ని కలచివేసింది. ఎంత భారతీసేవ!

కాకుల ఇల్లిందలపర్రులో 1935 మార్చి 30న ఆయన జన్మించినా, గాఢంగా పక్కనే ఉన్న తణుకుతోనే సంబంధం ఉండేది. తణుకు, రాజమండ్రి, భీమవరం, తిరుపతి పట్టణాలలో వారి విద్యార్థి దశలు వెలుగుజెండాలై ఎగిరాయి. భీమవరంలో బి.ఏ పూర్తి చేశాక తపాలాశాఖలో గుమాస్తాగా నియమితులయ్యారు. 'అమృతం కురిసిన రాత్రి'ని కవితా నేత్రాలతో చూసిన దేవరకొండ బాలగంగాధర తిలక్‌తో డా. తంగిరాల సన్నిహితంగా మెలిగేవారు. 'అమృతం కురిసిన రాత్రి' కవితా సంపుటిలో ప్రచురింపబడిన 'తపాలా బంట్రోతు' కవిత తంగిరాలను ఉద్దేశించి రాసినదే.

"మై డియర్ సుబ్బారావ్
కనిపించడం మానేశావ్
ఏవిటీ– పోస్టు మాన్ మీద గేయం వ్రాయాలా" అంటూ చివర్లో–
"ఉత్తరం ఇచ్చి నిర్లిప్తుడిలాగ వెళ్లిపోయే నిన్ను చూసినప్పుడు
తీరం వదిలి సముద్రంలోకి పోతూన్న ఏకాకి నౌక చప్పుడు"
అనే వాక్యాలతో ఆర్ద్రీభూతంగా సాగుతుంది ఆ కవిత.

తపాలా శాఖ నుంచి తప్పుకొని ఎస్వీ యూనివర్శిటీలో ఎం.ఏ (తెలుగు) పూర్తి చేశారు. 'తెలుగు వీరగాథాకవిత్వం' అనే అంశాన్ని తీసుకొని, పరిశోధన గావించి, కృతకృత్యులై 1969లో డాక్టరేట్ స్వీకరించారు. ఆచార్య పింగళి, ఆచార్య జి.ఎన్. రెడ్డి ఆ దశలో వీరికి పర్యవేక్షకులుగా ఉన్నారు. "కవిత్వం ఒక తీరని దాహం" అని శ్రీశ్రీ అన్నట్లు వీరి సాహిత్య సేవాభిరుచికి హద్దులు లేకపోయాయి. ఆ నేపథ్యంలో నుంచి, బెంగుళూరులో ఉన్న కన్నడ విశ్వవిద్యాలయంలో ముఖ్యంగా తెలుగు భాషకు ఒక గుర్తింపు తీసుకొని రావాలనుకొన్నారు. అదే విద్యాలయంలో రీడర్‌గా, ఆ తరువాత తెలుగు శాఖకు అధ్యక్షునిగా వ్యవహరిస్తూ తన ప్రయత్నాన్ని సాగించారు. చివరకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, సాహితీ తపస్వి పి.వి. నరసింహారావుకి లేఖ రాసి ఎట్టకేలకు తెలుగు శాఖను ఏర్పాటు చేశారు. గుల్బర్గా యూనివర్శిటీకి 'కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్'గా పని చేశారు.



కవిత్వానికి అంకితమైన వ్యక్తి కావడంతో 'చైతన్య కవిత' పత్రికకు రమారమి పాతికేండ్లు సంపాదకునిగా ఉంటూ– బహుముఖీన సాహితీ ప్రక్రియలకు ఆశ్రయం కల్పించారు. బెంగుళూరులోనే 'శ్రీరస' అనే సంస్థ ద్వారా అనేక సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలిచారు. భువన విజయాలు జరిపించారు. ప్రసంగాలకు తోరణాలు కట్టారు. జానపద సాహిత్యంలో ముందడుగు వేశారు. వీరగాథలు, కాటమరాజు కథలు, రేనాటి సూర్యచంద్రులు, జ్ఞానతరంగాలు మొదలైన పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించారు. కవుల్ని ప్రోత్సహించారు. ఖర్చుకు వెనుకాడకుండా గ్రంథాల్ని ముద్రించారు. వీరి అన్నగారే టి.వి.కె. సోమయాజులు. తణుకులో ఉంటూ సుప్రసిద్ధ పండితునిగా పేరు గడించారు. 'ఏరిన ముత్యాలు' అనే సోమయాజులు గ్రంథాన్ని డా. తంగిరాల ప్రకటించారు. కన్నడ, ఆంగ్ల భాషలలో అనేక అధ్యయనాలు చేశారు. ఉషశ్రీ– భీమవరంలో వీరి సహాధ్యాయులు. గుంటూరు శేషేంద్ర శర్మతో వీరికి అనుబంధమెక్కువ. శ్రావ్యమైన కంఠస్వరం. హంసపదిక ప్రణయ కావ్యం, వనదేవత బుర్రకథ రచించారు. శ్రీకృష్ణ కర్ణామృతం గ్రంథానికి సంపాదకులు.

ముఖ్యంగా– కవిగా నన్ను ప్రోత్సహించిన వారిలో డా. తంగిరాల ఒకరు. నా పద్య కవితా సంపుటి 'రసభారతి'ని బెంగుళూరు, గుల్బర్గా విశ్వవిద్యాలయాలలో పాఠ్యగ్రంథంగా ప్రవేశపెట్టారు. 'మణిదర్పణం' అనే యూనివర్శిటీ గ్రంథంలో నా కవితను ప్రచురించారు. మైసూరు 'ధ్వన్యాలోక' అనే సృజనాత్మక సాహిత్య పీఠానికి నన్నాహ్వానింపజేసి– మూడు నెలల పాటు నాతో కొన్ని రచనలు చేయించారు. ఈ పీఠానికి ప్రపంచవ్యాప్తంగా కవి పండితులు విచ్చేసేవారు. మైసూరుకు చెందిన నరసింహయ్య (రిటైర్డ్ ప్రొఫెసర్) ఈ పీఠాన్ని నిర్వహిస్తూ కవులను విశేషంగా ఆదరించేవారు. ఈ పీఠంలో నేను రాసిన 'అల్లూరి సీతారామరాజు' పద్యాలను డా. తంగిరాల కృతిభర్తగా ఉన్న బృహత్ గ్రంథంలో (అల్లూరి సీతారామరాజు) చివర ప్రచురించారు. కృతికర్త మల్లెల గురవయ్య.

తణుకు నన్నయ పీఠముఖంగా ప్రదానం చేసే కొన్ని పురస్కారాలకు ఆచార్య తంగిరాల సౌజన్యం ప్రబలంగా ఉండేది. ఇటీవలనే డా. సుబ్బారావు రాబోయే తమ 90వ జన్మదినోత్సవ సంచికకు నా నుంచి పద్యరచన కోరారు. నా పద్యమంటే వారికి ఎంతో అభిమానం. కొన్ని పద్యాల్ని పంపించాను. అందులో ఒకటి– (వీరగాథల పరిశోధనలో వీరు మార్గదర్శకునిగా ఉన్నారు.)

"దీపిక లెత్తినావు కద! తెల్గుచరిత్రకు శౌర్యవీధిలో
నూపిరిపోసి మౌనముగనున్న మహాత్ముల కీర్తికెల్ల, వ
హ్వా! పులకించి పోయెను మహాంధ్ర సరస్వతి నీదు వీరగా
థా పరిశోధనా చతురతన్ దలపోయుచు సుబ్బారావుజీ!"

అటువంటి మహనీయుడు ఆచార్య తంగిరాల. భౌతికంగా సాహిత్యలోకంలో లేకపోవటం– భాషాభిమానులను కలచివేసింది. వారి నిరుపమానమైన సాహిత్యసేవ– ముఖ్యంగా జానపదం, వీరగాథల్ని ఒరుసుకొంటూ ప్రవహించింది.

డా. తంగిరాల ఉగాది గురించి రాస్తూ– ఓ చోట చైతన్య కవితలో హింసా రాజకీయాన్ని ఇలా కవిత్వీకరిస్తారు.

"గద్దె–
అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ కూడా
నెత్తుటి మడుగు మధ్యలో విచ్చిన ఎఱ్ఱకలువ
కల్హార కిరీటం కావాలనుకొన్నవాడు
హింసాకల్లోలినిలో ఈదులాడక తప్పదు"

ఆ సాహితీమూర్తికి, నింగికెగసిన ఆచార్య తంగిరాలకు ఇవే నివాళులు.

• రసరాజు


వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

గ్రీన్ ఎనర్జీ గ్లోబల్ హబ్ దిశగా...

భారతదేశం ప్రతి ఏడాది సుమారు రూ.13 లక్షల కోట్ల విలువైన ఎలఎన్‌జీ, తదితర ఇంధనాలు దిగుమతి చేసుకుంటోంది. పారిస్ ఒప్పందం ప్రకారం 2030 నాటికి 500 గిగావాట్ల నాన్–ఫాసిల్ ఇంధన సామర్థ్యాన్ని మన దేశం సాధించాలి. పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ద్వారా 2047 నాటికి ఇంధన రంగంలో స్వయంసమృద్ధి సాధించడం, 2070 నాటికి కర్బన ఉద్గార రహిత ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జనవరి 4, 2022న నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు ఆమోదం తెలిపింది.

భవిష్యత్ ఏ రంగానిదో, తక్షణ పెట్టుబడులు సాధించే అవకాశం ఏ రంగం కల్పిస్తుందో క్షుణ్ణంగా తెలుసుకోగలిగిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐదు సంవత్సరాల పాటు అమలులో ఉండే విధంగా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన, కుసుమ్ వంటి పథకాలను కూడా కలుపుకుని రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నైపుణ్యాల పెంపును ప్రోత్సహించడానికి సమగ్రమైన ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐసీఈ) పాలసీ–2024 రూపొందించారు. ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల విలువైన దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 7.5 లక్షల మందికి ఉపాధితో పాటు, 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించి రాష్ట్రాన్ని గ్లోబల్ క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఐసీఈ పాలసీని ప్రకటించింది. సంప్రదాయేతర ఇంధన రంగంలో పోటీతత్వాన్ని పెంచేలా ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించడం, క్లీన్ ఎనర్జీలో భాగంగా పెట్టుబడులు పెట్టిన సంస్థలకు ప్రోత్సాహకాలు అందించడం ఈ పాలసీ విధానం. విద్యుత్ వాహనాలకు 5000 ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, ప్రధానమంత్రి సూర్యఘర్ కింద మూడు గిగావాట్ల సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యంతో పది లక్షల గృహాలకు సౌర విద్యుత్, పీఎం కుసుమ్ పథకాలను అమలు చేయడం కూడా ఈ పాలసీలో భాగమే. సింగిల్ విండో అనుమతులతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటుగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ముందుకు వస్తున్న పారిశ్రామిక సంస్థలకు ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపిబి) తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయడం వల్ల పెట్టుబడుల ఆకర్షణతో పాటు ఉపాధి కల్పనకు మార్గం సుగమమవుతోంది.

> ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాల కల్పన చేస్తామన్న ఎన్డీయే కూటమి హామీని సాకారం చేయడంలో పునరుత్పాదక ఇంధన రంగం కీలకంగా మారనుంది. లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా బలపడటమే కాకుండా, ప్రాజెక్టుల కోసం భూముల వినియోగం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు పెరుగుతాయి. సౌర, పవన, హైడ్రోజన్ వంటి శుద్ధమైన ఇంధన వనరుల ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది.



గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతులకు వ్యూహాత్మకంగా అనుకూలమైన సువిశాల 1054 కి.మీ. సముద్ర తీరం, ఆరు పోర్టులు, త్వరలో వినియోగంలోకి రానున్న మరో నాలుగు పోర్టులు కలిగిన ఆంధ్రప్రదేశ్, పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే అగ్రగామిగా నిలవడమే కాక, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతుల్లో గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 39 ప్రదేశాల్లో 74.9 గిగావాట్ల మేర పవన విద్యుత్, 43.89 గిగావాట్ల మేర పంప్డ్ స్టోరేజి విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ద్వారా 25 గిగావాట్ల మేర, ఏడాదికి 1.50 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఆస్కారం ఉందని; రోజుకు 10 వేల టన్నుల సీఎన్జీ, సీబీజీ లాంటి బయో ఫ్యూయెల్స్ ఉత్పత్తికి, 5 వేల మెగావాట్ల బ్యాటరీ ఉత్పత్తి, 3 వేల మెగావాట్ల ఎలక్ట్రోలైజర్స్ ఉత్పత్తికి ఆస్కారం ఉందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రముఖ పారిశ్రామికవేత్తలు పెద్దయెత్తున ముందుకు వస్తున్నారు. అనేక రాష్ట్రాలు ఒత్తిడి చేసినా రూ.65 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో మొత్తం 11,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, 2.50 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా 500 కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్లను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్నది.


ఇటీవలే జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ కింద పూడిమడకలో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యూ & రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎనఆరఈడీసీఏపీ) సంయుక్తంగా రూ.1,84,700 కోట్ల నిధులతో స్థాపిస్తున్న దేశంలోనే మొట్టమొదటి గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. సుమారు 57,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ ప్రాజెక్టు 1,500 టీపీడీ (రోజుకు టన్ను) గ్రీన్ హైడ్రోజన్, 7,500 టీపీడీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పన్నాలను (గ్రీన్ మిథనాల్, గ్రీన్ యూరియాతో సహా) ఉత్పత్తి చేసే సామర్థ్యంతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిదారుగా రూపొందబోతోంది.

కాగా దక్షిణాదిలో మొదటిసారిగా సోలార్, విండ్, బ్యాటరీ స్టోరేజ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టును నంద్యాల, కడప జిల్లాలలో మొత్తం 118 మెగావాట్ల పవన, 130 మెగావాట్ల (195 యండబ్ల్యూపీ) సోలార్ హైబ్రిడ్ పవర్ బ్యాటరీ ఇంధన నిల్వ సామర్థ్యంతో క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నెలకొల్పుతున్నది. రాబోయే మూడు, నాలుగేళ్లలో పై ప్రాజెక్టులన్నీ పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిబంధన విధించింది.

రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలలో నైపుణ్యాల పెంపు కోసం విశ్వవిద్యాలయాలు, శిక్షణా కేంద్రాలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసి నైపుణ్యాలను అభివృద్ధి చేయడం వల్ల, పారిశ్రామిక అవసరాలకు తగిన నైపుణ్యాలు కలిగిన స్థానిక మానవ వనరులు అందుబాటులోకి వస్తాయి. 2030 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యంగా పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్, అదే ఏడాదికి 500 గిగావాట్ల నాన్–ఫాసిల్ ఇంధన సామర్థ్యాన్ని సాధించాలని ప్యారిస్ ఒప్పందం ప్రకారం భారతదేశం పెట్టుకున్న లక్ష్య సాకారానికి కీలకమైన భాగస్వామిగా నిలుస్తోంది. ఇంధన వనరుల్లో 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వస్తున్నాయని, పునరుత్పాదక ఇంధన రంగంలో దేశంలోనే ముందంజలో నిలుస్తున్నామని, రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోందని, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, ఎగుమతుల్లో గ్లోబల్ హబ్‌గా ఏపీ అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్, ఇతర పునరుత్పాదక ఇంధనాల్లో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలిపి, 2047 నాటికి కర్బన ఉద్గార రహిత రాష్ట్రంగా చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాల కల్పన చేస్తామన్న ఎన్డీయే కూటమి సూపర్–6 హామీని సాకారం చేయడంలో పునరుత్పాదక ఇంధన రంగం కీలకంగా మారనుంది. లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా బలపడటమే కాకుండా, ప్రాజెక్టుల కోసం భూముల వినియోగం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు పెరుగుతాయి. సౌర, పవన, హైడ్రోజన్ వంటి శుద్ధమైన ఇంధన వనరుల ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగవుతుంది. స్వదేశీ పునరుత్పాదక ఇంధన వనరులు వినియోగించడం ద్వారా దేశానికి అవసరమైన ఇంధన దిగుమతులపై ఖర్చు తగ్గి లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. క్లీన్ ఎనర్జీ రంగంలో పరిశోధన, అభివృద్ధి, నూతన సాంకేతిక పరిజ్ఞానాలు ఆవిష్కరించబడతాయి. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–2024 రాష్ట్రాన్ని పర్యావరణపరంగా, ఆర్థికపరంగా, సామాజికపరంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు.

■ లింగమనేని శివరామప్రసాద్
రాజకీయ, సామాజిక విశ్లేషకులు





అమరావతి నూతన రైల్వేలైన్‌కు మార్గం సుగమమైంది. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు భారీగా కేటాయింపులు జరపటం, లైన్లకు ఎక్కువ నిధులివ్వడంతో అమరావతి నూతన రైల్వేలైన్‌కు భూ కేటాయింపులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో రైల్వే పనుల కోసం మొత్తం రూ.9,417 కోట్లు కేటాయించారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం స్థూల కేటాయింపులు మాత్రమే ప్రకటించారు. పింక్ బుక్ విడుదలయ్యాక సమగ్ర వివరాలు వెల్లడవుతాయి. అయితే, అమరావతి నూతన రైల్వేలైన్‌కు బడ్జెట్‌లో కేటాయింపులు చేసే అవకాశం ఉందని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ పాటిల్ పరోక్షంగా సోమవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. పింక్‌బుక్ విడుదలైతే తప్ప, తొలిదశ కేటాయింపులు ఎంతన్నది కానీ తెలియదన్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

అమరావతికి మార్గం సుగమం

కేంద్ర రైల్వేమంత్రి, విజయవాడ డీఆర్ఎం మాటలతో చిగురిస్తున్న ఆశలు

కొత్త రైల్వేలైన్‌పై సరికొత్త ఆశలు

- 534.23 ఎకరాల భూ సేకరణకు ఇప్పటికే నోటిఫికేషన్
- ట్రాక్ పనుల కోసం బడ్జెట్‌లో కేటాయింపులకు చాన్స్
- అమరావతికి తప్పకుండా ఉంటాయన్న డీఆర్ఎం నరేంద్ర ఆనంద్
- నాలుగేళ్లలోనే పనులు పూర్తి చేస్తామని వెల్లడి
- ఎర్రుపాలెం వయా అమరావతి నుంచి నంబూరు వరకు 57 కిలోమీటర్లు
- విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, చెన్నైకు అనుసంధానం
- మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కు కూడా నిధులిచ్చే అవకాశం
- పింక్‌బుక్ కోసం మరో రెండు రోజులు ఆగాల్సిందే

అక్టోబరులో రూ.2,545 కోట్ల కేటాయింపు

డీఆర్ఎం చెప్పిన దాని ప్రకారం.. కేంద్ర కేబినెట్‌లో అమరావతి నూతన రైల్వేలైన్‌కు గత ఏడాది అక్టోబరులోనే రూ.2,545 కోట్లకు అనుమతినిచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో భూ సేకరణ ప్రక్రియ కూడా వేగంగా నడిచింది. రెండు జిల్లాల పరిధిలో మొత్తం 534.23 ఎకరాల కోసం ఇప్పటికే భూ సేకరణ నోటిఫికేషన్ కూడా వెలువడింది. ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కువగా 334.52 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో 72.45 ఎకరాలు, గొట్టుముక్కలలో 50.49, వీరులపాడు మండలం జుజ్జూరులో 28.89, గూడెం మాధవరంలో 7.712, చెన్నారావుపాలెంలో 26.45, పెద్దాపురంలో 50.82, అల్లూరులో 43.15, నరసింహారావుపాలెంలో 17.45 ఎకరాల చొప్పున భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరులో 27.43, పెదకాకానిలో 5.73, తాడికొండలో 69.09, మోతడకలో 31.05, కంతేరులో 31.25, తుళ్లూరు మండలం పెదపరిమిలో 23.66, వడ్డమానులో 11.49 ఎకరాల చొప్పున భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండు జిల్లాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. నిధులు కేటాయించటమే మిగిలుంది. విజయవాడ డీఆర్ఎం నరేంద్ర మిగతా 6లో..



రైల్వేట్రాక్‌కు విద్యుదీకరణ చేసి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో పిల్లలతో డీఆర్ఎం నరేంద్ర



భళా బాలలు

కిడ్డీ బ్యాంక్ సొమ్ము సోనూసూద్ ఫౌండేషన్‌కు విరాళం

అమ్మానాన్నలు ఇచ్చిన సొమ్మును కిడ్డీ బ్యాంకులో దాచుకున్న ఇద్దరు చిన్నారులు.. ఆ మొత్తాన్ని సోనూసూద్ ఫౌండేషన్‌కు విరాళంగా అందించి చిన్నవయస్సులోనే దాతృత్వాన్ని చాటుకున్నారు. నగర పర్యటనకు వచ్చిన సోన్‌సూద్‌ను దుద్దేల వరుణ్‌గౌతమ్, దుద్దేల పుష్కల్‌లు నోవాటెల్ హోటల్‌లో సోమవారం కలిశారు. వారు దాచుకున్న మొత్తాన్ని ఆయనకు అందజేశారు. ఆ ఇద్దరు బాలురును సోనూసూద్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని వారికి సూచించారు.

- పటమట, ఆంధ్రజ్యోతి

ఇక పొలం వెంబడి

జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు 'అగ్రి కనెక్ట్'

కలెక్టర్ లక్ష్మీశ ఆలోచనలకు శ్రీకారం

- 6-10 విద్యార్థులకు పంటల పరిచయం
- వారానికోసారి విద్యార్థుల పొలంబాట
- ప్రకృతి వ్యవసాయం, భూసంరక్షణపై పాఠాలు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : డిజిటల్ తరగతి గదుల మధ్య విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్న విద్యార్థులకు పచ్చదనాన్ని పరిచయం చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఆ బాధ్యతలను జిల్లా వ్యవసాయ అధికారులకు అప్పగించారు. వారానికోసారి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను పొలంబాట పట్టిస్తున్నారు. రెండు వారాల క్రితం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి 'అగ్రి కనెక్ట్' అని నామకరణం చేశారు.

'పొలం పిలుస్తోంది'కి అనుసంధానం

జిల్లాలోని రైతులకు వ్యవసాయ పద్ధతులు, అనుసరించాల్సిన విధానాలు, సస్యరక్షణ చర్యలను వివరించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతులను పొలాల వద్దకు తీసుకెళ్లి అధికారులు ఈ విధానాలను వివరిస్తున్నారు. కొత్తగా అమలు చేసిన 'అగ్రి కనెక్ట్' కార్యక్రమాన్ని 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి అనుసంధానం చేశారు. పిల్లలు తరగతి గదుల్లో ఉన్నప్పుడే భూసంరక్షణ, ప్రకృతి పరిరక్షణపై అవగాహన పెంచాలని కలెక్టర్ లక్ష్మీశ భావించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులను వారానికోసారి పొలంబాట పట్టించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి అన్ని మండలాల్లోని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థులను ఆయా ప్రాంతాల్లో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమానికి తీసుకెళ్తున్నారు. వ్యవసాయంలో ఉన్న విధానాలు, ఏకపంట, బహుళ పంటల విధానాలు, సేంద్రీయ ఎరువుల ఉపయోగం, భూసార పరీక్షలు వంటి అంశాలను వివరిస్తున్నారు. నేలకు సారం ఎలా అందుతుంది, దాన్ని పెంపొందించడానికి అవలంబించాల్సిన విధానాలను ఉదాహరణలతో చెబుతున్నారు.

పడిపోతున్న సేంద్రియ కర్బనం

జిల్లాలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు.. ఆందోళనకర విషయాలను గుర్తించినట్టు సమాచారం. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 వరకు ఉండాలి. జిల్లాలో వివిధ మండలాల్లో భూమిలో సేంద్రియ కర్బనం 0.25 ఉన్నట్టు భూసార పరీక్షల్లో నిర్ధారణైంది. రైతులు ఏక పంటలను సాగు చేయడం, పంటలకు రసాయన ఎరువులను ఎక్కువగా వినియోగించడం వల్ల ఈ పరిస్థితి వస్తోందని జిల్లా వ్యవసాయాధికారిణి డీఎంఎఫ్ వి జయలక్ష్మి తెలిపారు.



ఎప్పటికి పూర్తయ్యేనో..

వేదాద్రి కోసం రైతన్నల ఎదురుచూపులు 6లో

నందిగామలో రగడ

మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేటికి వాయిదా

అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థిపై ఎమ్మెల్యే సౌమ్య అసంతృప్తి

- తన ప్రమేయం లేకుండా ఎలా ఎంపిక చేశారంటూ ఆగ్రహం
- తాను సూచించిన వారికే పదవినివ్వాలని పట్టు
- ఎన్నికకు వెళ్లనివ్వకుండా కౌన్సిలర్ల నిలుపుదల
- కోరం లేక వాయిదా పడిన చైర్‌పర్సన్ ఎన్నిక
- రాత్రి 9 గంటల సమయంలో మంత్రి నారాయణ ఫోన్
- సౌమ్యకు అభయం.. సద్దుమణిగిన వివాదం
- నేటి ఎన్నిక లాంఛనమే.. ▸ హోటల్‌లో కౌన్సిలర్లు



ప్రభుత్వ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే, ఎంపీ మధ్య ఆధిపత్య పోరు వల్లేనా..?

రాజకీయ పరిణామాల నడుమ నందిగామ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం అర్ధాంతరంగా నిలిచింది. టీడీపీ కౌన్సిలర్లు ఎవరూ సోమవారం నాటి ఎన్నికకు హాజరు కాకపోవటంతో మంగళవారానికి వాయిదా పడింది. ఉదయం జరిగిన పరిణామాల్లో అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం అందజేసిన బీఫాంపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మండిపడ్డారు. తాను సూచించిన అభ్యర్థికే పట్టం కట్టాలని, లేదంటే రాజీనామా చేస్తానని ఆమె చెప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రాత్రి 9 గంటల సమయంలో మంత్రి నారాయణ కలగజేసుకుని సౌమ్యతో ప్రత్యేకంగా మాట్లాడటంతో వివాదం సద్దుమణిగింది. అధిష్ఠానం సూచించిన అభ్యర్థి కాకుండా.. సౌమ్య ఇష్టానికే నిర్ణయాన్ని వదిలేయడంతో పరిస్థితి చక్కబడింది. ఇక.. మంగళవారం నాటి ఎన్నిక లాంఛనం కానుంది. కాగా, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే సౌమ్యల మధ్య ఆధిపత్య పోరే ఈ వివాదమంతటికీ కారణమని తెలుస్తోంది.



ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నివాసంలో వేచి ఉన్న కౌన్సిలర్లు

రాజీ పడాల్సి వస్తే రాజీనామా : తంగిరాల సౌమ్య

రాజీ పడాల్సి వస్తే రాజీనామా చేస్తా తప్ప.. ఎవరి ఒత్తిడికి, బెదిరింపులకు లొంగేది లేదంటూ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆగ్రహంతో ఊగిపోయారు. తాను చంద్రబాబు, లోకేశ్‌కు మాత్రమే బద్ధురాలినని, తనపై పెత్తనం చేసేవారిపై కాదంటూ కన్నెర్ర జేశారు. చైర్‌పర్సన్ ఎంపిక పూర్తిగా తన అధికార పరిధిలో ఉన్న అంశమని, ఇతరులెవరికీ జోక్యం చేసుకునే హక్కు లేదన్నారు.

నందిగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నందిగామ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక అనేక రాజకీయ పరిణామాల నడుమ మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్ ఎన్నిక జరగాల్సి ఉంది. టీడీపీకి చెందిన ఐదుగురు సభ్యులతో పాటు జనసేనకు చెందిన ఒకరు, వైసీపీ నుంచి వలస వచ్చిన 7 మంది.. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నివాసానికి చేరుకున్నారు. ఈ సమావేశంలో అభ్యర్థి ఎవరన్నది ప్రకటించేందుకు ఆమె సిద్ధమవుతుండగా, అదే సందర్భంలో అక్కడికి చేరుకున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు.. జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ నుంచి వచ్చిన బీఫాంను అందజేశారు. 8వ వార్డు సభ్యురాలు శాఖమూరి స్వర్ణలత పేరు అందులో రాసి ఉండటంతో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆగ్రహంతో ఊగిపోయారు. తన నియోజకవర్గంలో జరిగే ఎన్నికకు సంబంధించి బీఫాంపై పేరు రాసేటప్పుడు తనను సంప్రదించే అవసరం లేదా అని కనపర్తిని ప్రశ్నించారు. ఇది రాష్ట్ర పార్టీ ఆదేశమని ఆయన బదులిచ్చారు. కనపర్తితో సౌమ్య వాగ్వాదానికి దిగారు. ఇదేనా తనకిచ్చే గౌరవమని మండిపడ్డారు. బీఫాంపై ఎవరి పేరున్నా తాను లెక్కచేయనని, తాను సూచించిన వారికే పదవి వరిస్తుందని స్పష్టం చేశారు.

పట్టువీడని ఎమ్మెల్యే సౌమ్య

తన నిర్ణయమే ఫైనల్ అని భీష్మించిన ఎమ్మెల్యే సౌమ్యను ఒప్పించేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. సౌమ్యకు ఫోన్ చేశారు. ఆయన ఫోన్ రిసీవ్ చేసుకోకపోవడంతో కనపర్తికి ఫోన్‌చేసి సౌమ్యకు ఇమ్మన్నారు. ఎమ్మెల్యేగా తనతో సంప్రదింపులు లేకుండా, కనీసం పరిగణనలోకి కూడా మిగతా 6లో..

మల్టీ మోడల్ మెట్రో స్టేషన

పీఎన్‌బీఎస్ వద్ద ఏర్పాటుకు ప్రతిపాదనలు

- మెట్రో సహా సాధారణ రైళ్లు, బస్సుల కోసం ప్రత్యేకం
- అంతర్జాతీయ సంస్థతో డిజైన్ల రూపకల్పనకు యోచన
- కేసరపల్లిలో మెట్రో కోచ్ డిపో.. త్వరలో స్థలాన్వేషణ
- మెట్రో స్టేషన్లకు పాత ప్రాంతాల్లోనే భూ సేకరణ
- నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అంచనాలు పూర్తి
- రూ.1,000 కోట్లతో ఆర్అండ్‌బీ-ఎన్‌హెచ్‌కు నివేదిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ మెట్రోరైల్ ప్రాజెక్టులో ప్రధానమైన మెట్రో స్టేషన్‌ను బహుళ రవాణా విధానం (మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్)కు వీలుగా అభివృద్ధి చేయాలని మెట్రో అధికారులు నిర్ణయించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉండేలా ఇంటర్నేషనల్ సంస్థకే దీని డిజైన్ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు. పీఎన్‌బీఎస్ దగ్గర పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా వచ్చే కారిడార్-2తో పాటు గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్.. పీఎన్‌బీఎస్‌కు వచ్చే కారిడార్-1, అలాగే భవిష్యత్తులో పీఎన్‌బీఎస్ నుంచి అమరావతిలోని మిగతా 6లో..

రూ.1,000 కోట్లతో నిడమానూరులో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

మెట్రో రైల్ కారిడార్-1లో అంతర్భాగంగా నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ కోసం రూ.1,000 కోట్లతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు అంచనాలు రూపొందించి ఆర్అండ్‌బీ (ఎన్‌హెచ్) విభాగానికి ప్రతిపాదనలు పంపారు. ఇది ప్రభుత్వం దృష్టికి వెళ్లాక అంతిమంగా జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) కు చేరుతుంది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఆరు వరసల 7 కిలోమీటర్ల మెగా ఫ్లై ఓవర్ మంజూరైన నేపథ్యంలో మెట్రో కారిడార్‌కు అడ్డుగా కాకూడదని నిర్ణయించారు. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు 4 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు.



పీఎన్‌బీఎస్ ప్రతిపాదిత మెట్రో రైల్వేస్టేషన్



త్రిశక్తి పీఠంలో..



దుర్గగుడిలో సరస్వతీయాగం

సరస్వతీ నమోస్తుతే..

వసంత పంచమి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం సరస్వతీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌తో పాటు అర్చనామూర్తిని సరస్వతీదేవిగా అలంకరించారు. త్రిశక్తిపీఠంలో జరిగిన అక్షరాభ్యాసాల్లో చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రైవేట్ భూముల్లో కెమికల్ వ్యర్థాల డంపింగ్

- వంద ఎకరాల్లో భూములపై ప్రభావం.. రంగుమారిన వైనం
- లిక్విడ్ ట్యాంకర్‌ను డ్రైవర్ సహా పట్టుకున్న భూ యజమానులు

8లో

భూమి విలువ పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్లపై ఉండదు

● ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్


జగ్గయ్యపేటలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భూమి విలువల పెంపు ప్రభావం ఎన్టీఆర్ జిల్లాలో రిజిస్ట్రేషన్లపై ఉండదని జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం జగ్గయ్యపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 70 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. గత ఏడాది విజయవాడ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో వరదల ప్రభావం వల్ల తగ్గాయని చెప్పారు. జగ్గయ్యపేట, విస్సన్నపేటల్లో 17 శాతం రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరగటం లేదన్నారు. భూమి విలువ పెంపుపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి కలెక్టర్‌కు తెలిపామని, జగ్గయ్యపేటలో 3 అభ్యంతరాలను పరిష్కరించామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించే ఆలోచన లేదని, ఆధునీకరణకు ప్రతిపాదన లు కోరామన్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో రీసర్వే కారణంగా నిలిచిపోయిన మల్కాపురం, ముచ్చింతాల గ్రామాల రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ల ద్వారా కలెక్టర్‌ను కోరామన్నారు. జగ్గయ్యపేటతో సహ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నామమాత్రంగానే 10-15 శాతం విలువల పెంచామని తెలిపారు. కార్యాలయ రికార్డులు సబ్‌రిజిస్ట్రార్ మనోహర్‌నాయక్ చూపించారు.

హత్యకు రెక్కీ నిర్వహించిన నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిలక్

నందిగామ రూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సుపారీ ఇచ్చి హత్య చేయించేందుకు యత్నించిన వ్యక్తిని, తీసుకున్న వ్యక్తితో పాటు సహకరించిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఏసీపీ తిలక్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. మండలంలోని ఐతవరం గ్రామానికి చెందిన కోలా నరసింహారావు పెద్ద కుమార్తె 14 నెలల క్రితం అదే గ్రామానికి చెందిన ముప్పా వీర్రాజును ప్రేమ వివాహం చేసుకుంది. వివాహానికి సహకరించిన ముప్పా గోపీని హతమార్చేందుకు నరసింహారావు హైదరాబాద్ కొత్తపేటకు చెందిన పాలంపల్లి విజయ్‌కుమార్‌కు రూ.లక్ష సుపారీ ఇచ్చి ఒప్పందం చేసుకున్నాడు. దీంతో సంక్రాంతి సమయంలో నరసింహారావు, విజయ్‌కుమార్‌లు మరో ఇద్దరితో కలిసి గోపీ నివాసం వద్ద రెక్కీ నిర్వహించారు. హతమార్చేందుకు కుదరకపోవటంతో ఆదివారం మరోసారి గోపీని హతమార్చాలనే ఉద్దేశ్యంతో నందిగామ మయూరి థియేటర్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు కోడి కత్తులు, ఒక బైకు, రూ. రెండు వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'ఆపరేషన్ కగార్' ఉపసంహరించుకోవాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో విశాల అటవీ ప్రాంతాన్ని బడా కార్పొరేటర్లకు కట్టబెట్టే 'ఆపరేషన్ కగార్'ను కేంద్ర ప్రభుత్వం తలపెట్టిందని పలువురు వక్తలు ఆరోపించారు. తక్షణమే ఈ ఆపరేషన్‌ను బేషరత్తుగా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తూ అడవులను నెత్తుటి క్షేత్రంగా మార్చుతున్న మారణకాండకు మరో పేరుగా ఈ ఆపరేషన్‌ను భావిస్తున్నామన్నారు. దీనిపై సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకుని న్యాయ విచారణ జరపాలని కోరారు. ఆప రేషన్ కగార్‌కు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ సహకరించకూడదని సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూడా అటవీ ప్రాంతాల సంపదలను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయ త్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీఎల్‌సీ రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్, లిబరేషన్ నాయకుడు హరనాథ్, ఓపీడీఆర్ నేత సి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో వైసీపీ కనుమరుగవడం ఖాయం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని

వన్‌టౌన్. ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో రాష్ట్రంలో వైసీపీ కనుమరుగవడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామిని అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అవాస్తవాలు మాట్లాడుతున్నారని, గత ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని తెలిపారు. అందుకే ప్రజలు వారికి 11 సీట్లు ఇచ్చి కూర్చోబెట్టారన్నారు. తలుపులు మూసి విభజన చేసిన కాంగ్రెస్‌కు బీజేపీని విమర్శించే హక్కు లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అనేకమంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వస్తున్నారని, మోదీ హయాంలో అటు దేశం, ఇటురాష్ట్రం కూడా అనేక అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వైసీపీనివీడి చాలా మంది కూటమిలోకి వస్తున్నారన్న ఆమె పేద మధ్యతరగతి ప్రజలకు మేలు చేయడంతో పాటు వికసిత్ భారత్ కోసం జరుగుతున్న ప్రయత్నాలను వెల్లడించారు.

ఎన్నికల నియమావళి కృష్ణాజిల్లా నోడల్ అధికారిగా

జడ్పీ సీఈవో కన్నమనాయుడు

మచిలీపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శాసనమండలి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కృష్ణాజిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ బాలాజీ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లానోడల్ అధికారిగా జడ్పీ సీఈవో సీహెచ్ కన్నమనాయుడును నియమించినట్లు అందులో పేర్కొన్నారు. మండలస్థాయిలో ఎంపీడీవోలు, మునిసిపల్ కార్పొరేషన్, పురపాలకసంఘాల్లో కమిషనర్లు ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు పర్యవేక్షణా అధికారులుగా ఉంటారన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టు ఫిర్యాదులు వస్తే, వెంటనే చర్యలు తీసుకోవాలని, పూర్తిస్థాయి సమాచారాన్ని తనకు, జేసీకి వెంటనే తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆధార్‌కార్డుల బయోమెట్రిక్ తప్పనిసరి

అప్పుడే పుట్టిన శిశువులనుంచి ఐదేళ్లలోపు, ఐదు నుంచి ఏడేళ్ల లోపు బాలలకు, 15 నుంచి 17 ఏళ్ల వారికి ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. జిల్లాస్థాయి ఆధా ర్ పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. జిల్లాలో ఆధార్‌నమోదు కేంద్రాల పనితీరు, నమోదు వివరాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్ల బాలల వరకు ఆధార్‌కార్డులు ఇవ్వడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదేళ్లలోపు 38వేలమంది బాలలకు ఆధార్‌కార్డుల మంజూరు పెండింగ్‌లో ఉందన్నారు. 5 నుంచి 17 ఏళ్లలోపు వారినుంచి బయోమెట్రిక్‌ను తీసుకుని ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు ఆస్పత్రుల్లో ఆధార్ నమోదు చేయాలన్నారు. 5 నుంచి 17 ఏళ్లలోపు బాలలకు, యువతకు పాఠశాలలు, కళాశాలల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆధార్‌మానిటరింగ్ కమి టీ కన్వీనర్ శ్రీదేవి, యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ గిరిధర్, ఎల్‌డీఎం రవీంద్రరెడ్డి, సీడీపీవో కె.గ్లోరీ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.


నిలిచిన వేదాద్రి ఎత్తిపోతల పథకం పనులు, వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన శంకుస్థాపన శిలాఫలకం

వేలాది ఎకరాలకు సాగునీరు, పదుల సంఖ్యలో గ్రామాలకు తాగునీరు ఇవ్వడం ఆ పథకం లక్ష్యం. 2019లో ప్రభుత్వం మారడంతో లక్ష్యం ముక్కలైపోయింది. అనుకున్న లక్ష్యానికి అడుగు ముందుకు పడలేదు. ఆశయం ఎప్పుడు నెరవేరుతుందో తెలియని పరిస్థితి. ఆ పథకం పరిధిలో ఉండే ప్రజల ఆశలు మాత్రం అలాగే సజీవంగా ఉన్నాయి. ఇదీ జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వేదాద్రి ఎత్తిపోతల పథకం పరిస్థితి.

ఎప్పటికి పూర్తయ్యేనో..

వేదాద్రి కోసం రైతన్నల ఎదురుచూపులు

● పథకాన్ని నిర్వీర్యం చేసిన 'వైసీపీ'

● 'కూటమి'పై ప్రజల ఆశలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లాకు చిట్టచివర నియోజకవర్గంగా ఉన్న జగ్గయ్యపేట పరిధిలో వేదాద్రి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి టీడీపీ శ్రీకారం చుట్టింది. జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల వద్ద ముక్త్యాల ఎత్తిపోతల పథకం పేరుతో అప్పటి సీఎం చంద్రబాబు 2019 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. రూ.489 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. పనులు ప్రారంభమయ్యే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగునీటి ప్రాజెక్టుల్లో భారీగా అక్రమాలు జరిగాయని పనులను 15 నెలలపాటు నిలిపివేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో హడావిడి చేసింది. ముక్త్యాల వద్ద నిర్మించాల్సిన ఈ పథకాన్ని సుమారు ఎనిమిది కిలోమీటర్లకు దిగువన ఉన్న వేదాద్రికి మార్చింది. ముక్త్యాల ఎత్తిపోతల పథకం పేరును వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పథకంగా మార్పు చేసింది. రివర్స్ టెండరింగ్‌తో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.489 కోట్ల నుంచి రూ.369 కోట్లకు తగ్గించామని గొప్పలు చెప్పుకొంది. శంకుస్థాపన సమయానికి ప్రాజెక్టు వ్యయాన్ని రూ.489 కోట్లుగానే చూపించి నాటి సీఎం జగన్ శిలాఫలకాన్ని వర్చువల్ విధానంలో ఆవిష్కరించారు. టీడీపీ హయాంలో ఎవరైతే ముక్త్యాల ప్రాజెక్టును చేపట్టారో అదే కాంట్రాక్టరుకు వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పనులను అప్పగించారు.

'రివర్స్' లిఫ్ట్

వేదాద్రి ఎత్తిపోతల పూర్తయితే జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట మండలంలోని ఎనిమిది గ్రామాలు, వత్సవాయి మండలంలోని పది, పెనుగంచిప్రోలు మండలంలోని పది గ్రామాల్లో సుమారుగా 39వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనితోపాటు డీవీఆర్(దేవినేని వెంకటరమణ) బ్రాంచి కాల్వ పరిధిలోని 30 గ్రామాలకు వాటితోపాటు జగ్గయ్యపేట మున్సిపాలిటీకి ఈ ఎత్తిపోతల ద్వారా తాగునీరు అందాల్సి ఉంది. సుమారు 2.7 టీఎంసీల నీటిని సాగు, తాగునీటి అవసరాలకు ఈ ఎత్తిపోతల ద్వారా అందించాల్సి ఉంది.

తిరోగమన దిశగా వైసీపీ ఆలోచనలు

ప్రతి ప్రాజెక్టుకు, ఎత్తిపోతల పథకానికి ఇంజనీరింగ్ ప్రణాళిక ఉంటుంది. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి నీటిని ఎత్తిపోయడం సులభమైన విధానం. ఇంజనీరింగ్‌లో అనుభవం లేని వాళ్లు ఇదే విషయాన్ని చెప్పారు. నాడు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రివర్స్ మాయలో ఉన్న వైసీపీ చివరికి ఎత్తిపోతల పథకం నిర్మాణంలోనూ తిరోగమన దిశగానే ఆలోచించింది. టీడీపీ ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రదేశాన్ని రద్దు చేసి అక్కడి నుంచి నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతానికి పథకాన్ని మార్పు చేసింది. ముక్త్యాలలో కృష్ణానదిలో నీటిలభ్యత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ నదిలో లోతు బాగా ఉంటుంది. ముక్త్యాల నుంచి గండ్రాయి వరకు పైపులైన్ నిర్మించి, అక్కడున్న చెరువులోకి నీటిని పంపాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దీని నుంచి డీవీఆర్ బ్రాంచ్ కెనాల్ (16వ నంబరు బ్రాంచ్ కెనాల్)లోకి నీటిని ఎత్తిపోస్తారు. దీనివల్ల 30 గ్రామాలకు అత్యంత సులువుగా నీరు అందుతుంది. జగ్గయ్యపేట, షేర్‌మహ్మద్‌పేటలో ఉన్న ఊర చెరువులు, అనుమంచిపల్లిలో గల గిన్నె చెరువులకు పుష్కలంగా నీరు అందడంతో పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ఈ కోణంలో ఆలోచించి నాటి టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ముక్త్యాలను ఎంపిక చేసింది. ఇక్కడ నిర్మాణం చేపట్టడానికి అంగీకరించని వైసీపీ ప్రభుత్వం పథకం పేరును వైఎస్సార్‌గా ఎత్తిపోతలుగా మార్చింది. ఈ ప్రదేశాన్ని కాదని పథక నిర్మాణాన్ని వేదాద్రికి మార్పు చేసింది. దీనివల్ల వేదాద్రికి ఎగువన ఉన్న 10-15 గ్రామాల్లోని పంటలకు సాగునీరు అందే పరిస్థితి ఉండదు. జగ్గయ్యపేట, షేర్‌మహ్మద్‌పేటలోని ఊర చెరువులు, అనుమంచిపల్లిలోని గిన్నె చెరువులకు తెలంగాణలోని కాసవరం ఛానల్ నుంచి, చెరువు మాధవరంలోని సీఎం ట్యాంక్ నుంచి నీరు అందుతోంది. ఈ నీరు సక్రమంగా అందకపోవడంతో రైతాంగం ఇబ్బందులు పడుతోంది. వేదాద్రి నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం గండ్రాయికి పది కిలోమీటర్లకు దిగువన ఉంది. ప్రస్తుతం వేదాద్రిలో పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పైపులైన్ వత్సవాయి మండలం భీమవరం వద్ద డీవీఆర్ బ్రాంచ్ కెనాల్‌లో కలుస్తుంది. అక్కడ మళ్లీ లిఫ్టును పెట్టి ఎగువ భూభాగంలో ఉన్న చెరువులను నింపడానికి నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది.

కంచెలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

వేదాద్రి వద్ద నిర్మించే ఎత్తిపోతల పథకానికి ముందు దేవినేని వెంకటరమణ హయాంలో వేదాద్రి కంచెల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఉన్న వేదాద్రికి మూడు, నాలుగు కిలోమీటర్ల దిగువన ఉంటుంది. నదికి చెంతనే నిర్మించినప్పటికీ దీన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. నిర్వాహణ లేకపోవడంతో మోటార్లు చెడిపోయాయి. ఫలితంగా ఈ పథకం తలుపులు వేసుకుంది. వైసీపీ ప్రభుత్వం 2024 నాటికి వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. ఆ మేరకు పనులు మాత్రం చేయించలేకపోయింది. కూటమి ప్రభుత్వం అయినా ఈ పథకాన్ని సకాలంలో పూర్తి చేయాలని స్థానిక రైతాంగం కోరుతోంది.

శాస్త్రోక్తంగా..

● తిరుపతమ్మ ఆలయంలో కల్యాణ తలంబ్రాలు కలిపిన భక్తులు


తిరుపతమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణ తలంబ్రాలను కలుపుతున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సతీమణి అమ్మాజీ, భక్తులు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతమ్మ కల్యాణ తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెనుగంచిప్రోలుతోపాటు పలు గ్రామాలకు చెందిన మహిళలు గోటితో వడ్ల నుంచి వలచిన బియ్యాన్ని గ్రామంలోని పడమర బజారున ఉన్న తిరుపతమ్మ రంగుల మండపం వద్ద నుంచి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో భారీగా ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తెచ్చారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సతీమణి శ్రీరామ్ శ్రీదేవి(అమ్మాజీ)తోపాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వారికి ఆలయ రాజగోపురం వద్ద ఏఈవో తిరుమల ఈశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్.రమా ఆధ్వర్యంలో అర్చకులు వేదపండితులు స్వాగతం పలికారు. ఆలయంలోని నిత్య కల్యాణ మండపం వద్ద తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ చింతల శ్రీలక్ష్మీ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు కల్లూరి శ్రీవాణి, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం శ్రీరామ్ అమ్మాజీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నందిగామలో రగడ

(5వ పేజీ తరువాయి)

తీసుకోకుండా ఇతరులు ప్రతిపాదించిన సర్ణలతకు తాను పదవి ఇచ్చేది లేదని, కౌన్సిలర్లు కూడా ఆమెకు సహకరించబోరని స్పష్టం చేశారు. కౌన్సిలర్ల అభిప్రాయాలను ధిక్కరించి ఆమెను ఎందుకు ఛైర్‌పర్సన్ చేయాలని ప్రశ్నించినట్లు తెలిసింది. అది పార్టీ నిర్ణయమని చెప్పినా సౌమ్య వినిపించుకోలేదు. దీంతో మంత్రి లోకేశ్ వ్యక్తిగత కార్యదర్శి కిలారు రాజేశ్ కూడా ఈ అంశంపై కనపర్తి శ్రీనివాసరావు, నెట్టెం రఘురామ్‌కు ఫోన్ చేసినట్లు సమాచారం. కాగా, టీడీపీ, జనసేన కౌన్సిలర్లతో పాటు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కౌన్సిలర్లు కూడా ఎమ్మెల్యే సౌమ్య నిర్ణయమే తమకు శిరోధార్యమన్నారు. తనకు ఖాళీ బీఫాం తెచ్చి ఇవ్వాలని, అంతవరకు ఎన్నికకు వెళ్లేది లేదని సౌమ్య తేల్చారు. కౌన్సిలర్లు ఎవరూ బయటకు రాలేదు. ఈ వివాదంతో పట్టణంలోని ప్రజలతో పాటు నాయకులు పెద్ద ఎత్తున సౌమ్య నివాసానికి వచ్చారు. పట్టు వీడని సౌమ్య కౌన్సిలర్ల.. ఓటింగ్‌కు వెళ్లకుండా నిలువరించారు. దీంతో ఎన్నిక వాయిదా పడింది. కాగా, సోమవారం రాత్రి 9 గంటల సమయంలో మంత్రి నారాయణ.. సౌమ్యకు ఫోన్‌చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఛైర్‌పర్సన్ ఎన్నిక సౌమ్య నిర్ణయానికే వదిలేయడంతో మంగళవారం నాటి ఎన్నిక లాంఛనం కానుంది. దీంతో కౌన్సిలర్లను నందిగామలోని ఓ హోటల్‌లో ఉంచారు. అక్కడి నుంచి ఎన్నికల ప్రాంగణానికి తీసుకెళ్తారు.

ఆధిపత్య పోరే కారణమా?

ఎంపీ కేశినేని చిన్ని, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మధ్య కొద్దికాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఇద్దరి మధ్య తేడాలు వచ్చినట్టు ప్రచారం జరిగింది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు కూడా వీటిని నిజం చేశాయి. నియోజకవర్గంలోని కొందరు నాయకులు పదవుల కోసం ఎంపీ మద్దతు కోరారు. వారికి ఆయన అండగా నిలుస్తున్నారు. ఈ పరిణామాలను సౌమ్య జీర్ణించుకోలేక పోతున్నారని ఆమె మద్దతుదారులు చెబుతున్నారు. ఇటీవల నందిగామ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవిని ఎంపీ తన అనుచరుడైన వీరంకి వీరాస్వామికి ఇవ్వాలని సూచించారు. అప్పుడు కూడా సౌమ్య పట్టుబట్టారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ విషయంలోనూ ఎంపీ కల్పించుకుని శాఖమూరి స్వర్ణలతకు మద్దతు తెలిపారన్నది ఎమ్మెల్యే సౌమ్య చెబుతున్నారు. అందుకే ఎన్నికను వాయిదా వరకు తీసుకొచ్చారని చెబుతున్నారు.

వెనుదిరిగిన అధికారులు

నందిగామలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని అధికారులు తరలివచ్చారు. ఎన్నికల అధికారి, ఆర్‌డీవో కె.బాలకృష్ణ సర్వం సిద్ధం చేశారు. అయితే, ఛైర్‌పర్సన్ అభ్యర్థి ఎంపిక ఖరారు కాకపోవడంతో టీడీపీ సభ్యులతో పాటు వైసీపీ నుంచి వలస వచ్చిన కౌన్సిలర్లు ఎమ్మెల్యే నివాసంలోనే ఉండిపోయారు. ఎన్నికల నియమావళి ప్రకారం 12 గంటలకల్లా కోరం పూర్తి కాకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేశారు.

అవకాశం ఉన్నా.. ఛ్!

నందిగామ మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. ఛైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి మరణంతో ఖాళీ అయిన ఈ పదవికి సోమవారం ఏర్పాట్లు చేశారు. 20 వార్డులు ఉన్న మునిసిపాలిటీలో వైసీపీ 13, టీడీపీ 6, జనసేన ఒక స్థానంలో గెలిచాయి. ఎన్నికల ముందు, తరువాత వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీకి 13 మంది సభ్యుల బలం ఉండగా, వైసీపీకి నలుగురు, జనసేనకు ఒకరున్నారు. మరొక కౌన్సిలర్ తటస్థంగా ఉన్నారు. ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్‌పర్సన్ కూడా మృతి చెందడంతో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కాగా, ఛైర్‌పర్సన్ స్థానం సునాయాసంగా సాధించుకునే అవకాశమున్నా అభ్యర్థి ఎంపికలో తలెత్తిన వివాదంతో సభ్యులు పోలింగ్‌కు హాజరు కాలేదు.

పీఈటీ ఆత్మహత్యాయత్నం

వన్‌టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీసుస్టేషన్ సమీపంలోని పాదర్తి సుందరమ్మ నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాల పీఈటీ సుంకర మాధవీదేవి(42) సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. ఆమె ప్రస్తుతం గొల్లపూడిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సేకరించిన సమాచారం మేరకు పీఈటీ మాధవీదేవి, ఆమె భర్త పురుషోత్తమం, కుమార్తె, కుమారునితో కలిసి చిట్టినగర్‌లో నివాసం ఉంటున్నారు. పురుషోత్తమం జి కొండూరు మండలం కొండూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, మాధవీదేవి విజయవాడలో పాదర్తి సుందరమ్మ హైస్కూల్‌లో పీఈటీగా పని చేస్తున్నారు. గత కొన్నినెలల నుంచి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి.రత్నకుమారి తరచూ మాధవీదేవిని వేధింపులకు గురి చేస్తోందని చెబుతున్నారు. తాను చెప్పిందే చేయాలని, హైస్కూల్‌లో ఆటలు ఆడించవద్దని ఒత్తిడి చేస్తూ వస్తున్నారు. గత ఏడాది డీఈవోకు మాధవీదేవి ఫిర్యాదు చేశారు. మరలా రెండు నెలల తరువాత తాను ఇచ్చిన ఫిర్యాదుపై చర్య లు కోసం డీఈవోకు లేఖ రాశారు. అయితే ప్రధానోపాధ్యాయురాలిపై ఎటువంటి చర్యలు తీసుకోక పోగా మాధవీదేవికి మెమో ఇచ్చారు.. ఆమె విధు ల పట్ల నిర్లక్ష్యంగా ఉంటుండడంతో పాటు ఇంకా పలు అభియోగాలతో మెమో ఇచ్చారు. దీంతో ఆమె మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో సోమవారం మాధవీదేవి స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి ఇంట్లో భర్త పేరిట లేఖ రాశారు. బయటకు వెళుతున్నానంటూ భర్తకు ఫోన్ చేసి చెప్పారు. ఇంటికి వచ్చిన భర్త తన భార్య రాసిన లేఖ చూసి కంగారుపడి కొత్తపేట పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడి నుంచే మాధవీదేవికి ఫోన్ చేశారు. మనస్సు బాగాలేదని తాను కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడికి వచ్చానని చెప్పడంతో భర్త అక్కడకి వెళ్లాడు. గుడిలోంచి బయటకు వచ్చిన ఆమె కొన్ని మాత్రలను మింగింది. వెంటనే పురుషోత్తం స్థానికుల సహకారం తో ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రధానోపాధ్యాయురాలి వేధింపులు తాళలేకనే తనభార్య ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు.


మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాల్సిందే

● సాంఘిక సంక్షేమ వసతి గృహాల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని, ఏ ఒక్క విద్యార్థి తప్పకుండా ప్రతి ఒక్కరిపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గృహ సంక్షేమ అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గృహ సంక్షేమ అధికారులు, ట్యూటర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ప్రస్తుతం విద్యార్థుల అకడమిక్ సామర్థ్యం, పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు తీసుకోవాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్ మార్గనిర్దేశనం చేశారు. జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 95.2 శాతంగా నమోదైందని, ఈ ఏడాది నూరుశాతం నమోదుకు సమష్టిగా కృషిచేయాలని ఆదేశించారు. సబ్జెక్టు నిపుణులు, ట్యూటర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించడం, విద్యార్థులు ఏ అంశాల్లో వెనుకబడి ఉన్నారో అందులో పట్టు సాధించేలా చూడాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ తరగతులు నిర్వహించాలని, సబ్జెక్టుపరంగా సందేహాలను నివృత్తి చేస్తూ ప్రోత్సహించాలన్నారు. వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, సాం ఘి క సంక్షేమ శాఖ సూపరింటెండెంట్లు ఎన్.సునీత, ఎ.ఆంజనేయులు, సహాయ సాంఘిక సంక్షేమ, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● అధికారులు, సిబ్బందితో కలెక్టర్ లక్ష్మీశ

మైలవరంరూరల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా రీసర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. మండలంలోని జంగాలపల్లిలో సోమవారం కలెక్టర్ పర్యటించి భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి భూముల రీసర్వేపై వారికి గల అనుమానాలను నివృత్తి చేశారు. గ్రామంలోని ప్రతి రైతుకు వారి పొలాల సర్వే నిర్వహణ విషయాన్ని నోటీసు ద్వారా తప్పనిసరిగా తెలియజేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ డైరెక్టర్ టి.త్రివిక్రమరావు, తహసీల్దార్, మండల సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ మోడల్ మెట్రో స్టేషన్

(5వ పేజీ తరువాయి)

లింగాయపాలెం వరకు కారిడార్-3, జక్కంపూడి నుంచి పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-4 కూడా పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ దగ్గరే అనుసంధానమవుతాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పీఎన్‌బీఎస్ దగ్గర మల్టీమోడల్ మెట్రో స్టేషన్‌ను నిర్మించాలని ఏపీఎంఆర్‌సీ అధికారులు భావిస్తున్నారు.

మల్టీ మోడల్ అంటే..

మెట్రోస్టేషన్‌తో పాటు ఆర్టీసీ బస్సులు, సాధారణ రైళ్లకు కూడా ప్రయాణికులు చేరుకునేలా ప్లాన్ రూపొందించాలన్నది ఏపీఎంఆర్‌సీ అధికారుల ఆలోచన. పీఎన్‌బీఎస్ ఎదుట ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలంతో పాటు పక్కనే రైల్వేట్రాక్స్ అవతల రైల్వే స్థలం కూడా ఉంది. ఇవన్నీ ఉపయోగించుకుంటూ ఎలివేటెడ్ మల్టీమోడల్ మెట్రో స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నది అధికారుల అభిప్రాయం. దీనివల్ల మెట్రో రైళ్లలో దిగినవారంతా నేరుగా పీఎన్‌బీఎస్‌లోకి, అలాగే రైల్వేస్టేషన్‌కు కూడా చేరుకునే అవకాశం ఉంటుంది. అలాగే, రైల్వేస్టేషన్, బస్టాండ్లకు వచ్చినవారు కూడా మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఈ మల్టీమోడల్ స్టేషన్‌కు సంబంధించి విధాన నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించి డిజైన్లకు శ్రీకారం చుడతారు.

కేసరపల్లిలో మెట్రో కోచ్ డిపో ఏర్పాటు

మెట్రో రైళ్ల కోచ్ డిపోను కేసరపల్లిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో కోచ్ డిపోను నిడమానూరులో ఏర్పాటు చేయాలనుకున్నారు. కారిడార్-1 అనేది గన్నవరం నుంచి వస్తుంది కాబట్టి.. కోచ్ డిపోను కూడా దీనికి దగ్గరగా ఉన్న కేసరపల్లిలో ఏర్పాటు చేయాలన్నది మెట్రో అధికారుల ఆలోచన. ఇందుకోసం కేసరపల్లిలో 40 ఎకరాల మేర సేకరించనున్నట్టు తెలుస్తోంది. కేసరపల్లి కోచ్ డిపో నుంచి మెట్రో రైళ్లు గన్నవరం వెళ్లి, అక్కడి నుంచి తిరిగి విజయవాడ వస్తాయి.

మెట్రో పాత ప్రతిపాదిత స్టేషన్లలోనే భూ సేకరణ

విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం కోసం మొత్తం 100 ఎకరాలు అవసరమని ఉమ్మడి కృష్ణా యంత్రాంగాలకు నివేదిక అందింది. దీనికి సంబంధించి ప్రభుత్వానికి కూడా ప్రతిపాదన వెళ్లింది. భూ సేకరణకు అనుమతులు కూడా వచ్చాయి. గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ప్రకార మే నిర్ణయించిన స్టేషన్ల దగ్గర భూములను సేకరిస్తారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ జరుపుతారా? లేదా?, పరిహారం వంటి అంశాలపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు.

అమరావతికి మార్గం సుగమం

(5వ పేజీ తరువాయి)

ఆనంద్ పాటిల్ మాట్లాడుతూ అమరావతి రైల్వేలైన్‌ను ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి వయా అమరావతి మీదుగా నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర నాలుగేళ్లలో నిర్మించనున్నట్టు తెలిపారు. ట్రాక్ నిర్మాణ పనులకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని ఆయన చెప్పటంతో దాదాపు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించటం ఖాయమనిపించింది.

మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్‌కూ మంచి అవకాశమే..

అమరావతి రైల్వేలైన్ అనేది గుంటూరు, విజయవాడకే కాకుండా హైదరాబాద్, చెన్నై సహా దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు అనుసంధానమవుతుందని డీఆర్ఎం చెప్పారు. కేవలం నాలుగేళ్లలోనే కొత్త లైన్ పనులు పూర్తి చేస్తామని ఆయన పేర్కొనడం వల్ల ఈసారి కేటాయింపులు జరిపే అవకాశం కనిపిస్తోంది. అలాగే, మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ప్రాజెక్టుకు కూడా భారీగానే నిధులు కేటాయించే అవకాశముంది.

డివిజన్‌లో రూ.5 వేల కోట్లకు పైగా ఆదాయమే లక్ష్యం

ఈ ఏడాది విజయవాడ రైల్వే డివిజన్ రూ.5 వేల కోట్లకు పైగా ఆదాయం రాబట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు డీఆర్ఎం నరేంద్ర చెప్పారు. విజయవాడ రైల్వేస్టేషన్ ద్వారా ఏడాదికి రూ.500 కోట్ల ఆదాయం పొందుతున్నామని, రాజమండ్రి స్టేషన్ అభివృద్ధి పనుల కోసం రూ.271 కోట్లను విడుదల చేశారని, విజయవాడ-విశాఖ డివిజన్ల మధ్య 128 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను పూర్తి చేశామని డీఆర్ఎం తెలిపారు. అలాగే, సంక్రాంతి సీజన్‌లో రైళ్లను సమర్థవంతంగా నడిపినట్లు పేర్కొన్నారు.



బైక్ పైనుంచి పడి యువకుడి మృతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి పడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని కృష్ణలంక జాతీయ రహదారిపై ఉన్న అన్న క్యాంటీన్ ఎదురుగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ ఘటన జరిగింది. మొగల్రాజపురానికి చెందిన కొప్పుల భరత్ రాజ్ (23) బెంజిసర్కిల్ నుంచి వారధి వైపు బైక్‌పై వస్తుండగా అన్న క్యాంటీన్ ఎదురుగా రోడ్డుపై తనంతట తాను పడి పోయి మృతి చెందాడు. తండ్రి మరియన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


సన్‌లైట్ సెంటర్ వద్ద రహదారి దుస్థితి


ఉస్మాన్ హోటల్ పక్క వీధిలో..

పారిశ్రామికవాడలో రోడ్లు అధ్వానం

- సన్‌లైట్ సెంటర్‌లో కాల్వ నిర్మించి పనులు నిలిపేసిన గుత్తేదారు
- ఉస్మాన్ హోటల్ పక్క వీధిలో గోతులు పూడ్చినా మళ్లీ మామూలే
- మరమ్మతులు చేయాలని వాహనదారుల వేడుకోలు

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

విజయవాడ పారిశ్రామికవాడలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుంతలమయం. రహదారిపై రాళ్లు తేలి వాహనాలకు పంచర్లు అవుతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సన్‌లైట్ సెంటర్‌లో కాలువ నిర్మాణానికి, రహదారి ఎత్తు పెంచి నిర్మించడానికి గుత్తేదారుకి అప్పగించారు. నాలుగు నెలలు పూర్తికావొచ్చినా పనులు అరకొరగా సాగుతున్నాయి. కాలువ నిర్మాణం చేసి గుత్తేదారు చేతులు దులుపుకున్నారు. రహదారి ఎత్తు పెంచి నిర్మించాల్సి ఉండగా ఆ పనుల ఊసే లేకుండా పోయింది. దీంతో రహదారి అంతా గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదీ కాకుండా భారీ వాహనాల రాకపోకల వల్ల మరింత అధ్వానంగా రహదారి తయారయ్యింది. ఆటోనగర్ ప్రధాన కూడలి ప్రాంతమైన ఉస్మాన్ హోటల్ పక్క సందులో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. గుంతల పూడ్చే కార్యక్రమంలో కొన్ని గుంతలు పూడ్చినా అవి మళ్లీ యథాస్థానానికే వచ్చాయి. దీంతో రహదారి మొత్తం గోతులమయంగా ఉంది. ఆటోనగర్ ప్రధాన కూడలి సమీపంలో ఉండడంతో వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో వాహనదారులు తమ వాహనాలు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని రహదారికి మరమ్మతులు చేయాలని వేడుకుంటున్నారు.

వైభవంగా మహాశివుడికి కుంభాభిషేకం


కుంభాభిషేక క్రతువు నిర్వహిస్తున్న శ్రీ చంద్రశేఖరేంద్ర మహా సరస్వతి స్వామి

మొగల్రాజపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర అర్ధనారీశ్వర స్వామికి సోమవారం ఆలయ ధర్మకర్తలు చెరుకూరి సతీష్‌బాబు, అనిల దంపతుల ఆధ్వర్యంలో కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర మహా సరస్వతి స్వామి చేతుల మీదుగా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. మాఘమాస శుభగడియల్లో వందలాది భక్తుల సమక్షంలో మంగళ హారతులతో మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా క్రతువులు నిర్వహించారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు ఈ వేడుకలు జరిగాయి. మూడో రోజైన సోమవారం తెల్లవారు జాము నుంచి హోమాలు, అభిషేకాలు, పూర్ణాహుతి, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, పండిత సత్కారాలు, వేదాశీర్వాదం, మంగళహారతి, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగుమోతు రాజా, గుమ్మడి గురుప్రసాద్, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

బేడ (బుడ్గ) జంగం కులానికి ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బేడ (బుడ్గ) జంగం కులానికి ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఏపీ రాష్ట్ర బేడ (బుడ్గ) జంగం ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సర్టిఫికెట్లను 2020 అక్టోబరు 3న ఆన్‌లైన్‌లో తొలగించారన్నారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. తమకు న్యాయం చేస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. సర్టిఫికెట్లు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందడం లేదని వాపోయారు. గతంలోనే బేడ (బుడ్గ) జంగం ఎస్సీ జాబితాలోనే ఉండేదని గుర్తు చేశారు.

ఆహార కిట్ల పంపిణీ

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని వేస్ట్ పికర్స్ కుటుంబాలకు రిలయబుల్ ట్రస్ట్ సహాయం అందించింది. హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ విజయవాడలో వ్యర్థాలను సేకరించే వారి కుటుంబాలకు 200 అవసరమైన ఆహార కిట్లను పంపిణీ చేసింది. నిరుపేద పిల్లల కోసం సాయంత్రం ట్యూషన్ సెంటర్లను నిర్వహిస్తున్న ఆదర్శ విద్యా కేంద్రాలు పిల్లల అవసరాలను గుర్తించాయి. ఆదర్శ విద్యా కేంద్రాల సహకారంతో రిలయబుల్ ట్రస్ట్ ఆహార కిట్లను పంపిణీ చేసింది. ట్రస్టీలు టి.రవి, సత్యానందం, సుధీర్, లిటిల్ హోప్ ట్రస్ట్ టి.పవన్, వెంకట రమణ, లిటిల్ హోప్ ట్రస్టీ విఫ్నేష్, ఆదర్శ విద్యా కేంద్రాల డైరెక్టర్ బ్లెస్సీ వెస్లీ పంపిణీలో పాల్గొన్నారు. ఓం శాంతి ట్రస్ట్ చైర్‌పర్సన్ పిన్నమనేని శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



ఆహార కిట్లను అందిస్తున్న రిలయబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

భక్తుల కల్పవల్లి మరియతల్లి

- విశాఖపట్నం కత్తిపూడి విచారణకర్తలు ఫాదర్ చిటికిల రాజ్‌కుమార్
- నాల్గో రోజుకు చేరుకున్న నవదిన ప్రార్థనలు


విదేశీయులకు గుణదల విశిష్టతను వివరిస్తున్న విజయవాడ కతోలిక పీఠాధిపతి రాజారావు


సమష్టిదివ్య పూజాబలి సమర్పిస్తున్న రాజ్‌కుమార్, మువ్వల ప్రసాద్, తదితరులు

గుణదల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మరియమాత తనను ఆశ్రయిస్తున్న భక్తుల మనవులను ఆలకిస్తూ కల్పవల్లిగా నిత్యం నీరాజనాలు అందుకుంటుంద ని విశాఖపట్నం కత్తిపూడి విచారణకర్తలు ఫాదర్ చిటికిల రాజ్‌కుమార్ అన్నారు. గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన నాల్గో రోజు నవదిన ప్రార్థనలకు చిటికిల రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన గుణదల కొండకు వచ్చే భక్తులకు లూర్దుమాత అండగా నిలుస్తూ దేవుని వరాలు భక్తులకు అందిస్తోందని తెలియజేశారు. మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న గుణదలమాత మహోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలి రానున్నారని ఈ నేపథ్యంలో బిషప్‌గ్రాసి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. అనంతరం గురువులు భక్తులతో కలిసి కొండ మధ్యలోని మరియమాత గుహ వద్దకు దివ్యసత్ప్రసాద మదనంతో చేరుకున్నారు. అనంతరం ఫాదర్ చిటికిల రాజ్‌కుమార్, మువ్వల ప్రసాద్, యేలేటి విలియం జయరాజు, కొలకాని మరియప్ప, సునీల్ రాజ్ తదితరులు సమష్టి దివ్యపూజా బలి సమర్పించారు. అనంతరం భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు.

ఐఏవైఎఫ్ సభలకు 'గద్దె' విరాళం

పటమట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల నిర్వహణ నిమిత్తం గద్దె ఫౌండేషన్ ఆర్థికసాయం అందించింది. శ్రీకాకుళంలో ఈనెల 6 నుంచి 9 వరకు జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల నిర్వహణ నిమిత్తం గద్దె ఫౌండేషన్ తరపున రూ.10 వేలను గద్దె క్రాంతికుమార్ సోమవారం ఏఐవైఎఫ్ సభ్యుడు పరుచూరి రాజేంద్ర ప్రసాద్‌కు అందించారు.

త్రిశక్తిపీఠంలో శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసాలు


త్రిశక్తిపీఠంలో బారులు తీరిన భక్తులు

కృష్ణలంక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలో సోమవారం శ్రీ పంచమి సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో అక్షరాభ్యాసాలు, శ్యామలాదేవిగా కాళీమాత అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ పుష్కర జ్ఞానమ్- 2025 పుస్తకాన్ని ఆవిష్కరించారు. చిన్నారులకు పాలు, పాయసం, పాలకోవా, చక్రపొంగలి ప్రసాద వితరణ చేశారు. ఉచితంగా 500 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించి పలక, బలపం, వ్యాకరణ పుస్తకం, పెన్సిల్, పెన్ను ఆలయ కమిటీ నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. సరస్వతీ హోమం, రాజశ్యామలా దేవి హోమాలు వేదోక్తముగా ఆలయ మంటపం నందు నిర్వహించారు.

ఐడియల్ స్కూల్‌లో...

స్థానిక సుధాకర్స్ ఐడియల్ పబ్లిక్ స్కూల్‌లో చిన్నారులచే వారి తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారులకు పలక, బలపం, పెన్ను, పెన్సిల్, పుస్తకం, ప్యాడ్‌లను స్కూల్ ఉపాధ్యాయినులు గాయత్రి, శిరీష అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జామి సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, కరస్పాండెంట్ దేవినేని వరలక్ష్మి, ఇన్‌చార్జి కనకదుర్గ, డీన్ సురేష్ కనకమహాలక్ష్మి, శ్రీదేవి, అనూష పాల్గొన్నారు.


స్వర్ణభారతిలో నగదు బహుమతులు అందుకున్న విద్యార్థులు

స్వర్ణభారతిలో...

పటమట: స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ ఆలూరి శంకరరావు ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2023-24లో టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆలూరి శంకరరావు, ఆలూరి సురేష్‌లు సతీ సమేతంగా నగదు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి కియా సిరోస్ కారు విడుదల


జ్యోతి వెలిగిస్తున్న చైర్మన్ రావెళ్ల సుబ్బయ్య డైరెక్టర్ రావెళ్ల రస్య, ఎల్ఎల్ మారుతీకుమార్

భారతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగంలో కియా మోటార్స్ నూతన టెక్నాలజీతో కూడిన సిరోస్ కారును సోమవారం నాగార్జున నగర్ కాలనీలోని సింహామోటార్స్ షోరూంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సింహా మోటార్స్ చైర్మన్ రావెళ్ల సుబ్బయ్య, డైరెక్టర్ రావెళ్ల రస్య,సేల్ అధికారి ఎల్.ఎల్. మారుతీకుమార్ పాల్గొని జ్యోతి వెలిగించారు. అనంతరం కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతీకుమార్ మాట్లాడుతూ ఈ నూతన సిరోస్ కారులో 12.3 అంగుళాల టచ్ స్క్రీన్, 12.3 అంగుళాల క్లస్టర్, 5అంగుళాల ఏసీ కంట్రోల్స్ అన్ని కలిసి ఒకే 30 అంగుళాల ట్రినిటీ పానరోమిక్ డిస్‌ప్లే కలిగి ఉంటుందన్నారు. వీటితోపాటు వెనుక సీట్లు కూడా వెంటిలేషన్, రీక్లైనింగ్, స్లైడింగ్ సౌకర్యాలు ఉంటాయన్నారు. 20స్టాండర్డ్ భద్రతా ప్రమాణాలను కలిగి ఉంటాయన్నారు. పెట్రోల్, డీజిల్, ఆటోమ్యాటిక్, మాన్యువల్ వేరియంట్స్‌లలో 8 ఆకర్షణీయమైన రంగుల్లో లభిస్తాయన్నారు. దీని ప్రారంభ ధర రూ.8,99,900(ఎక్స్ షోరూం ధర)గా ఉందన్నారు. కార్ల బుకింగ్ కొరకు సింహా మోటార్స్ షోరూంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో నేడు తిరుచ్చి ఉత్సవం


స్వామివారి తిరుచ్చి

లబ్బీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలో తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలిత తెలిపారు. ఆలయంలో ఉదయం 6.45 నిముషాలకు స్వామివారి ఊరేగింపు ఉత్సవం ప్రారంభమవుతుందని, ప్రధాన ఆలయం నాలుగు వైపుల స్వామివారి ఉత్సవ విగ్రహాలను పూల అలంకరణతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి ఆశీస్సులు పొందడంతో పాటు తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. స్వామివారి ఊరేగింపు సమయంలో ఉత్సవ విగ్రహాలకు భక్తులు స్వయంగా ఇచ్చే కర్పూర హారతులు స్వీకరించడతాయని తెలిపారు.

అపోహలు వీడండి...రక్తదానం చేయండి

- రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్



మొగల్రాజపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రక్తదానం మీద అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మదన్‌మోహన్ చెప్పారు. కేవీఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులను ఆదుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. అనం తరం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ సునీత, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్వేత పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలించిన కలెక్టర్

ఎ.కొండూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధిగ్రస్థులకు సురక్షిత కృష్ణా జలాల సరఫరా పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రమైన ఎ.కొండూరులో పైపులైన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 కోట్లతో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 38 గ్రామాల్లో అదనంగా 14 వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తునట్టు తెలిపారు. 200 కిలో మీటర్ల పైపులైన్ పనులు ఎంతవరకు జరిగాయని అధికార్లను ప్రశ్నించారు. కిడ్నీ బాధితులకు సురక్షితమైన తాగునీరు అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, నిర్దేశించిన లక్ష్యంలోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్‌డీవో మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విద్యాసాగర్ ఇతర అధికార్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు

సౌర విద్యుత్‌ను అందించండి

● లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, విజయవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ అందించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలుండగా,8,455 కేంద్రాలకు విద్యుదీకరణ సౌకర్యం లేదన్నారు. చిన్నారులకు మౌలిక సదుపాయాల కల్పనను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీలను పీఎం సూర్యఘర్ పథకంలో చేర్చాలన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా సూర్యఘర్ పథకం అవసరమన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా అమలు చేయడంలో కలెక్టర్‌తో కలిసి నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన గుర్తు చేశారు.

మడ అడవుల అభివృద్ధికి చర్యలు

రాష్ట్రంలోని తీరప్రాంతాల్లో ఉన్న మడ అడవుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న క్రమంలో మిష్టి ప్రోగ్రాం కింద రూ.4.30 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర పర్యావరణం అటవీ వాతావరణ మార్పు సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు ఎంపీలు కేశినేని శివనాథ్, బస్తిపాటి నాగరాజు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ ఏపీతో సహా 6 రాష్ట్రాల్లో పునరుద్ధరణ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక-2023 మేరకు రాష్ట్రంలో మడ అడవుల విస్తీర్ణం 408.42 నుంచి 421.43 కిలోమీటర్ల మేరకు 2021-2023 మధ్య పెరిగిందని మంత్రి వివరించారు. 2023-2024లో ప్రారంభమైన మిష్టి ప్రోగ్రాంలో పాడైన మడ అడవులను పునరుద్ధరించడమేనన్నారు. అన్ని ప్రాంతాల్లో కలిపి 3836 కిమీ మడ అడవుల పునరుద్ధరణకు రూ.17.96 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

జాతీయ క్రీడల్లో సత్యజ్యోతికి కాంస్యం

● అభినందించిన శాప్ చైర్మన్ రవినాయుడు

లబ్బీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడాపోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి వెయిట్ లిఫ్టింగ్ 87 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. విజయనగరానికి చెందిన టి.సత్యజ్యోతి ఈ ఘనత సాధించడంపై శాప్ చైర్మన్ రవినాయుడు ఫోన్‌లో అభినందనలు తెలిపారు. ఈమె విజయం క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని, ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు.

దుర్గగుడిలో వేదోక్తంగా సరస్వతీ యాగం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపంచమి సందర్భంగా దుర్గగుడిలో సరస్వతీయాగాన్ని వేదోక్తంగా నిర్వహించారు. శ్రీ పంచమి నాడు అమ్మవారు ఆవిర్భవించారని నమ్మిక. దీంతో దేవస్థానంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్, దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో కే రామచంద్రమోహన్ పూజల్లో పాల్గొని వేద పండితుల ఆశీస్సులు అందుకున్నారు. కనకదుర్గమ్మ మూలవిరాట్టును మహామండపంలోని వేదికపై ప్రతిష్ఠించిన దుర్గాదేవి అర్చనా మూర్తిని సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో విచ్చేసి పూజలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. విద్యార్థులకు రక్షాకంకణం, పెన్ను, లడ్డూ ప్రసాదం, అమ్మవారి ప్యాకెట్ సైజు చిత్రపటాన్ని ఈవో అందజేశారు. పలువురు తల్లి తండ్రులు తమ బిడ్డలకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో తెగిపడిన డ్రైవర్ కాలు



నుజ్జునుజ్జయిన లారీ క్యాబిన్

కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల-కీసర జాతీ య రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తన కాలును కోల్పోయాడు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై టోల్‌గేట్‌కు సంబంధించిన వాటర్ ట్యాంక్ లారీ మొక్కలకు నీరు పడుతుండగా అదేమార్గంలో హైదరాబాద్ వెళుతున్న మరో లారీ వాటర్ ట్యాంక్ వెనుక భాగంలో బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సన్నగూడెం గ్రామానికి చెందిన పెద్ది నాగార్జున క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది అతికష్టం మీద డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. డ్రైవర్ ఎడమ కాలు క్యాబిన్‌లో తెగిపడిపోవడంతో స్పృహ కోల్పోయాడు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి పంపి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోనుసూద్‌కు కిడ్డీబ్యాంక్ సొమ్ములిచ్చిన చిన్నారులు

గన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు సోనుసూద్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం సీఎం చంద్రబాబును కలిసి రాష్ట్రానికి 4 అంబులెన్స్‌లను అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదారాబాద్ వెళ్లేందుకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సోనుసూద్ ఎమ్మెల్యే యార్లగడ్డను కలిశారు. సోనుసూద్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే యార్లగడ్డ అభినందించారు. ఇటు సినిమాల్లో రాణిస్తూ అటు సేవా కార్యక్రమాలు చేయడం పట్ల అభినందనలు తెలిపారు.

అంబాపురం పంచాయతీలో స్థల వివాదం

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంబాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని ఓ స్థలం విషయమై ఇరువర్గాల మధ్య సోమవారం వివాదం చోటు చేసుకుంది. పంచాయితీ పరిధిలోని 1వ వార్డులో సుమారు 2వేల గజాల స్థలంలో కొందరు వ్యక్తులు ఫెన్సింగ్ వేస్తుండగా స్థానికులు కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పంచాయతీ భూమి కబ్జాకు గురవుతుందని, వాటిని కాపాడాలంటూ స్థానికులు ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. అయితే ఫెన్సింగ్ వేస్తున్న వ్యక్తులు మాత్రం స్థలాన్ని తాము కొనుగోలు చేశామని అన్ని ఆధారాలు ఉన్నాయని, హైకోర్టు కూడా పొజిషన్‌లోకి వెళ్లడానికి అనుమతిచ్చిందని చూపించారు. స్థానికులకు ఈ విషయంపై అవగాహన లేక తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

11 నుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌కు ఆహ్వానం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 2: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 15 వరకు పెద్దతిరునాళ్ల, కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో, దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా కూడా ఉన్న కే రామచంద్రమోహన్‌ను తిరుపతమ్మ దేవస్థానం ఈవో, బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ఈఈ లింగం రమతో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. తిరుపతమ్మ దేవస్థానం వేదపండితులు, అర్చకులు రామచంద్ర మోహన్‌కు ఆశీస్సులు అందించారు. గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి మహా కల్యాణ మహోత్సవం ఈనెల 11న రాత్రి 9.32 గంటలకు ప్రారంభం కానుంది.

దుర్గమ్మ సన్నిధిలో సీఎం ముఖ్యకార్యదర్శి దంపతులు



వన్‌టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎం ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర దంపతులు దుర్గమ్మను దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేదపండితులు వారికి వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదంతోపాటు చిత్రపటం ఇచ్చారు.

యథేచ్ఛగా అక్రమాలు


ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్


డ్రైనేజీ మూసేసి మెట్లు నిర్మిస్తున్న కార్మికులు

● అనుమతులు లేకుండా స్టేడియం కమిటీ నిర్మాణాలు ● దగ్గరుండి మరీ పర్యవేక్షించిన మున్సిపల్ అధికారులు ● బహిరంగ వేలంలో షాపులు దక్కించుకున్న గడ్డం గ్యాంగ్ అనుచరులు

అక్రమ నిర్మాణాలపై మున్సిపల్, సీఆర్‌డీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తుంటారు. మరీ అధికారులే దగ్గరుండి అక్రమ నిర్మాణం చేపడితే వారి పై ఎవరు చర్యలు తీసుకోవాలి. ఏకంగా జిల్లా కలెక్టరే చైర్మన్‌గా వ్యవహరించే ఎన్టీఆర్ స్టేడియం కమిటీ నిబంధనలన్నీ తుంగలో తొక్కి అక్రమ నిర్మాణం చేసేశారు. ఆంధ్రజ్యోతి-గుడివాడ

స్థానిక నందమూరి తారకరామారావు స్టేడియం కమిటీ చైర్మన్ నేతృత్వంలో ఎన్టీఆర్ స్టేడియంలో కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది. ఇండోర్ స్టేడియం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పిల్లల పార్కు ఉండేది. మాజీ మంత్రి కొడాలి నాని హయాంలో స్టేడియం కమిటీ పార్కును తొలగించి రైతుబజారు ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలోకి మార్చారు. పార్కు స్థలంలో అప్పటి స్టేడియం కమిటీ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్, అధికారులు, కమిటీ సభ్యుల అనుమతులతో జీ ప్లస్ టూ భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని హుటాహుటిన పూర్తిచేసి బహిరంగ వేలం ద్వారా లీజులకు ఇచ్చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. భవన నిర్మాణానికి మున్సిపాల్టీ నుంచి గానీ, సీఆర్‌డీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు, కనీసం దరఖాస్తు కూడా చేయలేదని సమాచారం. అలాగే అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ కూడా తీసుకోలేదు.

ఎన్నికలు దగ్గరపడుతుండటంతో 2024 అక్టోబరు 23న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని చేతుల మీదుగా ఈ కాంప్లెక్స్‌ను హడావుడిగా ప్రారంభించారు. స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం పూర్తి చేయకుండానే దుకాణాల బహిరంగ వేలం కూడా నిర్వహించారు. దుకాణ సముదాయ నిర్మాణానికి స్టేడియం కమిటీ రూ.1.50 కోట్లు ఖర్చు చేయగా, వేలం ద్వారా రూ.1.66కోట్లు ఆదాయం సమకూరినట్టు సమాచారం.


ప్రారంభోత్సవ శిలాఫలకం

కన్నెత్తి చూడని మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం కావడంతో అధికారులు కన్నెత్తి చూడలేదు. ముఖ్యంగా మున్సిపాల్టీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు అక్రమ నిర్మాణంపై ఎలాంటి నోటీసులుచ్చిన దాఖలాలు లేవు. పట్టణంలో నిర్మాణాలకు నోటీసులిచ్చి హడావుడి చేసే మున్సిపల్ అధికారులు ఈ భవనం వైపు కన్నెత్తి చూడకపోవడంపై భవన యజమానులు పెదవివిరుస్తున్నారు.

ఈ బహిరంగ వేలంలో అప్పటి నాని అనుచరులే దుకాణాలు దక్కించుకున్నట్టు సమాచారం.

మున్సిపాల్టీ, సీఆర్‌డీఏ నుంచి అనుమతులు చేపట్టిన నిర్మాణానికి మున్సిపల్ ఇంజినీర్లు పర్యవేక్షిస్తుంటారు. అయితే ఇది అక్రమ నిర్మాణమని తెలిసినా మున్సిపల్ ఇంజినీర్లు దగ్గరుండి నిర్మాణం చేపట్టడంపై పట్టణవాసులు ఆశ్చర్యచకితులయ్యారు. అప్పటి మంత్రి కొడాలి నాని ఒత్తిడి, కమిటీ సిఫారసుతో ఈ అక్రమ నిర్మాణాన్ని హుటాహుటిన పూర్తి చేశారు. కమిటీలో జిల్లా కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ కీలక సభ్యులుగా ఉండి కూడా ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించడంపై పట్టణవాసులు ఆక్షేపణ తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ లేకుండానే..

నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించలేదు. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీ స్థలాన్ని సైతం మూసివేసినట్టు సమాచారం. ప్రధాన స్టేడియం వైపున్న డ్రైనేజీని కూడా మూసి వేసి మెట్లు కట్టారు.

పరిశీలిస్తాం: మున్సిపల్ కమిషనర్

దీనిపై మున్సిపల్ కమిషనర్ బోనం శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతుల వ్యవహారంలో పరిశీలన చేస్తామని అన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి మాట్లాడుతూ ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని, తాము ఎవరికీ ఎన్‌వోసీ జారీ చేయలేదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఐజీ రవి కృష్ణ, వేదికపై పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే భవిష్యత్

● ఐజీ రవి కృష్ణ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని నాశనం చేసే చెడు అలవాట్లలో మాదకద్రవ్యాలు ఒకటని, అలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఈగల్ వింగ్, ఏపీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఏ రవికృష్ణ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో సోమవారం 'సే నో టు డ్రగ్స్' పేరుతో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 1985 నాటి మాదకద్రవ్యాల చట్టం కఠినంగా అమలవుతోందని. ఏ కారణం చేతయినా మాదకద్రవ్యాల కేసుల్లో విద్యార్థులు పట్టుపడితే కనీసం 20ఏళ్ల కఠిన జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. సరఫరా దారుల గురించి సమాచారం తెలిస్తే 1972 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు అధికారి కే నగేష్ బాబు మాట్లాడుతూ చెడు అలవాట్లకు లోనయితే జీవితం ఉండదన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ మనిషి జీవితంలో ఎదగాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బలహీనతలను జయించే మానసిక స్థైర్యం యువత సాధించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ఈగల్ టీం పనిచేస్తోందన్నారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు ఐజీ రవికృష్ణ, పోలీసు అధికారి నగేష్‌బాబు సమాధానాలు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ శ్రీలత, సీహెచ్ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రైల్వేట్రాక్స్‌కు

నూరుశాతం విద్యుదీకరణ

● డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లలో రైల్వేట్రాక్‌లన్నీ నూరు శాతం విద్యుదీకరణ అవుతాయని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. రైల్వే ట్రాక్‌కు విద్యుదీకరణ జరిగి వందేళ్లయిన సందర్భంగా సోమవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన వాకథాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇదొక చారిత్రక క్షణమన్నారు. ప్రస్తుతం 64,421 కిలోమీటర్ల మేరకు 96.99 శాతం ట్రాక్ విద్యుదీకరణ జరిగిందని, రాబోయే రెండేళ్లలో పూర్తిగా ట్రాక్ విద్యుదీకరణ జరుగుతుందన్నారు. స్వాతంత్రానికి ముందు కేవలం 387 కిలో మీటర్లే విద్యుదీకరణ జరిగిందన్నారు.విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో 99.6 శాతం విద్యుదీకరణ జరిగిందన్నారు. కోటిపల్లి - కాకినాడ సింగిల్ లైన్‌లో అక్కడక్కడ పెండింగు ఉన్నాయన్నారు. 1,009.997 రూట్ కిలోమీటర్లు, 2,875.74 ట్రాక్ కిలో మీటర్ల మేర విద్యుదీకరణ పూర్తయిందన్నారు. దీనికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విక్టోరియా టెర్మినస్ మొట్టమొదటి సారి విద్యుదీకరణ జరిగిందని, అదిప్పుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌గా మారిందన్నారు. టెర్మినస్-కుర్లా మధ్య జరిగిన కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, ప్రయాణికులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను స్కూల్ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.


రైల్వే ఉద్యోగుల వాకథాన్

కళాశాల నిర్లక్ష్యమే

హర్షిణి ప్రియ మృతికి కారణం

● సమగ్ర విచారణ చేయాలంటూ ఎస్ఎఫ్ఐ డిమాండ్

● కళాశాల నిర్లక్ష్యం లేదు: ప్రిన్సిపాల్



లబ్బీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అక్కల హర్షిని ప్రియ సోమవారం ఫిట్స్‌తో చనిపోవడంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ విజయవాడ ఈస్ట్ కార్యదర్శి కుమారస్వామి డిమాండ్ చేశారు. ఉదయం 9గంటల సమయంలో విద్యార్థిని క్లాస్‌రూమ్‌లో ఫిట్స్‌తో పడిపోగా వెంటనే కళాశాల అధ్యాపకులు విద్యార్థిని తల్లికి ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఆమె అక్కడికి చేరుకుని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారన్నారు. కళాశాల యాజయాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందిందని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ కళాశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందితే తమ నిర్లక్ష్యం అనడం సమంజసం కాదని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినికి ఫిట్స్ వచ్చిన వెంటనే ఆమె తల్లికి ఫోన్ చేయగా ఆమె చెప్పినట్లు తాళాలు చేతిలో పెట్టామని వెంటనే అంబులెన్స్ పిలిపించగా అందులో విద్యార్థిని తల్లి, బంధువులు, కళాశాల నుంచి కూడా హాస్పిటల్‌కు వెళ్లారని అక్కడికి వెళ్లిన తరువాత వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. పెదపులిపాకలోని విద్యార్థిని అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న మృతదేహాన్ని పరామర్శించి తల్లికి ధైర్యం చెప్పామన్నారు. ఆ సమయంలో పాప తండ్రి కూడా చిన్న వయసులోనే ఫిట్స్‌తో మృతి చెందినట్టు తమకు చెప్పారన్నారు. ఈ విద్యార్థినికి కూడా మూడేళ్ల నుంచే ఈ సమస్య ఉందని తెలిపారన్నారు. ఈ విషయంలో తమ కళాశాల నిర్లక్ష్యం ఎక్కడా లేదన్నారు. విద్యార్థిని మృతితో కళాశాలకు మంగళవారం సెలవు ప్రకటించామన్నారు.

ప్రైవేట్ భూముల్లో కెమికల్ వ్యర్థాల డంపింగ్

● వంద ఎకరాల్లో భూములపై ప్రభావం.. రంగుమారిన వైనం

● ల్విక్విడ్ ట్యాంకర్‌ను డ్రైవర్ సహా పట్టుకున్న భూ యజమానులు



ట్యాంకర్‌ను అడ్డగించిన రైతులు, ప్లాట్ల యజమానులు, నలుపు రంగులోకి మారిన భూమి

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం జక్కంపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో గుట్టు చప్పుడు కాకుండా కెమికల్ ఫ్యాక్టరీ వ్యర్థ రసాయినాల డంపింగ్ వ్యవహారం సోమవారం స్థానికంగా కలకలం రేపింది. ఏడాదిగా జరుగుతున్న ఈ డంపింగ్‌తో సుమారు వంద ఎకరాలకు పైగా భూములు దుష్ప్రభావానికి గురయ్యాయి. ఆలస్యంగా గుర్తించిన ప్లాట్ల యజమానులు డంపింగ్ చేస్తున్న ట్యాంకర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

జక్కంపూడి పంచాయతీ పరిధిలో దశాబ్దాల క్రితం రైతులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో 60-40 వెంచర్‌ను ఏర్పాటు చేశారు. 135 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన వెంచర్‌లో 711 ప్లాట్లున్నాయి. కొన్ని అమ్ముడవగా చాలా వరకు రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. కొంతకాలంగా వెంచర్ నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండటం రైతులు, ప్లాట్ల యజమానులు గుర్తించారు. మొదట్లో పెద్దగా పట్టించుకోకపోయినా, ఇటీవల దుర్వాసన విపరీతంగా వస్తుండటం, భూములు రంగు మారుతుండటం గమనించారు. నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి కొంతమంది కలిసి వెంచర్‌లో గస్తీ నిర్వహించారు. అనుకున్నట్టుగానే సోమవారం తెల్లవారుజామున కెమికల్ వ్యర్థాలతో నిండిన ఓ ట్యాంకర్ వెంచర్‌లోకి వెళ్తుండటం గమనించి మెల్లగా మోటారు సైకిళ్లతో వెంబడించారు. ట్యాంకర్‌తో పాటు ఓ వ్యక్తి కూడా ద్విచక్రవాహనంపై అక్కడికి చేరుకున్నాడు. వారిద్దరూ కలిసి కెమికల్ వ్యర్థ రసాయినాలను వెంచర్‌లోని ప్లాట్లలోకి వదిలేందుకు సిద్ధమయ్యారు. దీంతో గస్తీ కాస్తున్న యువకులు డ్రైవర్‌ను పట్టుకోగా ద్విచక్రవాహనంపై వచ్చిన మరో వ్యక్తి పరారయ్యాడు. దీంతో ప్లాట్ల యజమానులు, రైతులు అక్కడే ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు అక్కడికి చేరుకుని ట్యాంకర్‌తో పాటుగా బీహార్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

తెలంగాణ నుంచే కెమికల్ ట్యాంకర్

వెంచర్‌లో కెమికల్ వ్యర్థాలను డంప్ చేస్తున్నది తెలంగాణకు చెందిన ఓ కెమికల్ ఫ్యాక్టరీగా తెలుస్తోంది. సూర్యాపేటలోని ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యర్థాలను డంప్ చేసి వెళ్తున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న డ్రైవర్ బీహారీ కావడం అతడికి తెలుగు రాకపోవడంతో సమాచారంలో జాప్యం జరుగుతోంది. వ్యర్థాల డంపింగ్‌కు బీహారీని పంపిన వ్యక్తుల ఫోన్ నెంబర్లను కాంటాక్ట్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులు మరోకోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంద ఎకరాలపై దుష్ప్రభావం

ఏడాది కాలంగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న కెమికల్ వ్యర్థాల డంపింగ్ కారణంగా వెంచర్‌లోని సుమారు 100 ఎకరాలపై దుష్ప్రభావం పడింది. ఆయా స్థలాలన్ని కెమికల్ వ్యర్థాలతో నిండి తీవ్ర దుర్వాసన రావడమే కాకుండా భూముల రంగు మారిపోయింది. కొంతభాగం నల్లగాను, మరికొంత భాగం తెలుపు, గోధుమ రంగులతో మారిపోయి అటువైపు వెళ్లలేని విధంగా తయారయ్యాయి. సమీప బోర్ల నుంచి కూడా కలుషిత నీరు వస్తున్నట్టు అక్కడి వారు చెబుతున్నారు. డంపింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్లాట్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: డీఆర్‌వో


డీఐఈవోతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో లక్ష్మీ నరసింహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలను (ఐపీఈ-2025) విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయ శాఖల అధికారులు బృంద స్ఫూర్తితో వ్యవహరించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఎం.లక్ష్మీ నరసింహం కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌వో లక్ష్మీ నరసింహం, జిల్లా ఇంటర్ వి ద్యాధికారి (డీఐఈవో) సీఎస్ఎస్ఎన్ రెడ్డి తో కలిసి పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఇంటర్ వొకేషనల్, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 5 నుంచి 20 వరకు 127 కేంద్రాల్లో జరుగుతాయని, అలాగే థియరీ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 41,295 మంది ఫస్టియర్ విద్యార్థులు, 39,564 మంది సెకెండియర్ విద్యార్థులు మొత్తం 80,859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు వివరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్ అధికారులను నియమించడం జరిగిందని, 27 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘాలో పోలీసు శాఖతో సమన్వయం అవసరమన్నారు. 20 కేంద్రాలకు ఒకటి చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుకు అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఆర్‌టీసీ ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఆర్‌వో సూచించారు. స్పెషల్ ఆఫీసర్ ఎస్.సరళకుమారి, డీఈసీ సభ్యులు జి.ఝాన్సీ, డీఈవో యూవీ సుబ్బారావు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారి కె.సురేష్ కుమార్, పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఎం.నరసింహాస్వామి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు షేక్ అహ్మద్ ఆలీ, విద్యుత్ శాఖ ఈఈ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాపై ఫిర్యాదు

వన్‌టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందాపై కొత్తపేట పోలీసు స్టేషన్‌లో కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి సోమవారం ఫిర్యాదు చేశారు. ఒక నెట్ సెంటర్‌లో డిగ్రీ సర్టిఫికెట్‌కు రూ.60వేల నుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నట్టు, ఆయా వ్యక్తులు ఆశపడి తీసుకున్న సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో గగ్గోలు పెడుతున్నారని ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనంపై కాలేజీ యాజమాన్యం స్పందించింది. బజారులో చెలామణీ అవుతున్న నకిలీ సర్టిఫికెట్లు తామిచ్చినవి కావని, సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిర్మాత కేపీ చౌదరి ఆత్మహత్య

- ఇంజనీర్ నుంచి నిర్మాతగా మారిన కేపీ..
- డ్రగ్స్‌కు బానిసై.. అరెస్టు.. జైలు
- బెయిల్‌పై బయటకొచ్చి గోవాకు
- అక్కడ అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య



హైదరాబాద్ సిటీ, బోనకల్ 3 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ నిర్మాత బోడేపూడి కృష్ణప్రసాద్ అలియాస్ కేపీ చౌదరి(44) సోమవారం గోవాలో ఉరివేసుకుని, ఆత్మహత్యకు పాల్పడ్డారు. కబాలితోపాటు.. తమిళంలో రీమేక్ చేసిన సర్దార్ గబ్బర్‌సింగ్, అర్జున్ సురవరం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు వంటి సినిమాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఓ డ్రగ్ కేసులో జైలుకు వెళ్లిన కేపీ చౌదరి.. బెయిల్‌పై బయటకు వచ్చాక, గోవాకు వెళ్లారు. అక్కడి సియోలిమ్ గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. సోమవారం ఆయన ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకున్నట్లు గోవా ఎస్పీ అక్షత్ కౌశల్ మీడియాకు తెలిపారు. "చౌదరికి గతంలో డ్రగ్స్ ముఠాలతో లింకులున్నట్లు సమాచారం ఉంది. గోవాలో ఆయన కాంటాక్ట్‌లో చాలా మంది ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్నాం" అని ఆయన వివరించారు. కాగా.. 2023లో సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు కేపీ చౌదరిని ఓ డ్రగ్స్ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.! అప్పట్లో సంచలనం సృష్టించిన ఈ కేసులో చౌదరి అరెస్టయ్యారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన కేపీ చౌదరి.. గోవాలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. కేపీ చౌదరి స్వస్థలం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రాయనపేట. ఆయన తండ్రి బోడేపుడి శేషగిరిరావు లాయర్‌గా.. తల్లి విజయ పాల్వంచలో ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. కేపీ చౌదరి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేసి, పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో డైరెక్టర్(ఆపరేషన్స్)గా పనిచేశారు. 2016లో ఆ ఉద్యోగాన్ని వీడి.. సినీపరిశ్రమ వైపు అడుగులు వేశారు. పలు సినిమాలకు నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు. సినీ రంగంలో ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో గోవాకు మారిపోయారు. అక్కడ ఓహెచ్‌ఎం క్లబ్‌ను ఏర్పాటు చేసి.. హైదరాబాద్ నుంచి వచ్చే సెలబ్రిటీల కోసం పార్టీలు నిర్వహించేవారు. క్లబ్ వ్యాపారంలోనూ నష్టాలు రావడంతో.. 2023లో హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. అప్పట్లోనే 100 షీట్ల కొకైన్‌ను వెంట తెచ్చుకున్నారు. ఈ క్రమంలో 2023 జూన్ 14న పోలీసులకు పట్టుబడ్డారు. బెయిల్‌పై జైలు నుంచి విడుదలయ్యాక.. మళ్లీ గోవాకు వెళ్లిపోయారు. కేపీ చౌదరి ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని పోలీసులు భావిస్తున్నారు. డ్రగ్స్ కేసులో కేపీ చౌదరి అరెస్టయ్యాక.. ఆయన కాల్‌లిస్ట్‌లో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారులతోపాటు.. 800 మంది ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 300 మందికి పైగా తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. రాజకీయ నాయకుల్లో అప్పటి అధికార పార్టీకి చెందిన ప్రముఖులు ఎక్కువగా ఉన్నట్లు పోలీసుల దృష్టికి రావడంతో.. దర్యాప్తు అధికారులు ఓ దశలో తలలు పట్టుకున్నట్లు తెలిసింది. దాంతో.. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు ఎవరికి వారు.. "మాకు డ్రగ్స్ కేసుతో సంబంధం లేదు" అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం గమనార్హం!

నేడు ఖమ్మం జిల్లాకు భౌతికకాయం

కేపీ చౌదరి తండ్రి మూడేళ్ల క్రితం చనిపోగా.. తల్లి రాయనపేటలో ఉంటున్నారు. కేపీ చౌదరికి భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని తీసుకురావడానికి మేనమామలు గోవా వెళ్లినట్లు తెలిసింది. మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని సమాచారం.

అన్నా వెనక్కొచ్చేయ్: సుప్రీత

కేపీ చౌదరి మరణంపై టాలీవుడ్ నటి సురేఖ వాణి కూతురు సుప్రీత భావోద్వేగానికి లోనయ్యారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయనతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. "సమాజం ఇక్కడే విఫలమైంది. నిన్ను ఎప్పటికీ మిస్ అవుతాం అన్నా. నా బాధలు ఎవరికి చెప్పుకోవాలి? నీ బాధలు నేను వినడానికి లేకుండా చేశావు. వెనక్కొచ్చేయ్ అన్నా.. నీ కోసం ఈ చెల్లి ఎదురుచూస్తోంది. నీ కోసం ఎప్పటికీ నేనుంటాను. నువ్వు ఎక్కడ ఉన్నా టైగరే అంటావుగా. లవ్ యూ సో మచ్ అన్నా. నీ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు.

మోహన్‌బాబు, మనోజ్ మధ్య వాగ్వాదం?

కుటుంబ ఆస్తి వివాదంపై కలెక్టరేట్‌లో విచారణ

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఎదుటే పరస్పరం దూషణ?
- పోలీసులను పిలిపించిన అధికారిణి.. విచారణ వాయిదా




రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ ఆస్తులకు సంబంధించి మోహన్‌బాబు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ సందర్భంగా ఆయనకు, కుమారుడు మనోజ్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం జరిగినట్లు సమాచారం. తాను సంపాదించిన ఇళ్లు, ఆస్తులను కుమారుడు మనోజ్ ఆక్రమించారని కొద్దిరోజుల క్రితం మోహన్‌బాబు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తన స్వార్జిత ఆస్తిపై ఎవరికీ హక్కులేదని, తన ఆస్తులను మనోజ్ నుంచి తనకు అప్పగించాలని ఫిర్యాదులో కోరారు. ఈ మేరకు ఇప్పటికే మనోజ్‌ను ప్రతిమా సింగ్ విచారించారు. అయితే విచారణ కోసం ఇద్దరినీ పిలవడంతో మోహన్‌బాబు, మనోజ్‌ను సోమవారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఎదుట హాజరయ్యారు. ఆస్తులకు సంబంధించి వివరాలను ఆమెకు తండ్రీకొడుకులు అందజేశారు. దాదాపు రెండు గంటలపాటు ప్రతిమా సింగ్ వారిని విచారించారు. అయితే విచారణ సమయంలో మోహన్‌బాబు, మనోజ్ మధ్య వాగ్వాదం జరిగిందని, పరస్పరం దూషించుకున్నారని సమాచారం. అదనపు కలెక్టర్ సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోకపోవడంతో ఆమె పోలీసులను పిలిపించారు. ఇళ్లు, ఇతర ఆస్తులన్నీ తన స్వార్జితమని, వాటి నుంచి ఖాళీ చేయించాలని మోహన్‌బాబు పట్టుపట్టారు. నాన్నకు ఇళ్లే కాకుండా చాలా ఆస్తులు ఉన్నాయని, వారసత్వంగా తనకు ఆస్తిలో వాటా ఉంటుందని, విద్యాసంస్థలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించడంతోనే తనపై ఆయన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మనోజ్ ఆరోపించారు. పలు ఆస్తులకు సంబంధించి దస్తావేజులను విచారణ అధికారి ఎదుట మనోజ్ ఉంచారు. వచ్చేవారం మరోసారి విచారణకు హాజరు కావాలని ప్రతిమా సింగ్ ఆదేశించించారు. విచారణ ముగిసిన తర్వాత మంచు మనోజ్ ప్రధాన గేటు నుంచి, మోహన్‌బాబు వెనుక గేట్ నుంచి బయటకు వెళ్లారు.

'రాజ్‌తరుణ్- లావణ్య' కేసులో ట్విస్ట్!

మహిళలకు డ్రగ్స్ అలవాటు చేసి నగ్న వీడియోలు తీసిన మస్తాన్

- వందల మంది అమ్మాయిల వీడియోలు తీసి, బ్లాక్‌మెయిల్ చేశాడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన లావణ్య
- సంబంధిత హార్డ్‌డిస్క్ అందజేత
- లావణ్య ఇంటికెళ్లి దాడి చేసిన మస్తాన్
- 100కు ఫోన్ చేయడంతో అరెస్టు
- అతనిపై ఏపీ, తెలంగాణలో 4 కేసులు

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రాజ్‌తరుణ్- లావణ్య కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఆ కేసులో కీలకంగా మారిన రవి బవాజీ మస్తాన్ సాయి అలియాస్ మస్తాన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తనతో సహజీవనం చేసి, పెళ్లి చేసుకొని, ముఖం చాటేశాడంటూ గత ఏడాది జూలై 4న రాజ్‌తరుణ్‌పై లావణ్య నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఇదే కేసులో తమకు పరిచయస్థుడైన మస్తాన్ సాయి.. చాలా మంది మహిళల ప్రైవేట్ వీడియోలు తీశాడని లావణ్య ఆరోపించింది. అలాగే తన వీడియోలు కూడా తీసి రాజ్‌తరుణ్‌కు చూపించి, అతని నుంచి తనను దూరం చేశాడని తెలిపింది. మస్తాన్ తనపై అత్యాచారం చేసేందుకూ ప్రయత్నించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. డ్రగ్స్ సరఫరాదారుడిగా మారిన మస్తాన్.. ఎంతోమంది మహిళలకు మాదకద్రవ్యాలు అలవాటు చేశాడని తెలిపింది. వారు మత్తులో ఉన్నప్పుడు నగ్న వీడియోలు చిత్రీకరించినట్లు తాను గుర్తించానని ఫిర్యాదులో వివరించింది. అందుకు సంబంధించిన హార్డ్‌డిస్క్ తన చేతికి చిక్కిందని లావణ్య ఫిర్యాదు చేసినట్లు నార్సింగ్ పోలీసులు వెల్లడించారు. తన వీడియోలను డిలీట్ చేయాలని చూడగా.. అందులో వందలాది మహిళల నగ్న వీడియోలు ఉన్నాయని, వాటిని అడ్డం పెట్టుకొని మస్తాన్.. వారి జీవితాలతో చెలగాటమాడుతున్నాడని లావణ్య తెలిపింది. బాధిత మహిళల్లో పెళ్లయినవారు, పెళ్లికాని అమ్మాయిలు ఉన్నారని.. ఎక్కడ తమ జీవితాలు ఇబ్బందుల్లో పడతాయోనని వారు బయటకు రావట్లేదని ఫిర్యాదులో పేర్కొంది.



కోర్టు వద్ద మస్తాన్ సాయి

నాలాగా మరికొందరి జీవితాలు బలి కారాదు: లావణ్య

ఈ హార్డ్‌డిస్క్‌ను పోలీసులకు ఇచ్చినా సరే నాకు ప్రాణహాని తప్పదు. కానీ, నాలాగా ఇతర మహిళల జీవితాలు ఇలాంటి వెధవలు తీసే వీడియోల వల్ల బలికాకూడదు. నాకు న్యాయం జరిగినా, జరగకపోయినా కనీసం ఈ ఫిర్యాదు చూసైనా మహిళలు జాగ్రత్త పడతారు. పోలీసుల పట్ల పూర్తి విశ్వాసంతో అన్ని ఆధారాలున్న హార్డ్ డిస్క్‌ను అందిస్తున్నా. అదేవిధంగా మస్తాన్ దగ్గరున్న మరో రెండు హార్డ్ డిస్క్‌లను, అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసులు తీసుకొని, మహిళల డేటాను డిలీట్ చేయాలని కోరుతున్నా.

ఇంటికి వచ్చి దాడి చేయడంతో..

నగ్న వీడియోల హార్డ్ డిస్క్ తన దగ్గర ఉదని తెలుసుకున్న మస్తాన్.. పలుమార్లు ఇంటికి వచ్చి చంపేస్తానని బెదిరించాడని లావణ్య ఆరోపించింది. జనవరి 31న మరోసారి ఇంటికొచ్చి టీవీ, సీసీటీవీలు, ఇతర వస్తువులను ధ్వంసం చేసినట్లు తెలిపింది. సోమవారం మరో స్నేహితుడితో కలిసి వచ్చి తనపై దాడి చేయడానికి ప్రయత్నించడంతో డయల్-100కు ఫోన్ చేసింది. దీంతో కోకాపేటలోని లావణ్య ఇంటికి చేరుకున్న పోలీసులు అక్కడ డ్రగ్స్ మత్తులో ఉన్న మస్తాన్‌తో పాటు అతని స్నేహితుడు షేక్ ఖాజా మొహియుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ల్యాప్‌టాప్, ఫోన్, హార్డ్‌డిస్క్ స్వాధీనం చేసుకున్నారు. నగ్న వీడియోలు తీసి, తనతో పాటు వందలాది మంది మహిళల జీవితాలతో ఆడుకుంటున్న మస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని లావణ్య చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు అతనిపై బీఎన్ఎస్ సెక్షన్ 329(4), 324(4), 109, 77, 78ల కింద కేసు నమోదు చేశారు. మస్తాన్‌ను అరెస్టు చేశారు. మరో నిందితుడు ఖాజాకు నోటీసులు జారీ చేశారు.

మస్తాన్ హార్డ్ డిస్క్‌లో నిఖిల్ వీడియోలు..

మస్తాన్ వద్ద ఉన్న మరో హార్డ్ డిస్క్‌లో వందలాది మహిళల నగ్న వీడియోలతో పాటు సినీ నటుడు నిఖిల్, గతంలో డ్రగ్స్ కేసులో అరెస్టయిన ఒక ప్రముఖ టిఫిన్ సెంటర్ యజమాని ప్రభాకర్ రెడ్డి ఫోన్లను హ్యాక్‌చేసి వారి ప్రైవేట్ వీడియోలను సైతం స్టోర్ చేసినట్లు సమాచారం.

మస్తాన్‌పై పలు క్రిమినల్ కేసులు..

మస్తాన్‌పై ఇప్పటికే నాలుగు క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో గుంటూరు జిల్లాలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో, సైబరాబాద్ పరిధిలోని మోకిల స్టేషన్‌లో, నార్సింగ్ స్టేషన్‌లో; విజయవాడ వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదయ్యాయి.

తెలంగాణలో మే 2న ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష

- ఏప్రిల్ 29, 30న అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రన్స్‌లు
- జూన్ 8, 9న ఐసెట్, 16-19 మధ్య పీజీ ఈసెట్
- షెడ్యూల్ ప్రకటించిన ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఎప్‌సెట్ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి జరగనున్నాయి. ఏప్రిల్ 29, 30న అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు.. మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు ఉంటాయని తెలంగాణ ఉన్నత విద్యామండలి తెలిపింది. ఎప్‌సెట్, ఐసెట్, పీజీఈసెట్ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, వైస్‌చైర్మన్లు పురుషోత్తం, ఎస్‌కే.మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కుమార్ సోమవారం విడుదల చేశారు. ఎప్‌సెట్ పరీక్షల నోటిఫికేషన్ ఈనెల 20న విడుదల చేస్తామని, 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అలాగే పీజీ ఈసెట్ ప్రవేశ పరీక్ష జూన్ 16-19 మధ్య జరగనుంది. దీనికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ మార్చి 17 నుంచి మే 19 వరకు ఉంటుందని పీజీఈసెట్ కన్వీనర్ అరుణకుమారి తెలిపారు. ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మార్చి 10న ప్రారంభమై మే 3తో ముగియనుంది. జూన్ 8, 9 తేదీల్లో ఈ పరీక్ష జరుగుతుందని ఐసెట్ కన్వీనర్ ఆచార్య అలువాల రవి తెలిపారు. ఈసారి అన్ని సెట్‌లకు సంబంధించిన 'కీ' విషయంలో కొత్త మార్పు చోటుచేసుకుంది. కీపై అభ్యర్థులు అభ్యంతరాలను తెలపడం ఇప్పటి వరకు ఉచితంగా ఉండగా.. ఇక నుంచి ప్రశ్నకు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఉన్నత విద్యామండలి ఈ నిర్ణయం తీసుకుంది. ఉచితం కావడంతో అభ్యంతరాలు వందల సంఖ్యలో వస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు. సరైన అభ్యంతరం వ్యక్తం చేసిన వారికి రుసుము తిరిగి చెల్లిస్తామని చెప్పారు.

చిత్రజ్యోతి

SINCE 1965

కె ర్యాంప్ షూటింగ్ షురూ



హీరో కిరణ్ అబ్బవరం నటించిన 'క' చిత్రం ఆయన కెరీర్‌లోనే హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. కిరణ్ నటించే కొత్త చిత్రం 'కె.ర్యాంప్' షూటింగ్ సోమవారం ఉదయం రామానాయుడు స్టూడియోలో మొదలైంది. 'సామజవరగమన2, 'ఊరు పేరు భైరవకోన' వంటి చిత్రాల తర్వాత హాస్య మూవీస్ సంస్థ అధినేత రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. జైన్స్ నాని ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పూజా కార్యక్రమం అనంతరం నిర్మాత అనిల్ సుంకర కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మరో నిర్మాత దిల్ రాజు క్లాప్ ఇవ్వగా ముహూర్తపు షాట్ చిత్రీకరించారు. దర్శకుడు యోగి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకులు విజయ్ కనకమేడల, రామ్ అబ్బరాజు, యదు వంశీ, , రచయిత ప్రసన్నకుమార్ స్క్రిప్ట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటి, సీనియర్ నటుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు. కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజా నటిస్తున్నారు. 'కె.ర్యాంప్' చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, ఫొటోగ్రఫీ: సతీశ్ రెడ్డి మాసం, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్, సహ నిర్మాతలు: బాలాజీ గుట్ట, ప్రభాకర్ బురుగు.

ప్రళయకాల రుద్రుడు



'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ సినిమా నుంచి ప్రభాస్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన రుద్ర పాత్రలో నటిస్తున్నారు. "ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు.. శివాజ్ఞ పరిపాలకుడు" అని పోస్టర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో తన లుక్‌ను షేర్ చేశారు. "శక్తికి.. వివేకానికి ప్రతీక అయిన రుద్ర పాత్రను పోషిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ప్రేమ, భక్తి, త్యాగంతో నిండిన ఈ సాహసోపేత ప్రయాణాన్ని థియేటర్లో చూసేందుకు సిద్ధంగా ఉండండి" అని తెలిపారు. మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో డా.మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 25న సినిమా విడుదల కానుంది.

మానవ సంబంధాలను విశ్లేషించే కాంత



రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'కాంత' చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 1950ల నాటి మద్రాసు నేపథ్యంలో మానవ సంబంధాలు, సామాజిక, సంక్లిష్టతలను విశ్లేషిస్తూ రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే కథనాయిక. సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. నటుడిగా దుల్కర్ 13 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 'కాంత' చిత్రంలోని ఆయన లుక్‌ని విడుదల చేశారు. 'దుల్కర్ కెరీర్‌లాగానే ఈ సినిమా కూడా గొప్ప ప్రయాణాన్ని ప్రతిబింబిస్తుంది' అని చిత్ర దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ చెప్పారు.

పార్వతీ నాయర్ నిశ్చితార్థం



చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఆశ్రిత్ అశోక్‌తో నటి పార్వతీ నాయర్ నిశ్చితార్థం ఇటీవలె జరిగింది. దానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇరు కుటుంబాల పెద్దలు త్వరలోనే పెళ్లి తేదీని నిర్ణయించనున్నారు. పార్వతీ నాయర్ కేరళలో జన్మించారు. అబుదాబిలో పెరిగారు. ఆమె తండ్రి వ్యాపారవేత్తగా దుబాయ్‌లో స్థిరపడ్డారు. అబుదాబిలో పాఠశాల విద్యను పూర్తిచేసిన పార్వతి నాయర్, 15 ఏళ్లకే మోడలింగ్‌లోకి అడుగుపెట్టారు. ఇంజనీరింగ్ చదువుతూనే మోడలింగ్ కొనసాగించారు. కర్ణాటక 'మైసూర్ శాండల్ సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవరించారు. మిస్ కర్ణాటక, ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో బహుమతులు గెల్చుకున్నారు. 2012లో 'పాపిన్స్' అనే మలయాళ చిత్రంతో తెరంగేట్రం చేశారు. పలు కన్నడ, తమిళ చిత్రాల్లో నటించారు. చివరగా విజయ్ నటించిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' చిత్రంలో కీలక పాత్రను పోషించారు.

తండేల్ .. పెద్ద హిట్ అవుతుంది

బన్నీ వాసు



'మత్స్యలేశ్యం అనే ఊరుని బేస్ చేసుకుని తయారు చేసిన కథ ఇది. అక్కడి వారు గుజరాత్ పోర్ట్‌కి ఫిషింగ్‌కు వెళతారు. అక్కడ బోటు ఉన్న వారికి బిరుదులు ఉంటాయి. మొయిన్ లీడర్‌ని తండేల్ అంటారు. అది గుజరాతీ పదం. ఇది ప్యూర్ లవ్ స్టోరీ. అలాగే గూస్ బంప్స్ మూమెంట్స్ చాలా ఉంటాయి. సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుంది' అని చెప్పారు నిర్మాత బన్నీ వాసు. నాగచైతన్య, సాయి పల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందిన 'తండేల్' చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బన్నీ వాసు మీడియాతో ముచ్చటిస్తూ చెప్పిన విషయాలవి.

- రచయిత కార్తీక్‌ది మత్స్యలేశ్యం పక్క ఊరు. అక్కడి సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది ఈ చిత్రకథ తయారు చేశారు. నాకు బాగా నచ్చింది. కథను డెవలప్ చేస్తూ చాలా రీసెర్చ్ చేశాం. కొంతమందిని కలిసినప్పుడు వారు చెప్పిన కొన్ని విషయాలు గూస్ బంప్స్ తీసుకొచ్చాయి. ఆ విషయాలన్నీ చెప్పడానికి రాజు, సత్య అనే ఫిక్షనల్ క్యారెక్టర్స్‌ను దర్శకుడు చందు డిజైన్ చేశారు.
- రాజు, సత్యల ప్రేమకథ ఇది. ఆ లవ్‌స్టోరీ ద్వారా ఒరిజినల్‌గా జరిగిన కథను చూపించాం. ఇందులో యాభై శాతం ఫిక్షన్ ఉంటుంది. నాగచైతన్యకు ఈ చిత్రకథ బాగా నచ్చింది. ఇందులో చేపలు పట్టే వాడి పాత్రలో పరకాయ ప్రవేశం చేయడానికి ఆయన తీసుకున్న శ్రద్ధ అద్భుతం. యాస మీద కూడా వర్కవుట్ చేశారు. అలాగే సాయిపల్లవి కూడా చైతుకి మ్యాచ్ అయ్యేలా నటించారు. శివుడి పాటలో వాళ్లిద్దరు చేసిన నృత్యం థియేటర్స్‌లో పూనకాలు తెప్పిస్తుంది.
- సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలవుతోంది. అరవింద్‌గారు సినిమాను చూడడంతో చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. మాకు ఇంత లైఫ్ ఇచ్చిన ఆయన అంత ఎంజాయ్ చేస్తుంటే చూడముచ్చటగా ఉంది.

చివరి వరకూ ఉత్కంఠనిస్తుంది

- వినోద్‌కుమార్



సాయిరామ్ శంకర్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్‌కుమార్ విజయన్ దర్శకత్వంలో గార్లపాటి రమేశ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వినోద్ మీడియాతో ముచ్చటించారు. "ఇది ఒక స్క్రీన్‌ప్లే బేస్డ్ చిత్రం. చాలా నిజాయితీతో ఈ కథను తెరకెక్కించాం. ఇందులో వాణిజ్యాంశాలతో పాటు సందేశం కూడా ఉంటుంది. థియేటర్ల నుంచి బయటకు వెళ్లాక కూడా ప్రేక్షకులను వెంటాడే చిత్రమిది. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ఉత్కంఠనిస్తుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుంది. ఇందులో సాయిరామ్ శంకర్ విభిన్నంగా కనిపిస్తాడు. ఆయన పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. సముద్రఖని, శృతి సోధి, ఆషిమా నర్వాల్ పోషించిన పాత్రలు ఆకట్టుకుంటాయి. సంగీతం, విజువల్స్ ఈ చిత్రానికి ప్రధానాకర్షణగా నిలుస్తాయి. నిర్మాత ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించారు. ఒక్క క్షణం కూడా బోర్ కొట్టదు. ఈ ప్రయోగాత్మక చిత్రం ప్రేక్షకులకు విపరీతంగా నచ్చుతుంది. ఈ సీట్ ఎడ్జ్ సస్పెన్స్ థ్రిల్లర్ కచ్చితంగా విజయవంతమవుతుందనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

కొత్తగా..

యూత్‌కు నచ్చే చిత్రం



'కొత్తగా మా ప్రయాణం' ఫేమ్ ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా నటిస్తున్న చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వంలో అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అనిల్‌కుమార్ కాట్రగడ్డ మాట్లాడుతూ "ఇందులో హీరోగా నటించిన ఈశ్వర్ తన అద్భుతమైన నటనతో కథకు న్యాయం చేశాడు. పాటలు అందరినీ ఆకట్టుకుంటాయి" అని చెప్పారు. "ప్రభుత్వం అందించే ఉచిత పథకాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. వీటి వల్ల ప్రజలు ఎంతగా నష్టపోతున్నారో చూపించే చిత్రమిది" అని హీరో ఈశ్వర్ అన్నారు. "ఇది యూత్‌కు నచ్చే చిత్రం" అని హీరోయిన్ నైనా తెలిపారు.

ఆహ్లాదాన్ని పంచే 'సతీ లీలావతి'



లావణ్య త్రిపాఠి, మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్ బాబు.ఎమ్, రాజేశ్ నిర్మించనున్న చిత్రం 'సతీ లీలావతి' పూజా కార్యక్రమాలు సోమవారం జరిగాయి. నటుడు వరుణ్‌తేజ్, చిత్ర సమర్పకులు జెమినీ కిరణ్, నిర్మాతలు హరీశ్ పెద్ది, వి.ఆనంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత హరీశ్ పెద్ది క్లాప్ కొట్టారు. వరుణ్‌తేజ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ డైరెక్టర్ టి.ఎల్.వి.ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర దర్శకుడు తాతినేని సత్య మాట్లాడుతూ 'ఆహ్లాదాన్ని కలిగించే చక్కటి ఎంటర్‌టైనర్‌గా 'సతీ లీలావతి' రూపొందుతోంది. ఈ రోజు నుంచే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నాం' అని అన్నారు.

మహిషాసుర మర్ధిని నేపథ్యంతో



రాయ్ ఫిల్మ్స్ బేనర్‌పై శ్రీనివాస్ సుబ్రహ్మణ్య నిర్మాణంలో రాకీ షెర్మన్ తెరకెక్కించిన చిత్రం 'కర్మస్థలం'. అర్చన శాస్త్రి, విఠాలి చౌహాన్, వినోద్ అల్వా, కాలకేయ ప్రభాకర్, బలగం సంజయ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఫస్ట్‌లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో కనిపించిన పాత్రలు, డిజైన్ చేసిన తీరు ఆకట్టుకునేలా ఉంది. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ 'మహిషాసుర మర్ధిని నేపథ్యంతో ఈ మూవీని తెరకెక్కించారు' అని తెలిపారు. చిత్ర దర్శకుడు రాకీ షెర్మన్ మాట్లాడుతూ 'పాన్ ఇండియా రేంజ్‌లో ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు.

శివరాత్రికి విడుదల



కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా లోహిత్ హెచ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాక్షస'. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ని ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. శివరాత్రి సందర్భంగా ఈనెల 26న థియేటర్లలో విడుదలవుతోంది. తాజాగా ఈ మూవీ తెలుగు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో ప్రజ్వల్ దేవరాజ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. కూతురుపై ప్రేమతో హీరో చేసే చర్యలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ..'ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంది. అందరూ ఇష్టపడేలా సినిమా ఉంటుంది' అని అన్నారు.

తీవ్ర ఒత్తిడికి లోనయ్యా..

టాటా స్టీల్ చెస్ విజేత ప్రజ్ఞానంద



వి కాన్‌జీ: తన కెరీర్‌లోనే..ఆదివారంనాడు ఎంతో ఒత్తిడికి లోనయ్యానని టాటా స్టీల్ చెస్ చాంపియన్ ప్రజ్ఞానంద తెలిపాడు. ఉత్కంఠభరిత టైబ్రేకర్‌లో 2-1తో సహచర గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ గుకేష్‌ను కంగుతినిపించిన ప్రజ్ఞానంద ఈ టోర్నీ మాస్టర్స్ విభాగం విజేతగా నిలిచిన విషయం విదితమే. 13 రౌండ్ల ప్రతిష్ఠాత్మక టాటా చెస్ టోర్నీ ఆదివారం ఇక్కడ ముగిసింది. అయితే టైటిల్ రేస్‌లో నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద చివరి రౌండ్‌లో ఓడారు. విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో ఆఖరి రౌండ్‌లో ప్రజ్ఞానంద ఓటమి చవిచూశాడు. మరోవైపు తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి..గుకేష్‌కి షాకిచ్చాడు. దాంతో చెన్నై టీనేజర్లు గుకేష్, ప్రజ్ఞానంద చెరో 8.5 పాయింట్లతో సమవుజ్జీలుగా నిలిచారు. ఫలితంగా విజేతను నిర్ధారించేందుకు రెండు బ్లిట్జ్ గేమ్‌ల టైబ్రేకర్ నిర్వహించాల్సి వచ్చింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో 18 ఏళ్ల గుకేష్ గెలిచాడు. నువ్వా..నేనా అనేలా జరిగిన రెండో గేమ్‌లో 19 ఏళ్ల ప్రజ్ఞానంద నెగ్గడంతో స్కోరు సమమైంది. దాంతో సడెన్ డెత్ అనివార్యమైంది. ఇందులో నెగ్గిన ప్రజ్ఞానంద తొలిసారి 'టాటా' టైటిల్ అందుకున్నాడు. చాలెంజర్స్ విభాగం టైటిల్‌ను వాన్ ఎంగ్యూయెన్ (చెక్ రిపబ్లిక్) దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద మాట్లాడుతూ.. 'టైటిల్ సొంతం చేసుకోవాలన్న లక్ష్యంతోనే ఇక్కడికి వచ్చా. పోటీ చాలా తీవ్రంగా ఉన్నా ఫలితం రాబట్టా. అందువల్ల ఈ విజయాన్ని మాటల్లో వర్ణించలేను. విజేతగా నిలిచినందుకు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పాడు. 'ఆదివారంనాటి ఒత్తిడి నా కెరీర్‌లో ఎప్పుడూ ఎదురు కాలేదు. కొన్ని సంవత్సరాల కిందట సహచరుడు అర్జున్‌తో జరిగిన సడెన్ డెత్ పోరులో కూడా ఇంత ఒత్తిడికి లోనుకాలేదు' అని ప్రజ్ఞానంద తెలిపాడు. కాగా..వరుసగా రెండో ఏడాదీ గుకేష్‌కు టాటా టైటిల్ అందని ద్రాక్షే అయ్యింది. గతేడాది వీ యి (చైనా)తో జరిగిన టైబ్రేకర్‌లోనూ గుకేష్‌కు నిరాశే ఎదురైంది.

నా దగ్గర ఐదున్నాయ్: విషీ



టాటా స్టీల్ చెస్ టోర్నీ ట్రోఫీ అందుకున్న ప్రజ్ఞానందను దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ అభినందించాడు. ఆనంద్ తర్వాత ఈ టోర్నమెంట్ టైటిల్ గెలిచిన రెండో భారత ఆటగాడు ప్రజ్ఞానంద కావడం విశేషం. ప్రజ్ఞానందను అభినందిస్తూ..అతడు టాటా ట్రోఫీతో ఉన్న ఫొటోను పోస్ట్ చేసిన విషీ.. దానికి ఓ సరదా క్యాప్షన్ జత చేశాడు. 'నా వద్ద అలాంటివి ఐదున్నాయి' అని రాశాడు. టాటా చెస్ టోర్నీలో ఆనంద్ ఏకంగా ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచాడు. దాన్ని గుర్తు చేస్తూ ఆనంద్ అలా కామెంట్ చేశాడు.

నమ్మకాన్ని నిలబెట్టా!

గొంగడి త్రిషా రెడ్డి.. ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్ విజయంతో దేశం మొత్తం ఇప్పుడు ఈ తెలుగమ్మాయి పేరు మార్మోగుతోంది. ఆ మెగా టోర్నీలో ధనాధన్ బ్యాటింగ్‌తో పాటు జట్టుకు అవసరమైన సమయంలో కీలక వికెట్లు పడగొట్టి నమ్మదగ్గ ఆల్‌రౌండర్‌గా ముద్ర వేసుకుంది. ప్లాస్టిక్ బ్యాట్, టెన్నిస్ బాల్‌తో మొదలైన తన క్రికెట్ ప్రయాణం ఇప్పుడు జాతీయ జట్టులో కీలక సభ్యురాలి స్థాయికి ఎదిగింది. ఏడాది కిందటే మొదలైన మిషన్ వరల్డ్‌కప్‌ను విజయవంతంగా ఎలా అమలు చేశారు? ఇందులో త్రిష పాత్ర ఏమిటి? తదితర అంశాలపై ఆంధ్రజ్యోతితో త్రిష పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అండర్-19 వరల్డ్‌కప్ స్టార్ త్రిష



ఈ వరల్డ్‌కప్ మిషన్‌ను బీసీసీఐ నిరుడే ప్రారంభించింది. మెగా టోర్నీ ప్రాబబుల్స్‌ను కుదించాక మిగిలిన బృందంలోని ప్రతి ఒక్క క్రికెటర్‌తో సెలెక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ విడివిడిగా మాట్లాడి మా నుంచి జట్టు ఏం ఆశిస్తోందో వివరంగా చెప్పారు. కొన్ని లక్ష్యాలను నిర్దేశించారు. వాటిని అందుకోవడానికి అనుసరించాల్సిన ప్రణాళికలను ముందుంచారు. వారి మాటలు విన్నాక ఈ ఏడాది కాలం నా జీవితంలో ఎంత ముఖ్యమైనదో అర్థమైంది. ఆ లక్ష్యాలను చేరుకునేందుకు మానసికంగా, శారీరకంగా, ఆట పరంగా నన్ను నేను మలుచుకున్నా. ఈ ప్రయాణంలో నాకు ఏ పనీ కష్టంగా అనిపించలేదు. సుదీర్ఘ కాలం టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాలనేది నా ఆశయం. దీన్ని చేరుకోవాలంటే ఒక బలమైన పునాది వేసుకోవాలి. అందుకు ఈ వరల్డ్‌కప్‌ను సరైన వేదికగా భావించా. 2023 టీ20 ప్రపంచకప్ గెలిచిన జట్టులో నేను సభ్యురాలినే అయినా నాకు అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆడే అవకాశం రాలేదు. ఈసారి వరల్డ్‌కప్ మొదలయ్యే ముందు టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి నాకు ఈ విషయంలో ఒక స్పష్టమైన హామీ లభించింది. వారి నుంచి పూర్తి మద్దతు, స్వేచ్ఛ లభించడంతో నా పూర్తి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి అవకాశం చిక్కింది. అవకాశాలు రానప్పుడు పడిన బాధ, పుట్టిన కసితో ఈ వరల్డ్‌కప్‌లో నేనేంటో రుజువు చేసుకోగలిగా. టీమ్ మేనేజ్‌మెంట్, జట్టు నాపైన ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టినందుకు, నాకు అప్పగించిన బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తించినందుకు సంతోషంగా ఉంది.

టెన్నిస్ బాల్‌తో పవర్ హిట్టింగ్..

బాల్యంలో ప్లాస్టిక్ బ్యాట్, టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేదాన్ని. ఆ తర్వాత హిట్టింగ్‌ను అవపోసన పట్టడానికి నా వ్యక్తిగత కోచ్ సూచన మేరకు టెన్నిస్ బాల్‌తో ఎక్కువ సాధన చేశా. ఇది పవర్ హిట్టింగ్‌కు బాగా ఉపయోగపడింది. బౌలింగ్ యాక్షన్‌లో చేసుకున్న కొద్దిపాటి మార్పులు కూడా ఈ టోర్నీలో ఎక్కువ వికెట్లు తీసేందుకు ఉపయోగపడింది.

మిథాలీ, ధోనీ నుంచి నేర్చుకున్నా

ఒత్తిడిలో బ్యాటింగ్, బౌలింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తా. హైదరాబాద్ జట్టుకు ఆడుతున్నప్పట్నుంచే ఇది అలవర్చుకున్నా. నా ఆరాధ్య క్రికెటర్ మిథాలీ రాజ్‌పై ఉన్న అభిమానంతో ఆమె ఆటను నిశితంగా గమనించేదాన్ని. మైదానంలో మిథాలీ దృక్పథం మిగిలిన క్రికెటర్లతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. అలానే ప్రత్యర్థులకు తగ్గట్టు మైదానంలో చురుగ్గా వ్యూహాలను మార్చే నైపుణ్యాలను ధోనీని చూసి నేర్చుకున్నా. ఈ ఇద్దరు క్రికెటర్లలోని ఈ రెండు అంశాలు నాపై తెలియని ప్రభావం చూపాయి. సాధ్యమైనంత త్వరగా పిచ్‌పై ఒక అంచనా వస్తే తర్వాత ఎలాంటి బౌలర్‌నైనా సులభంగా ఎదుర్కోవచ్చు అనేది నా నమ్మకం. ఆ విధంగానే ఆడడంతో ఈ టోర్నీలో నాకు ఏ బౌలర్ నుంచీ పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు.

ఆ ఇద్దరి త్యాగాల వల్లే..

నా క్రికెట్ ప్రయాణంలో నాన్న (రామిరెడ్డి) కష్టం ఎంత ఉందో, అమ్మ (మాధవి) శ్రమ కూడా అంతే దాగి ఉంది. వారిద్దరి పట్టుదల, త్యాగాలతోనే ఈ స్థాయికి రాగలిగా. ఒక అమ్మాయి క్రీడల్లో ఈ స్థాయికి చేరిందంటే అందులో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైనది. నా కుటుంబసభ్యుల సహకారం, ప్రోత్సాహంతో ముమ్ముందు మరిన్ని విజయాలు సాధిస్తా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఐసీసీ జట్టులో త్రిష, కమలిని



కమలిని

దుబాయ్: మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన ప్లేయర్లతో కలిపి ఐసీసీ ఓ జట్టును ప్రకటించింది. ఇందులో భారత్ నుంచి ఏకంగా నలుగురికి చోటు దక్కడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచిన జి.త్రిషతో పాటు కమలిని, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ ఈ ఐసీసీ మహిళల అండర్-19 టీ20 వరల్డ్‌కప్ జట్టులో ఉన్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన కైలా రెనెకెను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఇక నిక్కీ ప్రసాద్ కెప్టెన్సీలో భారత అమ్మాయిల జట్టు అజేయంగా ఫైనల్‌కు చేరి, రెండోసారి చాంపియన్ అయిన విషయం తెలిసిందే.

సంజూకు గాయం

ఆరు వారాల విశ్రాంతి

ముంబై: భారత టీ20 జట్టు వికెట్ కీపర్ సంజూ శాంసన్ చేతి వేలికి గాయమైంది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టీ20లో పేసర్ ఆర్చర్ వేసిన బంతి సంజూ కుడిచేతి చూపుడు వేలికి బలంగా తాకింది. ఆ తర్వాత ఫీల్డింగ్‌కు దూరమైన తను స్కానింగ్‌కు వెళ్లగా.. ఫ్రాక్చర్ అయినట్టు తేలింది. దీంతో ఐదు నుంచి ఆరు వారాల పాటు అతడు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రస్తుతం తన స్వస్థలం తిరువనంతపురం చేరుకున్నాడని, పునరావాసం కోసం త్వరలోనే బెంగళూరులోని ఎన్‌సీఏకు వెళ్లనున్నట్టు సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. గాయం వల్ల ఈనెల 8 నుంచి జరిగే రంజీ క్వార్టర్స్ మ్యాచ్‌కు సంజూ దూరమయ్యాడు. తాజా టీ20 సిరీస్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజూ 5 మ్యాచ్‌ల్లో 51 రన్స్ మాత్రమే చేసి నిరాశపరిచాడు. పేసర్లు ఆర్చర్, ఉడ్, సకీబ్ షార్ట్ పిచ్ బంతులను ఆడలేక పవర్‌ప్లేలోనే వికెట్ సమర్పించుకున్నాడు. ప్రస్తుతం భారత వన్డే జట్టులో కూడా లేని శాంసన్ తిరిగి టీ20 బరిలోకి దిగాలంటే ఆగస్టులో బంగ్లాదేశ్‌తో సిరీస్ వరకు వేచిచూడాలి.

జట్టు మారింది..

సూర్యకుమార్ కెప్టెన్సీలో భారత టీ20 జట్టు ఇంగ్లండ్‌పై 4-1తో సిరీస్ గెలుచుకుంది. ఇక ఇప్పుడు మూడు వన్డేల సిరీస్‌లో రోహిత్ కెప్టెన్సీలో సరికొత్త జట్టుతో బరిలోకి దిగనుంది. ఈనెల 6,9,12తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ ఆడే సన్నాహక మ్యాచ్‌లు ఇవే కానున్నాయి. దీంతో ఈ సిరీస్ ద్వారా తుది జట్టుపై ఓ అంచనాకు రావచ్చు. టీ20 సిరీస్‌లో ఆడిన హార్దిక్, సుందర్, షమి, అక్షర్, అర్ష్‌దీప్, హర్షిత్ మాత్రమే వన్డే టీమ్‌లో ఉన్నారు. సూర్య, తిలక్, దూబే, అభిషేక్, వరుణ్, బిష్ణోయ్, రింకూ తదితరులకు వన్డే జట్టులో చోటు లభించలేదు. కాగా, కోహ్లీ, జైస్వాల్, గిల్, రాహుల్, పంత్, జడేజా, కుల్దీప్‌లాంటి స్టార్లతో కూడిన భారత్ వన్డే సిరీస్‌లోనూ ఇంగ్లండ్‌ను ఓడించాలన్న పట్టుదలతో ఉంది.

సురభి, జ్యోతికి కాంస్యాలు



సురభి



జ్యోతి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ క్రీడల్లో తెలుగు రాష్ట్రాల ఖాతాలో చెరో కాంస్య పతకం చేరింది. సోమవారం డెహ్రాడూన్‌లో జరిగిన మహిళల షూటింగ్ 50 మీటర్ల 3పీ విభాగంలో తెలంగాణలోని జమ్మికుంటకు చెందిన షూటర్ రాపోలు సురభీ భరద్వాజ్ 448.8 పాయింట్లతో కాంస్యం కైవసం చేసుకుంది. వెయిట్ లిఫ్టింగ్ 87 ప్లస్ కిలోల విభాగంలో ఏపీకి చెందిన విజయనగరం లిఫ్టర్ సత్య జ్యోతి కాంస్యం గెలుచుకుంది. జ్యోతి స్నాచ్‌లో 92 కి., క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కి., మొత్తంగా 201 కిలోల బరువెత్తి మూడో స్థానంలో నిలిచింది. ఇతర పోటీల్లో ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఆంధ్ర జట్టు ఫైనల్ చేరి పతకం ఖాయం చేసుకుంది. సెమీస్‌లో గణేష్ (నెల్లూరు), సూర్య హన్సిని (భీమవరం) జోడీ 153-148తో జమ్మూకశ్మీర్ జంటపై నెగ్గింది. ఈనెల 7న హరియాణాతో ఫైనల్ జరగనుంది. తెలంగాణ మహిళల జట్టు 3X3 బాస్కెట్‌బాల్ ఈవెంట్ ఫైనల్ చేరి పతకం ఖాయం చేసుకుంది. ఇదే విభాగంలో పురుషుల జట్టు సెమీస్‌లో ఓడి, మూడో స్థానం కోసం మంగళవారం తమిళనాడుతో పోటీపడనుంది.

మోడల్‌తో అభిషేక్ డేటింగ్?



న్యూఢిల్లీ: టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఇంగ్లండ్‌తో చివరి టీ20లో సూపర్ సెంచరీ కొట్టి అందరి దృష్టినీ ఆకర్షించాడు. దీంతో అతడి వ్యక్తిగత విషయాల గురించి నెట్‌లో వెతకడం ఎక్కువైంది. ఈ క్రమంలో అతడు మోడల్ లైలా ఫైజల్‌తో డేటింగ్‌లో ఉన్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే లైలా..ప్రముఖ లగ్జరీ దుస్తుల బ్రాండ్ యజమాని అని తెలుస్తోంది. వీరిద్దరూ చనువుగా ఉన్న ఫొటోలు కూడా నెట్‌లో చక్కర్లు కొడుతున్నాయి. కాగా, అభిషేక్ గతంలో తాన్యా సింగ్ అనే మోడల్‌తో ప్రేమాయణం నడిపాడనే వార్తలు కూడా ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. నిరుడు ఫిబ్రవరిలో ఆమె ఆత్మహత్య చేసుకోగా..అభిషేక్‌ను పోలీసులు విచారించారని సమాచారం.

బీపీఎల్‌లో జీతాల గోల!

● ఆటగాళ్ల కిట్‌లు ఇవ్వనన్న డ్రైవర్
● బస్సులోనే ఉంచి తాళం

ఢాకా: బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో నాటకీయ పరిణామం చోటు చేసుకొంది. ఫ్రాంచైజీ దర్బార్ రాజ్‌షాహి జీతాలు చెల్లించక పోవడంతో ఆ జట్టును తీసుకెళ్లే బస్సు డ్రైవర్ ఆటగాళ్ల కిట్‌లను బస్సులో ఉంచి తాళం వేయడం చర్చనీయాంశంగా మారింది. తనకు బకాయిపడిన జీతాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశాడు. 'ఇదెంతో సిగ్గుపడాల్సిన విషయం. మా జీతం బకాయిలు చాలా ఉన్నాయి. పూర్తి జీతాలు చెల్లిస్తేనే కిట్ బ్యాగులు ఇస్తా. ఇకపై నేనిక్కడ పనిచేయాలనుకోవడం లేద'ని ఆ డ్రైవర్ విలేకరులతో చెప్పాడు. కొందరు విదేశీ క్రికెటర్లకు కూడా రాజ్‌షాహి జీతాలు ఇవ్వలేదట.

బిజినెస్

ఈసారి పావు శాతం 'రెపో కోత'

రేపటి నుంచి ఎంపీసీ సమావేశం

ముంబై: వినియోగ ఆధారిత వృద్ధి కోసం కేంద్ర బడ్జెట్లో తీసుకున్న చర్యలకు మద్దతుగా ఈ వారంలో ఆర్‌బీఐ రెపో రేటులో 0.25 శాతం కోత విధించవచ్చని నిపుణులంటున్నారు. అదే జరిగితే రెండేళ్ల పాటు యథాతథంగా కొనసాగించిన అనంతరం రెపో రేటు తగ్గించినట్టవుతుంది. 2023 ఫిబ్రవరి సమీక్ష నుంచి (2022-23 ఆర్థిక సంవత్సరంలో చివరి సమీక్ష) రెపో రేటు 6.5 శాతం వద్దనే నిలకడగా ఉంది. 2020 మే నెలలో (కొవిడ్ సమయం) ఆర్‌బీఐ చివరి సారిగా రెపో రేటును తగ్గించింది. గత ఏడాదిలో ఎక్కువ కాలం ద్రవ్యోల్బణం ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన గరిష్ఠ కట్టడి పరిధి (6 శాతం) కన్నా దిగువనే ఉండడం ఆర్‌బీఐకి సానుకూలాంశమని వారంటున్నారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా పగ్గాలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం బుధవారం ప్రారంభ కానుంది. శుక్రవారం నాడు ఎంపీసీ నిర్ణయాలను మల్హోత్రా ప్రకటిస్తారు.

దివీస్ లేబొరేటరీస్ లాభం రూ.589 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.2,401 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.589 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.358 కోట్లు)తో పోల్చితే లాభం 65 శాతం వృద్ధి చెందింది. కాగా ఈ ఏడాది జనవరి 1 నుంచి కాకినాడ ప్రాజెక్ట్‌లోని యూనిట్ 3 వాణిజ్యపరమైన కార్యకలాపాలు ప్రారంభించిందని తెలిపింది. ప్రాజెక్ట్‌లోని మిగిలిన యూనిట్లు వచ్చే ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నట్లు దివీస్ లేబొరేటరీస్ పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	90
కర్నూలు	103	నెల్లూరు	95
విశాఖపట్నం	111	అనంతపురం	95
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	84,050 ▼	77,050 ▼	1,07,000 ▲
విజయవాడ	85,500 ▲	80,500 ▲	94,000 ▼
విశాఖపట్నం	83,050 ▲	76,130 ▲	94,200 ▼
రాజమండ్రి	84,050 ▼	77,050 ▼	96,400 ▲
ప్రొద్దుటూరు	83,600 ▼	77,460 ▼	94,000 ▼
ముంబై	82,704 ▲	75,757 ▲	93,313 ▼

ట్రంప్.. టారిఫ్.. టెర్రర్!

అమెరికా అధ్యక్షుడి సుంకాల మోత.. వాణిజ్య యుద్ధ భయాలతో గజగజ



అగ్రరాజ్యాధిపతి డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశాడు. చైనా, కెనడా, మెక్సికో.. ఇలా ఒక్కో దేశంపై వరుసపెట్టి సుంకాల మోత మోగించేస్తున్నాడు. దాంతో ఆ దేశాలూ ప్రతికార చర్యలకు సిద్ధమవుతున్నాయి. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చని మార్కెట్ వర్గాలు భయాందోళనలకు గురవుతున్నాయి. ఈక్విటీ పెట్టుబడులను వారు పెద్దఎత్తున వెనక్కి తీసుకుంటుండటంతో ప్రపంచ మార్కెట్లు నష్టాల్లో పయనిస్తున్నాయి. మరోవైపు టారిఫ్ షాక్‌తో మన కరెన్సీ మరింత బక్కచిక్కింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న బంగారానికి డిమాండ్ పెరగడంతో ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలూ మళ్లీ పుంజుకుంటున్నాయి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రూపాయి మరింత క్షీణించవచ్చని, పసిడి పరుగు ఆపకపోవచ్చని విశ్లేషకులంటున్నారు.

- ఈక్విటీ మార్కెట్ సూచీలు కుదేలు
- సరికొత్త రికార్డు కనిష్ఠానికి రూపాయి
- ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి బంగారం
- మళ్లీ ఎగబాకుతున్న ముడి చమురు



ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం భారీ నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించాయి. సెన్సెక్స్ ఒక దశలో 749.87 పాయింట్లు కోల్పోయి 76,756.09 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి కాస్త కోలుకున్న సూచీ.. 319.22 పాయింట్ల నష్టంతో 77,186.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 121.10 పాయింట్లు కోల్పోయి 23,361.05 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి. ఎల్ అండ్ టీ షేరు 4.64 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా విలువను కోల్పోయాయి. ప్రధాన షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీల స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.89 శాతం పతనమయ్యాయి. రంగాల వారీ సూచీల్లో క్యాపిటల్ గూడ్స్ అత్యధికంగా 4.29 శాతం క్షీణించగా.. ఇండస్ట్రియల్స్ 3.79 శాతం, పవర్ 3.30 శాతం నష్టపోయాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలో మొత్తం 4,184 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,962 నేల చూపు చూశాయి. 1,075 లాభపడగా..147 యథాతథంగా ముగిశాయి. 117 కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠానికి జారుకోగా.. 3 స్టాక్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. కాగా, మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.419.54 లక్షల కోట్లకు (4.82 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 750 పాయింట్లు డౌన్

రూ.87 దాటిన డాలర్

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజే 49 పైసలు క్షీణించి రూ.87.11 వద్ద ముగిసింది. ఒక దశలో ఎక్స్ఛేంజ్ రేటు ఏకంగా 67 పైసల నష్టంతో రూ.87.29 స్థాయికి చేరినప్పటికీ.. మన కరెన్సీ మళ్లీ కాస్త కోలుకుంది. డాలర్‌తో మారకం రేటు రూ.87 స్థాయిని దాటడం ఇదే తొలి సారి. టారిఫ్‌ల ప్రభావంతో అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్లో నష్టాలు ఇందుకు కారణమయ్యాయి. ముడి చమురు ధరల పెరుగుదల కూడా రూపాయిపై ఒత్తిడి పెంచింది. డాలర్ క్రమంగా బలపడుతుండటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతున్న నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు. ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటే మన కరెన్సీకి కొంత మద్దతు లభించవచ్చన్నారు. కాగా, 6 అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 1.01 శాతం పెరిగి 109.46కు చేరుకుంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.41 శాతం పెరిగి 76.74 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

గోల్డ్ @ రూ.85,000

పసిడి మళ్లీ కొండెక్కుతోంది. దేశీయంగా ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 స్వచ్ఛత బంగారం రేటు 10 గ్రాములు మరో రూ.400 పెరుగుదలతో రూ.85,300కు చేరుకుంది. పసిడి రూ.85,000 మైలురాయిని దాటడం ఇదే తొలిసారి. వెండి సైతం కిలోపై రూ.300 పెరుగుదలతో రూ.96,000 చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు ఎగబాకడంతో పాటు దేశీయంగా రూపాయి విలువ పతనం ఇందుకు ప్రధాన కారణమయ్యాయని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఈక్విటీల్లోని పెట్టుబడులను క్రమంగా బులియన్ వైపు మళ్లిస్తున్నారని బులియన్ నిపుణులు చెబుతున్నారు.

ఐటీలో నియామకాలు పెరుగుతున్నాయ్

కీలకంగా మారుతున్న జీసీసీలు.. ఎస్‌టీపీఐ డైరెక్టర్ కవిత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో మళ్లీ నియామకాలు ఊపందుకున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) డైరెక్టర్ కవిత తెలిపారు. సోమవారం నాడిక్కడ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీ సర్వీసులు సహా అన్ని విభాగాల్లో రిక్రూట్‌మెంట్స్ తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయన్నారు. గతంలో కొంత స్తబ్దత నెలకొన్నప్పటికీ ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రధానంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)లో పెద్దఎత్తున ఏర్పాటు అవుతుండటంతో పాటు ఉద్యోగాల కల్పన కూడా అదే స్థాయిలో ఉంటోందని తెలిపారు. హైదరాబాద్‌లో దాదాపు 110 జీసీసీలు ఉండగా నియామకాల్లో వాటి వాటా 25 శాతం వరకు ఉందన్నారు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం దేశ ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 16.8 శాతంగా ఉందని కవిత తెలిపారు. ఇందులో జీసీసీల వాటానే 38 శాతం వరకు ఉందని ఆమె పేర్కొన్నారు. కొత్త జీసీసీలు పెద్దఎత్తున ఏర్పాటు కానుండటంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ వాటా మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆమె చెప్పారు.

11న హైసియా జాతీయ సమ్మిట్: ఈ నెల 11న హైదరాబాద్‌లో 32వ హైసియా జాతీయ సదస్సు, అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హైసియా ప్రెసిడెంట్ ప్రశాంత్ నందెళ్ల తెలిపారు. ఏఐ అండ్ బియాండ్: రీడిఫైనింగ్ ది ఫ్యూచర్ పేరుతో ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సదస్సులో భాగంగా లైఫ్ సైన్సెస్, సస్టేనబుల్ సిస్టమ్స్, గ్రీన్ సాఫ్ట్‌వేర్, సిటీ సర్వీసులు, ఈ-గవర్నెన్స్ విభాగాల్లో ఏఐ ద్వారా వస్తున్న మార్పులపై విస్తృత స్థాయిలో చర్చాగోష్ఠిని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

వైజాగ్ ఫార్మా ఎక్స్‌పో షురూ

పరవాడ (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో సోమవారం 'వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్స్ ఎక్స్‌పో -2025 పారంభమైంది. జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జేఎన్‌పీసీ) మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ సూర్యప్రకాశ్ ఈ ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇప్పటివరకూ ఏడు ప్రధాన నగరాల్లో మాత్రమే ఇలాంటి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత విశాఖపట్నం ఫార్మా హబ్‌గా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వరుసగా మూడోసారి ఇక్కడ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా 150 సంస్థల నుంచి ఎగ్జిబిటర్స్‌ను తీసుకువచ్చామని, రెండు వేల అధునాతన ఫార్మా ఉపకరణాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు.

గ్లాండ్ ఫార్మా లాభం రూ.205 కోట్లు


డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి గ్లాండ్ ఫార్మా.. రూ.1,384 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.205 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 7 శాతం పెరిగినా ఆదాయం మాత్రం 10.4 శాతం తగ్గింది. ఫ్రాన్స్‌లోని యూనిట్‌లో ఉత్పత్తి సమస్యలు తలెత్తడం మూడో త్రైమాసికంలో కంపెనీ ఆదాయాన్ని దెబ్బతీసింది. అయితే ఖర్చులు 11 శాతం తగ్గడం కలిసివచ్చిందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీనివాస్ సాదు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	500
వరంగల్	462	గోదావరి	465
చిత్తూరు	533	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 72	

జీఆర్‌టీ జువెలర్స్.. స్వర్ణ అవతారం



హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ తన 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా వినియోగదారులు తమ పాత బంగారు ఆభరణాలను సరికొత్త ఆభరణాలుగా మార్చుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో 'స్వర్ణ అవతారం', తమిళనాడులో 'తంగ అవతారం' పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చింది. అంతేకాకుండా వినియోగదారులు తమ పాత బంగారాన్ని మార్పిడి చేసుకున్నప్పుడు గ్రాముకు అదనంగా రూ.75 అందించనున్నట్లు జీఆర్‌టీ జువెలర్స్ వెల్లడించింది. ఈ పరిమిత కాల ఆఫర్ కేవలం బంగారం ఎక్స్ఛేంజీలో మాత్రమే అందుబాటులో ఉండనుంది. బంగారు నాణేలు లేదా కడ్డీల కొనుగోళ్లకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండదని జీఆర్‌టీ జువెలర్స్ తెలిపింది.

అవగాహన

విటమిన్లు మతలబులు

విటమిన్ లోపాలు కొన్ని లక్షణాలతో ప్రస్ఫుటంగా బయల్పడుతూ ఉంటాయి. ఆ లక్షణాల ఆధారంగా పోషకలోపాలను ఎలా కనిపెట్టవచ్చో తెలుసుకుందాం!

- **నిస్సత్తువ:** విపరీతమైన నిస్సత్తువ, తేలికపాటి పనులకే అలసిపోవడం, రోజంతా నీరసంగా, బడలికగా ఉండడం.. ఇవన్నీ విటమిన్ బి12 లోపం లక్షణాలు
- **కండరాల నొప్పులు:** కండరాలు పట్టేయడం, నొప్పులు వేధించడం మెగ్నీషియం లోపం లక్షణాలు
- రోగనిరోధకశక్తి: తరచూ స్వల్ప రుగ్మతలకు గురవుతూ ఉండడం రోగనిరోధకశక్తి తగ్గుదలకు సూచన. కాబట్టి రోగనిరోధక వ్యవస్థను బలంగా ఉంచుకోవడం కోసం విటమిన్ సి తీసుకోవాలి
- **చర్మ సమస్యలు:** చర్మం పొడిబారుతున్నా, పొట్టు రేగుతున్నా, చిట్లిపోతున్నా విటమిన్ ఇ లోపంగా పరిగణించి, ఆ పోషకాన్ని భర్తీ చేసుకోవాలి
- **వెంట్రుకలు ఊడిపోతుంటే:** వెంట్రుకలు రాలిపోతున్నా, చిట్లిపోతున్నా విటమిన్ డి లోపంగా భావించాలి.

ఎలాంటి పోషక లోపాన్నైనా ఆ పోషకం దొరికే ఆహారంతో భర్తీ చేసుకోవచ్చు. కాబట్టి సప్లిమెంట్లకు బదులుగా ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరాన్ని బట్టి వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవచ్చు.




ఇదీ సంగతి

పొట్ట చదునుగా...

ఎంత ప్రయత్నించినా పొట్ట దగ్గర కొవ్వు కరగడం లేదా? అయితే ఆహారపుటలవాట్లలో లోపాలున్నాయని అర్థం చేసుకోవాలి. అందుకోసం ఈ అలవాట్లకు స్వస్థి చెప్పాలి.

- **క్యాలరీలు తాగుతున్నారా?:** స్మూదీలు, పండ్లరసాలు ఆరోగ్యకరమే! కానీ వాటిలో ఉండే చక్కెరతో అదనపు క్యాలరీలు శరీరంలోకి చేరుకుంటాయి. కాబట్టి దాహం తీర్చుకోవడం కోసం వాటికి బదులుగా నీళ్లు, చక్కెర కలపని పలుచని మజ్జిగ, నిమ్మరసం తాగొచ్చు.
- **ఆహారం పరిమితం:** నచ్చిన పదార్థాలను పూర్తిగా తినడం మానేయవలసిన అవసరం లేదు. మితంగా తింటే సరిపోతుంది. పిండిపదార్థాలు శత్రువులు కావు. కాబట్టి వాటిని పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. కానీ తినే ముందు కంచంలో ఎంత అన్నం, ఎన్ని దుంపలు ఉన్నాయో గమనించుకోవాలి. పిండిపదార్థాలు తక్కువగా, మాంసకృత్తులు, పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.



- **క్యాలరీలు తగ్గించి:** కడుపు మాడిస్తే, కచ్చితంగా పొట్ట చదునవుతుంది. కాబట్టి కడుపు నిండా తినడం మానేసి, పొట్టను కాస్త ఖాళీగా ఉంచాలి. తినే కొద్దిపాటి ఆహారం పోషకాలతో నిండి ఉండేలా చూసుకోవాలి.
- **నెమ్మదిగా:** ఆబగా, త్వరత్వరగా తినడం వల్ల సరిపడా తిన్నా ఆకలి తీరని భావన కలుగుతుంది. కాబట్టి మనసు పెట్టి ఏకాగ్రతగా, నెమ్మదిగా తినాలి. ఫోన్లు, టివి చూస్తూ తినే అలవాటు మానుకోవాలి. ఆహారాన్ని బాగా నమిలి తినాలి.
- భోజనాన్ని సలాడ్‌తో మొదలుపెడితే, పొట్ట సగం నిండిపోయి, మిగతా పదార్థాల మోతాదు తగ్గిపోతుంది.



క్యాన్సర్ కథ కంచికే!

క్యాన్సర్ వ్యాధి, చికిత్సలు, కోలుకునే అవకాశాల గురించి మనలో ఎన్నో అపోహలు, భయాలు. అత్యాధునికమైన కొత్త చికిత్సలు అందుబాటులోకొస్తున్నా, వాటిని తలదన్నే రూపాల్లో క్యాన్సర్ విజృంభిస్తూ ఉండడమే ఇందుకు కారణం. అయినప్పటికీ ఈ వ్యాధి పట్ల తగిన అవగాహనతో అప్రమత్తంగా మెలగాలని సూచిస్తూ, క్యాన్సర్ గురించిన కొన్ని కీలకమైన అంశాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ఎక్కడో, ఎవరో క్యాన్సర్ బారిన పడ్డారని వినే రోజులు పోయాయి. ఇప్పుడు ఈ వ్యాధి అందరికీ సుపరిచితమే! ప్రపంచవ్యాప్తంగా ఇదే దుస్థితి. ఇందుకు ఎన్నో కారణాలు. ధూమపానం, మద్యపానం లాంటి దురలవాట్లకు తోడు, నాణ్యత లోపించిన కలుషిత ఆహారం, అస్తవ్యస్థ జీవనశైలులు, వాతావరణ కాలుష్యం క్యాన్సర్ ఉధృతిని పెంచుతున్నాయి. ఇవే కాకుండా గత యాభై ఏళ్లలో మన ఆయుష్షు క్రమేపీ పెరిగింది. సాధారణ జనాభా ఆయుష్షు పెరిగేకొద్దీ, శరీర కణాలు దెబ్బతినడం, మరమ్మతు సక్రమంగా జరగకపోవడం, వ్యాధినిరోధకశక్తి తగ్గడం లాంటి కారణాల వల్ల ఆరోగ్యకరమైన కణాలు క్యాన్సర్ కణాలుగా పరిణామం చెందే అవకాశాలు పెరుగుతాయి. దాంతో నగటు జీవితకాలం పెరిగే కొద్దీ క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతోంది. ఫలితంగా సర్వత్రా క్యాన్సర్ విపరీతంగా ప్రబలుతోంది. ఆయుష్షు పెరగకుండా ఆపలేం! కానీ దురలవాట్లకు దూరంగా ఉండడం, ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను అనుసరించడం, వాయు కాలుష్యాన్ని నివారించే జాగ్రత్తలు చేపట్టడం ద్వారా ఈ వ్యాధి నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు.



ఈ లక్షణాల మీద కన్నేసి...

క్యాన్సర్ సోకిన ప్రదేశం మీదే వ్యాధి లక్షణాలు ఆధారపడి ఉంటాయి. అయితే ఈ లక్షణాల కంటే ముందు శరీరంలో క్యాన్సర్ పెరుగుతోందని తెలిపే కొన్ని సూచనలు కూడా బయల్పడుతూ ఉంటాయి. అవేంటంటే...

- అకారణంగా బరువు తగ్గడం
- ఆకలి మందగించడం, కొద్దిపాటి ఆహారంతోనే కడుపు నిండిపోతూ ఉండడం
- క్రమేపీ కాకుండా అకస్మాత్తుగా జీవనశైలి రుగ్మతల (మధుమేహం) బారిన పడడం
- మూడు వారాలకు మించిన అస్వస్థత (జ్వరం, దగ్గు, విరోచనాలు(మలబద్ధకం)

ఈ వ్యాధి వంశపారంపర్యమా?

కొన్ని రకాల ఫెమీలియల్ క్యాన్సర్లు మాత్రమే వంశపారంపర్యంగా సంక్రమించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక తరం నుంచి ఇంకొక తరానికీ మార్పిడి అయ్యే జన్యువుల్లో లోపాలు ఏర్పడడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వంశపారంపర్యంగా సంక్రమిస్తాయి. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, , గర్భాశయ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, పెద్దపేగు క్యాన్సర్, పొట్ట క్యాన్సర్ ఈ కోవకు చెందినవే! అలాగే ఒకే రకమైన క్యాన్సర్ కారకాలకు బహిర్గతమవడం వల్ల కూడా ఒకే ప్రాంతంలో ఎక్కువ మందికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ ఇందుకొక ఉదాహరణ. అయితే వంశపారంపర్య క్యాన్సర్లకు అడ్డుకట్ట వేయాలంటే క్యాన్సర్ సోకిన వ్యక్తిలోని క్యాన్సర్ జన్యువును పరీక్షించాల్సి ఉంటుంది. పాజిటివ్ ఫలితం వస్తే, వాళ్ల పిల్లలకు ఆ జన్యువు సంక్రమించిందో లేదో పరీక్షించుకోవచ్చు. సంక్రమిస్తే, 25 ఏళ్ల వయసు నుంచే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలి. రొమ్ము క్యాన్సర్ విషయంలో మామోగ్రామ్‌తో పాటు ప్రతి ఆరు నెలలకూ ఎమ్మారై చేయించుకుంటూ ఉండాలి. ఒకవేళ క్యాన్సర్ సోకిన వ్యక్తి జన్యు పరీక్ష నెగిటివ్ ఫలితాన్నిచ్చిన పక్షంలో, వారి సంతానానికి కూడా జన్యు పరీక్ష చేసి, జన్యు ఉత్పరివర్తన లేదని నిర్ధారించుకోవాలి. ఈ కోవకు చెందినవాళ్లు 40 ఏళ్ల వయసు నుంచి క్రమం తప్పకుండా వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

ఏ చికిత్స ప్రయోజనకరం?

క్యాన్సర్ చికిత్సలో ఎంతో పురోగతి సాధించాం. ఎన్నో రకాల చికిత్సా ప్రత్యామ్నాయాలున్నాయి. దాంతో ఫలితాలు కూడా మెరుగై, మరణాలు తగ్గుముఖం పట్టాయి. అయితే క్యాన్సర్ చికిత్సలు రకం, స్వభావం, దశలను బట్టి మారుతూ ఉంటాయి. ఒకరికి మెరుగైన ఫలితాన్నిచ్చిన చికిత్స మరొకరికి ఫలితాన్నివ్వకపోవచ్చు. కాబట్టి సత్ఫలితాన్ని పొందడం కోసం వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు చికిత్సలను ఆశ్రయించవలసి వస్తుంది. క్యాన్సర్ చికిత్సలో సర్జరీ అవసరమవుతుంది. కీమోథెరపీ, రేడియోథెరపీలు అవసరమవుతాయి. అయితే ఈ చికిత్సలు అందించే వైద్యులందరూ ఒకే చోట ఒక బృందంలా పని చేసే ఆస్పత్రిని ఎంచుకోవడం ఎంతో కీలకం. ఇలా సమగ్రమైన క్యాన్సర్ చికిత్సను అందించే ఆస్పత్రిని ఆశ్రయించగలిగితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. అలాగే ఆ ఆస్పత్రిలో తాజా చికిత్సలు, సాంకేతికతలను అనుసరిస్తున్నారని నిర్ధారించుకోవాలి.



క్యాన్సర్ మీద విజయం సాధ్యమా?

క్యాన్సర్ బారిన పడినంత మాత్రాన జీవితం అక్కడితో అంతమైపోదు. ప్రస్తుతం ఎంతో అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి నిర్భయంగా క్యాన్సర్ చికిత్సకు సన్నద్ధం కావాలి. మరీ ముఖ్యంగా రెండు పడవల మీద కాళ్ల చందాన్ని అనుసరించకుండా, వైద్యుల బృందం సూచించే చికిత్సా ప్రణాళికకు కట్టుబడి, పూర్తి సహకారాన్ని అందించాలి. అన్నిటికంటే ముఖ్యంగా చికిత్సకు భయపడకుండా గుండె నిబ్బరంతో వ్యవహరించాలి. లేదంటే ఎంతటి సమర్థమైన చికిత్స అయినా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు.

తిరగబెట్టకుండా ఏం చేయాలి?

క్యాన్సర్ తిరగబెట్టడానికి ప్రధానంగా రెండు అంశాలు దోహదపడతాయి. రోగి, చికిత్సకు ఎంత బాగా కట్టుబడి ఉన్నారు? వైద్యులు చికిత్సను ఎంత మెరుగ్గా అందించగలిగారు? అనే అంశాల మీదే క్యాన్సర్ తిరగబెట్టే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. అలాగే క్యాన్సర్ తత్వం, పరిణామం చెందే తీరుల మీద కూడా ఈ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఆధారపడి ఉంటాయి. క్యాన్సర్ కణితి బయాలజీ దూకుడుగా ఉంటే, ఆ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పదేళ్ల క్రితం క్యాన్సర్ తిరగబెట్టడానికి కారణాలు తెలుసుకునే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఇప్పుడు క్యాన్సర్ కణితి దూకుడు వెనకున్న కారణాన్ని కచ్చితంగా కనిపెట్టగలుగుతున్నారు. ఎటువంటి జన్యు మార్పుల వల్ల, రోగనిరోధకశక్తిని కుంటుపరిచే ఎలాంటి అంశాల వల్ల కణితి దూకుడుగా ప్రవర్తిస్తోందో తెలుసుకోగలుగుతున్నారు. వీటికి తగ్గట్టు చికిత్సను అందించగలిగితే వ్యాధి తిరగబెట్టే అవకాశాలు తగ్గిపోతాయి. ఒకవేళ తిరగబెట్టినా, ఆయుష్షును పొడిగించే వీలు కలుగుతోంది. కాబట్టి క్యాన్సర్ తిరగబెట్టినంత మాత్రాన కంగారుపడిపోవలసిన అవసరం లేదు. వైద్యులను సంప్రతించి తగిన చికిత్స తీసుకుని పూర్తిగా కోలుకోవచ్చు.

> **పెద్దల్లో క్యాన్సర్ ముప్పు**
>
> క్యాన్సర్‌కు వయోపరిమితి లేదు. పుట్టింది మొదలు చనిపోయేవరకూ ఈ వ్యాధి ఎవరికైనా, ఎప్పుడైనా సోకవచ్చు. పిల్లల్లో రక్త క్యాన్సర్లు, పెద్దల్లో ప్రోస్టేట్, ఊపిరితిత్తుల క్యాన్సర్లు ఎక్కువ. మరీ ముఖ్యంగా ఆయుష్షు పెరిగేకొద్దీ శరీర కణాలు మార్పులకు గురవడం, కణ మరమ్మతు, రోగనిరోధక శక్తి కుంటుపడడం లాంటి సమస్యలు పెరుగుతాయి. కాబట్టి పిన్న వయస్కులతో పోలిస్తే పెద్దల్లో క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువ. కాబట్టి 60 ఏళ్లకు పైబడిన వాళ్లలో క్యాన్సర్ ముప్పు పెరుగుతూ ఉంటుంది.

కోలుకున్న తర్వాత ఎలా మసలుకోవాలి?

క్రమం తప్పక వైద్యులు సూచించిన పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో మెలుగుతూ ఉండాలి. క్యాన్సర్ కారకాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగిస్తూ, అనుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. అలాగే రెడ్ మీట్, శుద్ధి చేసిన పదార్థాలు తినడం మానేసి, శరీరాన్ని వీలైనంత చురుగ్గా ఉంచుకోవాలి.

డాక్టర్ దీపక్ కొప్పాక
సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్,
కేర్ హాస్పిటల్స్ హైదరాబాద్.



మొరింగ

మునగాకు మహిమ

మునగాకుతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. అయితే ఆ ఆకును వంటల్లో ఎలా వినియోగించుకోవాలో తెలుసుకుందాం!



హెర్బల్ టీ

తులసి, అల్లం, మిరియాలు.. వేటితో టీ కాచుకున్నా దాన్లో కాస్త మునగాకు పొడి వేసుకుంటే, ఆ ఆకులోని పోషకాలను పొందవచ్చు. అయితే ఇలా తయారుచేసుకునే టీలో పాలు కలుపుకోకూడదు.

స్మూదీలు, మిల్క్‌షేక్స్

స్మూదీలు, మిల్క్‌షేక్స్‌లో కలుపుకుని తాగడం కోసం ఒక కప్పు పాలు, అరటి పండ్లు, యాపిల్ ముక్కలు, ఒక టీస్పూను మోరింగ పొడిని కలిపి బ్లెండ్ చేసుకోవాలి.

పరాఠా, రోటీలు

పరాఠా, రోటీల తయారీ కోసం సిద్ధం చేసుకునే గోధుమ పిండిలో ఒకట్రెండు టీస్పూన్ల మోరింగ పొడి కలుపుకోవచ్చు. రుచి కోసం నిమ్మరసం, ఉప్పు, కొద్దిగా కారం కూడా కలుపుకోవచ్చు.

సూప్స్, పప్పులు

సూప్ తయారుచేసుకునేటప్పుడు ఒక టీస్పూన్ మోరింగ పొడి జోడించవచ్చు. ఏ పప్పు వండుకున్నా మోరింగ పొడితో కలిపి వండుకోవచ్చు. వీటి రుచిని పెంచడం కోసం అల్లం, వెల్లుల్లి, కొత్తిమీర, పసుపు జోడించుకోవచ్చు.

పెరుగులో

జీలకర్ర పొడి, కీరా, క్యారట్ ముక్కలు, ఉప్పు, ఒక టీస్పూను మోరింగ పొడి పెరుగుకు జోడించి పెరుగు పచ్చడిలా వాడుకోవచ్చు.

బిరియానీ, పాస్తా

పాస్తా సాస్‌లో మోరింగ పొడి కలుపుకోవచ్చు. బిరియానీ వండేటప్పుడు, బియ్యంతో పాటు మోరింగ పొడి జోడించుకోవచ్చు.

తెలుసుకుందాం

గుండె గట్టిగా...

గుండెకు హాని కలిగించే అలవాట్ల గురించి మనకు అవగాహన ఉందనుకుంటాం. కానీ గుండెకు హాని కలిగించే మనకు తెలియని అంశాలు కూడా కొన్ని ఉన్నాయి. అవేంటంటే...

తీవ్రమైన ఒత్తిడి: దీర్ఘకాలం పాటు కొనసాగే కుటుంబ కలహాలు, వృత్తిపరమైన ఒత్తిడిలు గుండెకు హాని చేస్తాయి. ఇవి నేరుగా గుండె మీద ప్రభావం కనబరచకపోయినా, రక్తపోటును పెంచి పరోక్షంగా గుండెను ఒత్తిడికి లోను చేస్తాయి. ఒత్తిడితో ధూమపానం, ఆహారం మీద వ్యామోహం లాంటి అనారోగ్యకరమైన అలవాట్లు కూడా అలవడతాయి. ఇవి కూడా గుండెకు చేటు చేసేవే! కాబట్టి ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం సాధన చేయాలి. వ్యక్తిగత, వృత్తిగత ఒత్తిడులను తగ్గించుకోవాలి.



నిద్రలేమి: నిద్ర లోపించడం, కంటినిండా నిద్ర పోకపోవడం.. ఈ రెండూ జీవగడియారాన్ని అస్తవ్యస్థం చేసి, రక్తపోటును పెంచి, ఊబకాయానికి దారి తీస్తాయి. దీర్ఘకాలంలో ఈ పరిస్థితి గుండె మీద దుష్ప్రభావాన్ని కనబరుస్తుంది. కాబట్టి కచ్చితమైన నిద్రవేళలు పాటిస్తూ, నిద్రకు రెండు గంటల ముందు ఫోన్లు, టివిలకు దూరం పెట్టాలి. పడగ్గదిని సౌకర్యవంతంగా, చీకటిగా ఉంచుకోవాలి. నిద్రాభంగం కలిగించే అంశాలేవీ పడగ్గదిలో లేకుండా చూసుకోవాలి.

సూర్యరశ్మి: విటమిన్ డి లోపం అధిక రక్తపోటు, ఇన్‌ఫ్లమేషన్‌కూ, అంతిమంగా గుండె జబ్బులకూ దారి తీస్తుంది. కాబట్టి రోజులో కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటైనా సూర్యరశ్మికి బహిర్గతం కావాలి. అవసరాన్ని బట్టి సప్లిమెంట్లు వాడుకోవాలి.

పారాహుషార్

గులియన్ బార్‌తో గాభరా వద్దు

కొవిడ్ తర్వాత ప్రతి చిన్న సమస్యనూ భూతద్దంలో నుంచి చూసే ధోరణి పెరిగింది. వ్యాధితో మరణాలు నమోదు కాగానే, భయంతో బెంబేలుపడిపోయే స్వభావం ఏర్పడిపోయింది. అలాంటి కోవకు చెందినదే తాజా 'గులియన్ బార్' సిండ్రోమ్. అందర్నీ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఈ వ్యాధి గురించి వైద్యులు ఏమంటున్నారంటే...

గులియన్ బార్ సింద్రోమ్ కొత్తదేమీ కాదు. వందేళ్ల నుంచి మనుగడలో ఉన్న పాత వ్యాధే! సింద్రోమ్ అంటే లక్షణాల సమాహారం అని అర్థం. కొన్ని నిర్దిష్టమైన లక్షణాలు బయల్పడతాయి కాబట్టే ఈ రుగ్మతను సింద్రోమ్‌గా పేర్కొంటున్నారు. గులియన్ బార్ సింద్రోమ్‌లో ప్రధానంగా నాడీవ్యవస్థ దెబ్బతిని, పక్షవాతాన్ని పోలిన లక్షణాలు కనిపిస్తాయి. అలాగని దీన్ని పక్షవాతంగా పొరపాటు పడకూడదు. ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయంటే...

- చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, బలహీనత
- నడవడం, మెట్లెక్కడంలో ఇబ్బంది
- నడక తడబడడం
- మింగడంలో ఇబ్బంది
- కనురెప్పలు మూయలేకపోవడం
- మొదట కాళ్లూ చేతులు పడిపోవచ్చు
- నీరసం, నిస్సత్తువ
- పక్షవాతం లక్షణాలు శరీరంలో పైనుంచి కిందకూ లేదా కిందనుంచి పైకీ వ్యాపించవచ్చు

శరీర తత్వాన్ని బట్టి తీవ్రం

కూర్చుని లేవడంలో ఇబ్బంది మొదలు వెంటిలేటర్ సపోర్ట్‌కు చేరుకునేవరకూ ఈ వ్యాధిలో ఆరు దశలుంటాయి. ఈ దశల మధ్య సమయ నిడివి కొందర్లో ఎంతో తక్కువగా ఉంటుంది. వ్యాధి తీవ్రరూపం దాల్చడానికి మూడు నుంచి నాలుగు వారాలు పడుతుంది. కానీ కొందర్లో కూర్చుని నిలబడడానికి ఇబ్బందిపడే తొలి దశ, వారం రోజుల్లోనే వెంటిలేటర్‌కు చేరుకునే చివరిదశకు పెరిగిపోతుంది. ప్రధానంగా నాడులను దెబ్బతీసే ఈ వ్యాధి సోకిన ఐదు శాతం మందిలో, అటానమిక్ డిస్టర్బెన్స్ సమస్య తలెత్తుతుంది. అంటే, సాధారణంగా స్పృహలో లేకపోయినా, మన శరీరం రక్తపోటును సక్రమంగా నియంత్రిస్తూనే ఉంటుంది. అయితే గులియన్ బార్ సింద్రోమ్ వల్ల అటానమిక్ నాడీ వ్యవస్థ దెబ్బతిన్న అతి కొద్ది మందిలో రక్తపోటు నియంత్రణ కోల్పోయి, పరిస్థితి విషమించవచ్చు. అయితే ఇలాంటి స్థితిని అధికమించగలిగితే, ప్రాణాపాయం ఉండదు. 20 ఏళ్ల క్రితం ఇలాంటి నాలుగు, ఐదు, ఆరో దశలకు చేరుకున్న వాళ్లు కోలుకునే అవకాశాలు తక్కువగా ఉండేవి. కానీ నేడు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి కాబట్టి ఆ రోగులు కూడా తిరిగి పూర్తిగా కోలుకోగలుగుతున్నారు.



> **గులియన్ బార్ వాస్తవాలు ఇవే!**
>
> - ఇది కొత్త వ్యాధి కాదు. వందేళ్ల నుంచి మనుగడలో ఉన్నదే!
> - ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధి కానే కాదు
> - మన వ్యాధినిరోధక వ్యవస్థ మన మీదే దాడి చేసే ఆటొఇమ్యూన్ డిజార్డర్ ఇది
> - ఎంత త్వరగా లక్షణాలను గుర్తించి వైద్య చికిత్స అందిస్తే, అంతే త్వరగా కోలుకోవచ్చు
> - వ్యాధి ప్రాణాంతకంగా మారే అవకాశాలు తక్కువ
> - శరీర తత్వం, జన్యు మేకప్‌ల మీదే గులియన్ బార్ సింద్రోమ్ తలెత్తే అవకాశాలు ఆధారపడి ఉంటాయి
> - ఈ రుగ్మత ఎవరికైనా, ఏ వయసువారికైనా రావచ్చు
> - వ్యాధి దశ మీదే లక్షణాలు ఆధారపడి ఉంటాయి

సమస్య శరీరంలోనే....

ప్రధానంగా ఇది ఆటొఇమ్యూన్ డిజార్డర్. అంటే బయటి కారకాల వల్ల కాకుండా, మన శరీరంలోనే జనించే ఆరోగ్య సమస్య ఇది. వైరల్ జ్వరాలు తగ్గిన తర్వాత కీళ్ల వాతాలు వేధించడం సర్వసాధారణం. అలాగని కీళ్లవాతానికీ వైరస్‌కూ సంబంధం లేదు. వైరస్‌తో పోరాడే శరీర స్పందన ఫలితమే కీళ్ల వాతం. గులియన్ బార్ సింద్రోమ్ కూడా అలాంటిదే! ఈ రుగ్మతకూ బ్యాక్టీరియాకూ ఎలాంటి సంబంధం లేదు. వ్యాధికారక బ్యాక్టీరియాకూ, మన శరీరంలోని మంచి బ్యాక్టీరియాకూ కొన్ని పోలికలుంటాయి. శరీరంలోని కామన్ బ్యాక్టీరియాను ఉపయోగకరమైన మంచి బ్యాక్టీరియాగా మన వ్యాధినిరోధకవ్యవస్థ గుర్తుపడుతుంది. కానీ వ్యాధికారక బ్యాక్టీరియా, మన శరీరంలోని మంచి బ్యాక్టీరియాల యాంటీజన్లు ఒకే రకమైనవి కావడం వల్ల 'మాలిక్యులర్ మిమిక్రీ' పరిస్థితి తలెత్తుతుంది. దాంతో మన శరీరంలోని యాంటీబాడీలు, వ్యాధికారక బ్యాక్టీరియాతో పాటు మంచి బ్యాక్టీరియా మీద దాడిని కొనసాగిస్తాయి. ఫలితంగా నాడులు దెబ్బతిని గులియన్ బార్ సింద్రోమ్ తలెత్తుతుంది.

ఎవరికైనా, ఎప్పుడైనా...

ఈ సింద్రోమ్‌కు క్యాంపిలోబ్యాక్టర్ జెజుని అనే బ్యాక్టీరియా ప్రధాన కారణం. కలుషిత నీటిలో ఉండే ఈ బ్యాక్టీరియా సోకడంతో గులియన్ బార్ సింద్రోమ్ రుగ్మతకు బీజాలు పడ్డాయి. ఈ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ సోకి, విరోచనాలు వేధించి, కోలుకున్న రెండు నుంచి మూడు వారాల తర్వాత పక్షవాత లక్షణాలు మొదలై, ఈ రుగ్మత వెలుగులోకొచ్చింది. నిజానికి విరోచనాలే కాకుండా జలుబు, దగ్గుతో కూడిన వైరల్ ఇన్‌ఫెక్షన్ నుంచి కోలుకున్న తర్వాత కూడా ఈ సింద్రోమ్‌కు గురయ్యే అవకాశాలుంటాయి. ఇలా 30 నుంచి 40% మందిలో పూర్వ రుగ్మతలు తగ్గిన తర్వాత గులియన్ బార్ సింద్రోమ్ తలెత్తవచ్చు. మిగతా 60 నుంచి 70 శాతం మందిలో ఎలాంటి లక్షణాలు, రుగ్మతలు లేకుండా నేరుగా పక్షవాతంతోనే ఈ సింద్రోమ్ బయల్పడవచ్చు. తీవ్ర రుగ్మత నుంచి, సర్జరీల నుంచి కోలుకున్న వారిలో కూడా ఆటో ఇమ్యూన్ స్ట్రెస్ తలెత్తి, నాడీ వ్యవస్థ దెబ్బతిని ఈ సింద్రోమ్ తలెత్తవచ్చు.

సమర్థమైన చికిత్సలున్నాయి

ఈ రుగ్మతను ఎంత త్వరగా నిర్ధారించి, చికిత్సను అందించగలిగితే అంత మెరుగ్గా, వేగంగా కోలుకోగలుగుతారు. వంద మంది గులియన్ బార్ సింద్రోమ్ రోగుల్లో కేవలం ఒకరిద్దరికి మాత్రమే పెరిఫెరల్ నాడీ వ్యవస్థతో పాటు మెదడు, రక్తపోటు కూడా ప్రభావితమవుతుంది. ఫలితంగా పరిస్థితి ప్రాణాంతకంగా మారుతుంది. అయితే రక్తపోటు, మెదడు ప్రభావితం కానంతవరకూ వెంటిలేటర్ స్థితికి చేరుకున్న రోగులను కూడా తిరిగి పూర్తిగా కోలుకోగలిగేలా చేసే చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ రుగ్మతకు ప్రారంభంలోనే అడ్డుకట్ట వేయాలంటే లక్షణాలను గుర్తించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. చికిత్సతో రెండు నెలల్లోనే పూర్తిగా కోలుకోవచ్చు. చికిత్సలో భాగంగా యాంటీబాడీ ఇంజెక్షన్, ప్లాస్మా మార్పిడిని వైద్యులు అనుసరిస్తారు. ఈ చికిత్సతో శరీరంలోని యాంటీబాడీలను మార్పిడి చేసి, వ్యాధి తీవ్రతను తగ్గించడం వల్ల రోగి పూర్తిగా కోలుకునే అవకాశాలు పెరుగుతాయి.

డాక్టర్ మోహన్ కృష్ణ
సీనియర్ న్యూరాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్.



కచిడి 14 కిలోలు.. రూ.28 వేలు



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు జాలారి పాలేనికి చెందిన మత్స్యకారుని గేలానికి అత్యంత అరుదైన 'కచిడి' చేప చిక్కింది. పూడిమడక మత్స్యకారులకు సోమవారం వంజరం, రాయి చేపలు పడగా, జాలారిపాలేనికి చెందిన మత్స్యకారునికి 'కచిడి' చేప చిక్కింది. 14 కిలోల బరువు ఉన్న ఈ చేపను ఒక వ్యాపారి 28 వేలకు కొన్నారు. ఔషధ గుణాలుండడంతో ఈ చేపకు అంత ధర పలికిందని మత్స్యకారులు తెలిపారు.

- అచ్యుతాపురం, ఆంధ్రజ్యోతి

పంతానికిపోతే ఇరు రాష్ట్రాలకూ నష్టమే

- విభజన సమస్యలపై మొండి పట్టుదల వద్దు
- సామరస్యంగా పరిష్కరించుకోండి
- తెలుగు రాష్ట్రాల సీఎస్‌లకు తేల్చి చెప్పిన కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలను పరిష్కరించుకునే క్రమంలో ఇరువురూ మొండి పట్టుదలతో వ్యవహరించవద్దని రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ తేల్చిచెప్పింది. ఆస్తులు, ఇతర అంశాలపై పంతానికి పోతే ఇరువురికీ నష్టమేనని తెలిపింది. న్యాయస్థానాలను ఆశ్రయిస్తే పరిస్థితులు మరింత జటిలంగా మారి సమస్యల పరిష్కారానికి ఏళ్ల కొద్దీ సమయం పడుతుందని హెచ్చరించింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాష్ట్ర విభజనకు సంబంధించి పరిష్కృతం కాని అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినప్పటికీ కొన్ని ముఖ్యమైన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ క్రమంలో సోమవారం, కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్‌లో ఉన్న విభజన అంశాలను పరిష్కరించుకోవడంపై భేటీ జరిగింది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ భేటీలో విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తులు, అప్పుల పంపకాలపై ప్రధానంగా చర్చ జరిగినట్టు సమాచారం. దాదాపు రెండేళ్ల తర్వాత విభజన చట్టం అమలుపై హోంశాఖ లోతుగా సమీక్షించింది. విభజన చట్టం కింద కేంద్రం పంపిణీ చేయాల్సిన నిధులపైనా చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఆస్తులు, నిధుల పంపకాలలో సమస్యలపై ఇరు రాష్ట్రాలూ సానుకూల దృక్పథంతో ఉండాలని, సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలని హోంశాఖ అధికారులు హితవు పలికారు. రెండు రాష్ట్రాల్లో మౌలిక వసతుల ప్రాజెక్టులకు మద్దతు ఉంటుందని తెలిపారు. తమకే ఎక్కువ కావాలని పట్టుబడితే ఇద్దరికీ నష్టం వస్తుందని చెప్పినట్టు సమాచారం. 9, 10 షెడ్యూల్‌లోని సంస్థల విషయంలో న్యాయ సలహాలు తీసుకుని ముందుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. తదుపరి భేటీలో ఒక నిర్ణయం తీసుకుందామని హోంశాఖ కార్యదర్శి చెప్పినట్టు తెలిసింది.

స్నేహం ముసుగులో మోసం

- న్యూడ్ ఫొటోల పేరిట బెదిరించి రూ.2.54 కోట్లు వసూలు
- నిందితుడి అరెస్టు.. ఆస్తులు సీజ్

నిడదవోలు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్‌లో న్యూడ్ ఫొటోలు పెడతామని బెదిరించి.. ఒక యువతి నుంచి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని ఆస్తులను కూడా సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన యువతి హైదరాబాద్‌లో సాఫ్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. హాస్టల్‌లో ఆమెకు గుంటూరుకు చెందిన కాజా అనూషాదేవి పరిచయమైంది. అనూషాదేవి, ఆమె భర్త సాయికుమార్ బాధిత యువతిని డబ్బులు డిమాండ్ చేయసాగారు. డబ్బులివ్వకపోతే మార్ఫింగ్ చేసిన న్యూడ్ ఫొటోలు ఇంటర్నెట్‌లో పెడుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు తనతో పాటు బంధువుల ఖాతాల నుంచి పలు దఫాలుగా రూ.2,53,76,000 నగదును వారికి పంపించింది. దీనిపై ఆమె మూడు రోజులు కిందట నిడదవోలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తిలక్ నిందితుడు సాయికుమార్‌ను సోమవారం గుంటూరులో అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. అతని నుంచి రూ.1,81,45,000 విలువ గల నగదు, స్థిర, చరాస్తులను సీజ్ చేశారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

పట్టణ తలసరి ఆదాయం పెంచేందుకు కృషి

- జీవనోపాదుల కార్యాచరణ ప్రణాళిక: మెప్మా మిషన్ డైరెక్టర్

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో జీవనోపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా పేదల తలసరి ఆదాయం పెంచేందుకు మెప్మా ఆధ్వర్యంలో పట్టణ జీవనోపాదుల కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తోందని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంఎస్ఎంఈ భాగస్వామ్యంతో పట్టణ పేదలకు జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడం, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ల అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, ఎంఎస్ఎంఈ జాతీయ ఇన్‌స్టిట్యూట్స్ ఆధ్వర్యంలో సమావేశాలను ఏర్పాటు చేశామన్నారు.

2023-24 'జలకళ' బోర్ల తనిఖీలకు ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ జలకళ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 2023-24లో తవ్విన బోరుబావులపై తనిఖీలు నిర్వహించాలని వాటర్‌షెడ్ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. 2013 డిసెంబరు 1 నుంచి 2024 నవంబరు 30 వరకు తవ్విన బోరుబావులన్నీ తనిఖీలు చేయాలని సూచించారు. ఎన్నికల ముందు వైసీపీ కార్యకర్తలు బోరుబావులు తవ్వకుండానే బిల్లులు డ్రా చేసుకున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో 100శాతం తనిఖీలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.


పీ4 విధానంలో కడక్‌నాథ్ పౌల్ట్రీ ప్రాజెక్ట్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఊటుకూరులోని కడక్‌నాథ్ పౌల్ట్రీ ప్రాజెక్ట్‌ను పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్(పీ4)విధానంలో పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పెట్టుబడి లేకుండా ప్రాజెక్ట్ పునరుద్ధరణ, నిర్వహణపై ఆసక్తి ఉన్న ఏజెన్సీని ఆహ్వానించడానికి పశుసంవర్ధక శాఖకు అనుమతించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వానికి ఆర్థిక బాధ్యత లేకుండా కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న ప్రైవేట్ ఏజెన్సీ ఎంపిక బాధ్యతను పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు అప్పగించింది.

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి 4 బీబీఎస్ అవార్డులు

ముత్తుకూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులైన నెల్లూరులోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు ఫోరం ఆఫ్ బిహేవియర్ సేఫ్టీ నుంచి నాలుగు ప్రతిష్ఠాత్మక బీబీఎస్ అవార్డులు దక్కాయి. ముంబైలోని ఐఐఎంతో సంయుక్తంగా నిర్వహించిన 9వ వార్షిక జాతీయ బీబీఎస్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులు ప్రదానం చేశారు. బిహేవియర్ బేస్డ్ సేఫ్టీ విధానం అమలులో కృషికి కంపెనీ సీఈవో రాఘవ్ త్రివేదికి 'లీడర్‌షిప్ అవార్డు', కంపెనీ భద్రతా కార్యక్రమాలకుగాను ఆపరేషన్స్ ఏజీఎం నిజి జేమ్స్, ఆపరేషన్స్ సీనియర్ ఇంజనీర్ వెంకటరామ్‌జీ ఉత్తమ బీబీఎస్ అబ్జర్వర్ అవార్డులను అందుకున్నారు. వరుసగా రెండో ఏడాది అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని త్రివేది అన్నారు.

ప్రాజెక్టు	గరిష్ఠ సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలు)	లోటు (శాతం)
శ్రీశైలం	215.81	86.29	39.98
నాగార్జునసాగర్	312.05	210.88	67.58
పులిచింతల	45.77	38.22	
నదులు			
గోదావరి బేసిన్	5.9	4.24	
కృష్ణా బేసిన్	589.67	347.95	
పెన్నా పరివాహకం	239.59	163	



పడిపోతున్న ప్రాజెక్టు నిల్వలు

- వేసవికి ముందే తగ్గుతున్న నీటిమట్టాలు
- శ్రీశైలం జలాశయంలో 40 శాతం, నాగార్జున సాగర్‌లో 68శాతం లోటు
- నదుల పరివాహకంలోనూ ఇదే స్థితి

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంకా వేసవి మొదలు కాకముందే రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల నీటిమట్టాలు పడిపోతున్నాయి. శ్రీశైలం .. నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు అడుగంటాయి. గత ఏడాది ఎగువ నుంచి భారీగా వచ్చిన వరదతో ప్రధాన జలాశయాలతోపాటు చిన్న మధ్యతరహా ప్రాజెక్టులూ, చెరువులూ నిండుగా కనిపించాయి. మొత్తం 993.50 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదయింది. రాష్ట్రంలోని 108 చిన్న, మధ్య, భారీ రిజర్వాయర్లలో 623.56 టీఎంసీల నీటినిల్వలు కనిపించాయి. అలాంటిది ఈ నెల మొదటివారానికే జలాశయాల్లో పరిస్థితి తారుమారు అయింది. ఇక.. నదుల పరీవాహక ప్రాంతాల్లో 983.63 టీఎంసీలకుగాను 623.56 (63.4శాతం) నిల్వలే ఉన్నాయి. మరో 360 టీఎంసీల లోటు కనిపిస్తోంది. దీంతో రానున్న వేసవిని తట్టుకోవడం ఎట్లా అనే ఆందోళన పెరుగుతోంది. రాష్ట్రంలో ఈ ఏడాది వేసవి తీవ్రత అత్యధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా పడిపోతుండటంపై జల వనరుల శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఆధారాలుంటే అందజేయండి

తిరుపతి తొక్కిసలాటపై ప్రజలకు విచారణ కమిషన్ పిలుపు

- కలెక్టర్, సీవీఎస్వో, డీఆర్వోలను ప్రశ్నించిన కమిషన్ చైర్మన్
- ముగిసిన తొలి దశ విచారణ
- రెండోదశ విచారణకు 52 మంది బాధితులు?
- సస్పెండ్, బదిలీ అయిన అధికారుల విచారణ మూడో దశలో..



కమిషన్ ఎదుట హాజరై తిరిగి వెళ్తున్న తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్..



టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వో మణికంఠ చందోలు, వీజీవో సదాలక్ష్మి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైకుంఠద్వార దర్శనం టికెట్ల కోసం తొక్కిసలాట జరిగిన ఘటనపై న్యాయవిచారణ తొలిదశ ముగిసింది. ప్రభుత్వం నియమించిన కమిషన్ మూడవ రోజైన సోమవారం జిల్లాలోని కీలక అధికారులను విచారించింది. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఇన్‌చార్జి చీఫ్ విజిలెన్స్-సెక్యూరిటీ అధికారి(సీవీఎస్వో) మణికంఠ చందోలు(చిత్తూరు ఎస్పీ), డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులను కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి వేర్వేరుగా విచారించారు. ఘటన జరిగిన తీరుతోపాటు, టీటీడీ యంత్రాంగం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారా? అని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను గంట పాటు ప్రశ్నించినట్టు తెలిసింది. కలెక్టర్ రాతపూర్వకంగా పూర్తిస్థాయి నివేదికను అందజేశారు. టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వో మణికంఠ చందోలు రికార్డు సమర్పణకు కొంత గడువు కోరినట్టు తెలిసింది. ఆయనతో పాటు తిరుపతి వీజీవో సదాలక్ష్మి కూడా కమిషన్ ఎదుట హాజరయ్యారు. పోలీసు, టీటీడీ విజిలెన్సు విభాగం రికార్డుల సమర్పణకు గడువు కోరాయి. దీంతో తొలి దశ విచారణ ముగించుకుని కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణ విజయవాడకు బయలుదేరి వెళ్లారు. రెండో దశ విచారణకు ఈ నెల 20వ తేదీ తరువాత తిరిగి తిరుపతికి రానున్నట్లు సమాచారం. తొక్కిసలాటలో గాయపడిన 46 మంది, మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు సంబంధించిన వారిని రెండోదశలో కమిషన్ విచారించనుంది. ఈ మేరకు విచారణకు హాజరు కావాలని వారందరికీ నోటీసులు పంపారు. తొక్కిసలాట నేపథ్యంలో సస్పెండ్, బదిలీ అయిన అధికారులు, ఇతర సిబ్బందిని మూడవ దశలో కమిషన్ విచారించనున్నట్లు సమాచారం. తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఏమైనా సమాచారం, ఆధారాలు ఉంటే తమకు ఆ సమాచారంతోపాటు అవసరమైన పత్రాలను అందజేయాలని ప్రజలకు న్యాయవిచారణ కమిషన్ పిలుపునిచ్చింది. 20రోజుల్లోపు వాంగ్మూలాన్ని ప్రమాణబద్ధమైన అఫిడవిట్‌తో కలిపి సమర్పించాలని పేర్కొంది. ఆ తరువాత ఎటువంటి పత్రాలు, సాక్ష్యాలు స్వీకరించబోమని తెలిపింది. వీటిని ఈ నెల 24వ తేదీ వరకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ బీ-బ్లాక్‌లోని న్యాయవిచారణ కమిషన్ చాంబర్-413లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల లోపు సమర్పించవచ్చని పేర్కొంది.



మందు కొట్టు... థాయ్‌లాండ్ వెళ్లు

'మద్యం తాగండి.. థాయ్‌లాండ్ వెళ్లండి' అంటూ కాకినాడలోని వినాయక వైన్స్ బంపరాఫర్ ప్రకటించింది. తమ షాపులో మద్యం కొన్నవారికి టోకెన్ ఇస్తామని, వాటిని లాటరీ తీస్తామని షాపు యజమాని చెప్పారు. లాటరీలో మొదటి బహుమతిగా థాయ్‌లాండ్ ట్రిప్.. ఆపై కారు, బైక్, సెల్‌ఫోన్ వంటి బహుమతులు కూడా ఇస్తామని ప్రకటించారు. - కలెక్టరేట్ కాకినాడ, ఆంధ్రజ్యోతి



స్టీల్‌ప్లాంటు మెయిన్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది (ఫైల్)

ఖర్చు తగ్గింపు పేరుతో విశాఖ ఉక్కుకు 'భద్రత' కుదింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో ఉత్పత్తి వ్యయాల తగ్గింపు పేరుతో సిబ్బందిని కుదిస్తున్నారు. ఇప్పటికే ప్రకటించిన స్వచ్ఛంద పదవీ విరమణ పథకానికి 1,594 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఇప్పుడు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) నుంచి 438 మందిని హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు బదిలీ చేసేశారు. వారి స్థానంలో ఎవరినీ నియమించరు. అయితే వారి స్థానంలో హోం గార్డులను పెడతామని చెప్పడం ఖర్చు తగ్గింపులా లేదని, ఇందులో ఏదో మతలబు ఉందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు అత్యాధునిక అగ్ని మాపక శకటాలు, పరికరాలు కలిగిన ఉక్కు అగ్నిమాపక విభాగాన్ని ప్రైవేటుకు అప్పగించాలని స్టీల్ ప్లాంటు యాజమాన్యం నిర్ణయించింది. ఆమేరకు డిసెంబరు నెలాఖరులో ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీ చేసింది. దీనిపై అప్పుడే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

పెరుగుతున్న ఎండ

- తుని, ఆదిలాబాద్‌లలో 37.3 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగు నుంచి ఆరు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలో అత్యధికంగా తుని, ఆదిలాబాద్‌లలో 37.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.

ఊరి బడులకు కూటమి ప్రభుత్వం ఊపిరిపోస్తోంది. ప్రైవేటు స్కూళ్ల పోటీ, జగన్ జమానాలో తీసుకున్న అసమర్థ నిర్ణయాలతో కునారిల్లిన పల్లెల్లోని ప్రాథమిక పాఠశాలలకు తిరిగి పునరుజ్జీవం పోసే దిశగా అడుగులు వేస్తోంది. 'మోడల్ ప్రైమరీ స్కూళ్ల'కు శ్రీకారం చుడుతోంది. ప్రతి తరగతికీ ఓ ఉపాధ్యాయుడు ఉండేలా, విద్యార్థులను ప్రాథమిక దశ నుంచి తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. విద్యార్థులను ప్రాథమిక దశ నుంచే బలోపేతం చేయనుంది. ఈ స్కూళ్లు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభంకానున్నాయి.



ఊరు బడికి ఊపిరి!

- 'మోడల్ ప్రైమరీ స్కూల్'కు శ్రీకారం
- ప్రతి తరగతికీ ఒక టీచర్‌తో బోధన
- ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు
- పంచాయతీ, వార్డుల్లో మోడల్ స్కూల్
- ప్రైవేటుకు దీటుగా మార్చేలా ప్రణాళిక
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- జగన్ హయాంలో కునారిల్లిన స్కూళ్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెండు దశాబ్దాలకు ముందు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు కళకళలాడుతుండేవి. కాలక్రమంలో 'ఊరి బడి' కళను కోల్పోయింది. ప్రైవేటు బడులు పెరగడం, ప్రజల్లోనూ ఆదిశగా మోజు పెరగడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ప్రాభవం కోల్పోయాయి. ఇప్పుడైతే ఊర్లో ప్రభుత్వ బడి ఉందా? అని అనుమానం కలిగే స్థాయిలో సర్కారు ప్రాథమిక పాఠశాలలు కునారిల్లుతున్నాయి. మండలానికి ఎక్కడైనా ఒకట్రెండు పాఠశాలలు, పట్టణాల్లో ప్రాథమిక బడులను మినహాయిస్తే మిగిలిన బడులు ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండటంతో ప్రభుత్వాలు కూడా టీచర్ల సంఖ్యను తగ్గిస్తూ వచ్చాయి. ప్రాథమిక పాఠశాలల్లో టీచర్లు అంతంత మాత్రంగానే ఉండటంతో ఎవరైనా తల్లిదండ్రులు ప్రభుత్వ బడిలో పిల్లల్ని చేర్పించాలనే ఆలోచన ఉన్నా.. వెనక్కి తగ్గుతున్నారు. దూరాభారం అయినా ప్రభుత్వ బడులకు పిల్లల్ని పంపుతున్నారు. కొన్ని చోట్ల ప్రైవేటు బడులకు కాకపోయినా టీచర్లు ఎక్కువ ఉన్న పక్క ఊళ్లలోని సర్కారీ స్కూళ్లకు పంపుతున్నారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ!

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో 32,596 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వాటిలో 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలలు 17 శాతమే. అవి కూడా ఎక్కువగా పట్టణాల్లోనే ఉన్నాయి. మిగిలిన 83 శాతం బడులు 'ఉన్నాయంటే ఉన్నాయి' అన్నట్టుగానే నడుస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించిన కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, ఊరి బడికి మళ్లీ కళ తేవాలని సంకల్పించింది. గత వైసీపీ ప్రభుత్వం తరగతుల విలీనం పేరుతో దెబ్బతీసిన ప్రాథమిక విద్యను తిరిగి పట్టాలెక్కించేందుకు, మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రాథమిక బడులను సమూలంగా మార్చేయాలనే విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూల్ పెట్టాలని నిర్ణయించింది. ఈ బడిలో ప్రీ-ప్రైమరీ 1-5 తరగతులు ఉంటాయి. ప్రతి తరగతికీ ఒక టీచర్ ఉంటారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో చాలావరకు 1-5 తరగతులకు ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌లో తరగతికి ఒక టీచర్‌ను ఇవ్వడం వల్ల బోధన మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. టీచర్ల సంఖ్య పెరిగితే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుందని తలపోస్తోంది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి మోడల్ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది.

ఎంపికే ప్రధాన సవాలు

మోడల్ ప్రైమరీ పాఠశాల విధానం మంచిదే అయినా ఏ ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా గుర్తించాలనేది ప్రధాన సవాలుగా మారనుంది. రాష్ట్రంలోని చాలా పంచాయతీల్లో రెండు నుంచి మూడు ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో కొన్ని ఎస్సీ, ఎస్టీల నివాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. తమ ఇంటి వద్ద ఉండే బడి మోడల్ స్కూల్‌గా ఉండాలని సాధారణంగా తల్లిదండ్రులు కోరుకుంటారు. దీంతో ఊరికి మధ్యస్థంగా, అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉండే బడిని మోడల్ ప్రైమరీ స్కూల్‌గా ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఎంపిక బాధ్యతను స్థానికంగా ఉండే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకే అప్పగిస్తున్నారు. గ్రామంలోని పరిస్థితులు, అవసరాల, వసతుల ఆధారంగా కమిటీలే నిర్ణయిస్తాయి.

దశలవారీగా మార్పు

ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూల్ పెట్టాలనేది ప్రభుత్వ లక్ష్యం అయినప్పటికీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి పంచాయతీలో మోడల్ స్కూల్ వచ్చే అవకాశం లేదు. విద్యార్థుల సంఖ్య మరీ తక్కువగా ఉంటే అక్కడ మోడల్ స్కూల్ ప్రారంభించలేరు. తొలుత విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉన్న చోట్ల మోడల్ స్కూళ్లు పెట్టి.. దశలవారీగా ఏటా కొన్నింటిని మోడల్‌గా మారుస్తారు. అంతిమంగా 13 వేల పంచాయతీల్లో 13 వేల మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యం. మోడల్ స్కూళ్లు పెట్టినా బేసిక్ ప్రైమరీ పాఠశాలలను యథావిధిగా కొనసాగించనున్నారు.

ఆ తరగతులు వెనక్కి

వైసీపీ ప్రభుత్వం జీవో 117ను తీసుకొచ్చి ప్రాథమిక విద్యను చావుదెబ్బ కొట్టింది. ప్రాథమిక పాఠశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ఉన్న చోట్ల 3-5 తరగతులను తీసుకెళ్లి వాటిలో విలీనం చేశారు. అలా 4,731 ప్రాథమిక పాఠశాలల్లో 3-5 తరగతులను తీసేసి, సమీపంలోని 3,348 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కలిపేశారు. దీంతో 2,43,540 మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. ఇంటికి దగ్గర్లోని బడిని కాదని దూరంలో ఉన్న బడులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. అలా విలీనానికి గురైన తరగతులను వెనక్కి తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

కనీసం 60 మంది

కనీసం 60 మంది విద్యార్థులుంటే వాటిని మోడల్ ప్రైమరీ పాఠశాలగా మారుస్తారు. అవసరం అనిపిస్తే కొన్ని చోట్ల ఆ సంఖ్య లేకపోయినా పెడతారు. గదులు సరిపోకపోతే సమీప ప్రభుత్వ బడుల్లోని భవనాలను వాడుకుంటారు. వేర్వేరు భవనాల్లో ఉన్నా దానిని ఒకే మోడల్ పాఠశాలగా పరిగణిస్తారు. విద్యార్థుల సంఖ్య 120 దాటితే ప్రధానోపాధ్యాయుడి పోస్టును మంజూరు చేస్తారు. 150 దాటిన తర్వాత ప్రతి 30 మంది విద్యార్థులకు మరో టీచర్‌ను కేటాయిస్తారు.



డయాఫ్రం వాల్ పనులపై నిపుణుల సంతృప్తి

- 2,700 కోట్ల నిధుల కోసం జల వనరుల శాఖ ఉరుకులు
- ఢిల్లీ చేరిన పోలవరం సీఈ నరసింహమూర్తి
- నేటి మధ్యాహ్నానికి డబ్బు విడుదలపై స్పష్టత!

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ పనులను చేపడుతూనే.. నిధుల కోసం జల వనరుల శాఖ ఉరుకులు, పరుగులు పెడుతోంది. అమెరికా నిపుణులు డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిస్కో ఈ నెల 1న ప్రాజెక్టు క్షేత్రానికి చేరుకున్నారు. వాల్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. సాంకేతికంగా తామిచ్చిన సూచనలకు అనుగుణంగా టీ-16 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమం వాడకం దగ్గర నుంచి కాలమ్స్ వరకూ సవ్యంగా నిర్మిస్తున్నారో లేదో గమనించారు. నిర్మాణ పనులపై 95 శాతం వరకూ సంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని పనులపై సందేహాలు లేవనెత్తడంతో ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి కూలంకషంగా జవాబులు ఇవ్వనున్నారు. కాగా.. గ్యాప్-1లో మోటార్లతో నీటిని తోడేటప్పుడు నీటితో పాటు ఇసుక, మట్టి కూడా బురద రూపంలో పైకి వస్తున్నాయని.. దీనివల్ల మట్టి గట్టిదనం దెబ్బతిని నిర్మాణాలకు ముప్పు ఏర్పడవచ్చని నిపుణులు విశ్లేషించారు. ఇలా జరక్కుండా 'బట్రెస్ డ్యాం' విధానంలో మట్టి పటిష్ఠత కాపాడాలని సూచించారు. దీనిపై పోలవరం ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించారు. ఇంకోవైపు.. గత ఏడాది కేటాయించిన నిధుల్లో విడుదల చేయాల్సిన రూ.2,700 కోట్లను వెంటనే మంజూరు చేయాలని కేంద్ర జలశక్తి శాఖను కోరేందుకు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి సోమవారం ఢిల్లీ చేరుకున్నారు. జలశక్తి కార్యదర్శి దేబర్షి ముఖర్జీతో సమావేశం కానున్నారు. పోలవరం ప్రాజెక్టుకు 2024-25లో రూ.5,500 కోట్లు ఇవ్వాలని నిర్ణయించిన ఆ శాఖ.. ఇప్పటివరకు రూ.2,800 కోట్లే ఇచ్చింది. ఇవి ఖర్చయ్యాక మిగిలిన రూ.2,700 కోట్లు ఇస్తామని చెప్పింది. ఆ నిధులు వ్యయమైనందున మిగతా సొమ్ము మంజూరు చేయాలని దేబర్షిని నరసింహమూర్తి కోరనున్నారు. జలశక్తి శాఖ కూడా సుముఖంగా ఉన్నందున .. మంగళవారం మధ్యాహ్నానికి నిధుల విడుదలపై స్పష్టత వస్తుందని జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇంజనీరింగ్ కాలేజీల సంఘం ప్రతినిధులు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మరో రూ.216 కోట్లు

రెండు, మూడు రోజుల్లోనే విడుదల: లోకేశ్

- ఇంజనీరింగ్ కాలేజీలతో త్వరలో వర్క్‌షాప్
- ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు పదేళ్లు
- యాజమాన్యాల సమస్యలు పరిష్కరిస్తామని హామీ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కాలేజీల్లో నాణ్యత పెంచడంపై యాజమాన్యాలు దృష్టి సారించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు మరో రూ.216 కోట్లను రెండు మూడు రోజుల్లోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలపై లోకేశ్ స్పందిస్తూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రాథమికస్థాయి నుంచే పరివర్తన తేవాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. ఇంటర్ విద్యపై పదేళ్లుగా ఎలాంటి సంస్కరణలు లేవని, తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని విద్యా సంస్థల్లో స్థూల హాజరు నిష్పత్తి(జీఈఆర్) పెరగాలన్నారు. సంస్కరణలు తీసుకొచ్చే క్రమంలో ఏవైనా పొరపాట్లు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తమ ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, చర్చలు, సంప్రదింపుల ద్వారానే విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఈ ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ తొలివిడతలో రూ.788 కోట్లకుగాను ఇప్పటికే రూ.571 కోట్లు విడుదల చేశామని, రెండు మూడు రోజుల్లో మిగిలిన రూ.216 కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో చేపట్టే ప్లేస్‌మెంట్స్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించి ఇంజనీరింగ్ విద్య నాణ్యతను పెంచేందుకు అందరి అభిప్రాయాలు తీసుకుంటామన్నారు. ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజులను క్యాలెండర్ ప్రకారం సకాలంలో విడుదల చేయాలని కోరారు. ప్రస్తుత ఫీజులను సవరించాలని విన్నవించారు. సమావేశంలో ఇంజనీరింగ్ కాలేజీల సంఘం ప్రతినిధులు వాసిరెడ్డి విద్యాసాగర్, కోయ సుబ్బారావు, జి. రాజలింగ్, కె. రామ్మోహన్‌రావు, కేవీ సుబ్బారెడ్డి, వి. జయచంద్రారెడ్డి, ఆర్. వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దాం

ప్రైవేటు పాఠశాలలకు ఇచ్చే గుర్తింపు గడువును పదేళ్లకు పెంచుతామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. అందరం కలిసి విద్యా వ్యవస్థను బలోపేతం చేద్దామని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు కూడా ప్రతిభా పురస్కారాలు ఇవ్వాలని యాజమాన్యాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కాగా విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా ఉన్నత విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని మంత్రి లోకేశ్ చెప్పారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల ప్రతినిధులతో సోమవారం సమావేశమైన ఆయన.. గత ప్రభుత్వ నిర్ణయాలను గుడ్డిగా వ్యతిరేకించడం తమ అభిమతం కాదన్నారు. ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు ఐదేళ్లకు ఒకేసారి అఫిలియేషన్ జారీ చేస్తామన్నారు. అఫిలియేషన్ ఫీజు ఒక్కో యూనివర్సిటీకి ఒక్కోలా ఉందని, రాష్ట్రమంతా ఒకే అఫిలియేషన్ ఫీజు ఉండేలా చూడాలని యాజమాన్యాల ప్రతినిధులు కోరారు. సమావేశంలో డిగ్రీ కాలేజీల ప్రతినిధులు బట్టు శ్యాంప్రసాద్, మధుబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రైవేటు ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశమైన లోకేశ్ 'రాబోయే ఐదేళ్లలో 'ఓం క్యాప్' ద్వారా 5 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనేది మా లక్ష్యం. టీడీపీ కార్యాలయంలో శిక్షణ ఇప్పించడం వల్ల 150 మందికి అమెరికాలో ఉద్యోగాలు వచ్చాయి' అని అన్నారు.

'ఆంధ్రజ్యోతి'పై పరువునష్టం కేసులో న్యాయవాదిగా సుబ్రమణ్యస్వామి తొలగింపు

- స్టాండింగ్ కౌన్సిల్‌కు కేసు అప్పగిస్తూ టీటీడీ నిర్ణయం
- స్వామి కోసం గత ప్రభుత్వం ఆరాటం.. భారీగా ఫీజు చెల్లింపు
- ఆర్థిక భారాన్ని తప్పించుకోవడానికి స్వామిని తప్పించిన టీటీడీ

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికపై టీటీడీ దాఖలు చేసిన పరువునష్టం కేసులో టీటీడీ తరపు న్యాయవాదిగా వ్యవహరిస్తున్న మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామిని తొలగించారు. కేసును టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్‌కు అప్పగించారు. దీంతో టీటీడీ తరపున స్టాండింగ్ కౌన్సిల్ జయచంద్ర తాజాగా తిరుపతి కోర్టులో వకాల్తా దాఖలు చేశారు. వివరాలు ఇవీ.. టీటీడీ ఆన్‌లైన్ పంచాంగంలో ఏసయ్య అన్న పదం పేర్కొని ఉండటాన్ని 2019 నవంబరులో పలువురు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పరిశీలించి ధ్రువీకరించుకున్న మీదట ఆంధ్రజ్యోతి దానిపై వార్త ప్రచురించింది. ఆంధ్రజ్యోతితో పాటు పలు ఇతర న్యూస్ చానెళ్లలో కూడా ఆ వార్త ప్రముఖంగా ప్రసారమైంది. అయితే అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో టీటీడీ 2021లో ఆంధ్రజ్యోతిపై మాత్రమే రూ. వంద కోట్లకు పరువు నష్టం దావా వేసింది. తిరుపతిలోని పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో ఓఎస్ నంబరు 44-2021 పేరిట నమోదైన ఆ కేసులో న్యాయవాదిగా బీజేపీ నేత, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామిని టీటీడీ నియమించింది. ఆయన న్యాయవాది కాకపోయినా అడ్వొకేట్ యాక్ట్ సెక్షన్ 32ను ఆధారంగా చేసుకుని ఆ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రజ్యోతి తరఫున పౌరహక్కుల నాయకుడు, న్యాయవాది క్రాంతి చైతన్య వాదనలు వినిపిస్తున్నారు. వాయిదాలకు సుబ్రమణ్యస్వామి తన శిష్యులతో కలిసి ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి వచ్చేవారు. కేసు వాయిదా పడగానే కోర్టు బయటే ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేసేవారు.

టీటీడీ తీరుపై గతంలోనే విమర్శలు

టీటీడీకి బలమైన న్యాయ విభాగం ఉంది. ఫీజు చెల్లించి నిపుణులైన న్యాయవాదులను నియమించుకునే అవకాశముంది. అయినా న్యాయవాది కాని సుబ్రమణ్యస్వామిని నియమించుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అదే సమయంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల కక్షసాధింపు వైఖరిని కూడా ఈ నియామకం బయటపెట్టింది. గతంలో తమిళనాడు మాజీ సీఎం జయలలిత వంటి వారిపై కేసులు వేసి ఇబ్బంది పెట్టిన నేపథ్యం సుబ్రమణ్యస్వామికి ఉన్నందునే వైసీపీ ప్రభుత్వ పెద్దలు ఆంధ్రజ్యోతి యాజమాన్యాన్ని ఇబ్బంది పెట్టడానికి ఆయన్ను ఎంపిక చేసుకున్నారనే ప్రచారం జరిగింది. కాగా గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో టీటీడీలో ప్రక్షాళన మొదలైంది. అందులో భాగంగా స్వామి నియామకంపై టీటీడీ అధికారులు పునరాలోచన చేసినట్టు సమాచారం. ఆయనకు భారీ ఫీజు చెల్లించాల్సి ఉండడం వల్ల ఆర్థిక భారం పడుతుందన్న ఆలోచనతో ఆయన నియామకాన్ని రద్దు చేసినట్టు తెలుస్తోంది.

మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం... (ఉత్తరాంధ్ర) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి, గుంటూరు- కృష్ణా, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉప సంహరణకు తుది గడువు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపడతారు. మార్చి 8తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది.

ఇంకా శ్రమించాలి!



ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు,
పక్కన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఇతర ఎంపీలు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సమస్యలు పరిష్కారమవుతున్నాయని, నిధులు మంజూరయ్యాయని చెప్పారు. రాజధాని అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ, రైల్వే జోన్, పారిశ్రామిక పార్కులకు నిధులు లభిస్తున్నాయన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఏపీ పేరు ప్రస్తావించకపోయినప్పటికీ... కేటాయింపులపరంగా రాష్ట్రానికి మేలు జరిగిందని ఆయన చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో ఎన్డీఏ తరఫున ప్రచారం చేసేందుకు ఆదివారం రాజధానికి చేరుకున్న చంద్రబాబు సోమవారం ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "బడ్జెట్ గురించి కొందరు సంకుచితంగా మాట్లాడుతున్నారు. ఏపీకి (కేంద్ర బడ్జెట్‌లో) ఏమేమొచ్చాయని అడుగుతున్నారు. మాకు అన్నీ లభించాయని అని వారికి చెప్పాను. మనకు శక్తి ఉండి, మన పరిపాలన బాగుంటే నంబర్ వన్‌గా మనం నిలిచేలా కేంద్రం చేయూత ఉంది" అని వివరించారు. ఇండియా కూటమి- ఎన్డీఏ రాజకీయాల గురించి నేను మాట్లాడదలుచుకోలేదన్నారు. "నాకు అభివృద్ధి, దేశ భవిష్యత్ ముఖ్యం. సరైన అభివృద్ధే సరైన రాజకీయం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆప్ తాయిలాల గురించి పరోక్షంగా ప్రస్తావిస్తూ....దేశంలో సంపద పెంచకుండా పంచడం సరైంది కాదని, దీనిపై చర్చ జరగాలన్నారు. సంపద సృష్టించకుండా దానిని పంచే హక్కు రాజకీయ నేతలకు ఎక్కడిది అని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీది వైఫల్య నమూనా అని ఆయన వ్యాఖ్యానించారు. జీఎస్టీని సరళతరం చేయాలని, అందరూ సులభంగా చెల్లించేలా ఉండాలని ఆయన సూచించారు. సంపదను కొందరు సృష్టిస్తే కొందరు వచ్చి నాశనం చేస్తారంటూ... వైసీపీ గురించి పరోక్షంగా విమర్శించారు. అభివృద్ధిని చౌకబారు అవసరాల కోసం పట్టాలు తప్పించడం సరికాదనీ, ఎవరు అధికారంలో ఉన్నా అభివృద్ధిని కొనసాగాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

● 15 శాతం వృద్ధే లక్ష్యం..

"కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో నాకు పూర్తి ఏకీభావముంది. స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధి రేటుకు తాను సూచించిన పదిసూత్రాలు బడ్జెట్‌లో ఉన్నాయి. స్వర్ణాంధ్రప్రదేశ్ అభివృద్ధి వికసిత్ భారత్‌తో ముడిపడి ఉంది. ఇందుకు నేను సంతోషంగా ఉన్నాను. ఈ ఏడాది 12.94 శాతం అభివృద్ధిని చూపించాం. వచ్చే ఏడాది 15 శాతం సాధించే దిశగా కృషి చేస్తాం."

● ఏఐ.. గ్రీన్ ఎనర్జీలో భారత్ భేష్

"గత11 సంవత్సరాల తన పాలనలో భారతీయులు గర్వపడేలా నరేంద్రమోదీ పని చేశారు. మోదీ నాయకత్వంలో బ్రాండ్ ఇండియా బలంగా ఉంది. భారతీయులందరికీ ఇది అత్యంత స్ఫూర్తిదాయకమైన సమయం. ప్రపంచమంతా భారత దేశంవైపే చూస్తోంది. ఇటీవల దావోస్ లో పర్యటించినప్పుడు ప్రపంచ దేశాలన్నీ భారతదేశం పట్ల ఆసక్తి ప్రదర్శించడాన్ని గమనించాను. 1995లో నేను ప్రారంభించిన ఐటీ విప్లవం ఇప్పుడు ఏఐ విప్లవం దాకా పయనించింది. భారత దేశం రెండింటిలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇది ప్రపంచమంతటికీ తెలుసు. ఆరోజు నేను ఐటీ విప్ల వంలో పాత్ర పోషించాను. దాని శక్తి ఇప్పుడు అంతటా కనపడుతోంది. ఇప్పుడు ఏఐ కోసం పని చేస్తున్నాను. ప్రపంచంలో భారతీయులను ఇతర దేశస్థుల కంటే ఎక్కువగా ఆమోదిస్తున్నారు. ఏఐ తర్వాత హరిత ఇంధనం (గ్రీన్ ఎనర్జీ) పై ప్రపంచం దృష్టి కేంద్రీకృతమైంది. వీటిలో భారత్ బలంగా ఉంది."

సామాజిక సేవకు పౌర పురస్కారాలు

"విద్యుత్ రంగంలో తొలుత రెగ్యులేటరీ కమిషన్ స్థాపించి సంస్కరణలు ప్రవేశపెట్టింది నేనే. ఇప్పుడు అన్ని విభాగాల్లో రెగ్యులేటరీ కమిషన్లు వచ్చాయి. ఆర్థిక సంస్కరణల వల్ల ప్రజల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వచ్చింది. సంక్షేమం వాస్తవం. దాన్ని కాదనలేం. అయితే సంపద చివరి వరకు ఎలా పంచాలన్నదే నా ధ్యేయం. అత్యంత సంపన్నులైనవారు పేదల్లో పదిశాతాన్ని దత్తత తీసుకుని చేయూతనివ్వాలి. దీనిపై ముందు చర్చించాలి. అవసరమైతే చట్టం చేయాలి. ప్రజల పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరించినవారికి పద్మశ్రీ, పద్మభూషణ్, భారతరత్న లాంటి అవార్డులివ్వాలి. సూపర్ రిచ్ ట్యాక్స్ గురించి కూడా చర్చించవచ్చు."

● కమ్యూనిజం లేదు.. ఉన్నది టూరిజమే..

"తెలంగాణలో కుల సర్వే జరపడం తప్పేమీ కాదు. కులం, ప్రాంతం, మతం అనేవి వాస్తవికతలు. వాటిని గౌరవించి అందరి అభివృద్ధి కోసం కృషి చేయాలి. సిద్ధాంతం గురించి మాట్లాడడం వ్యర్థం. కమ్యూనిజం అనేది లేదని టూరిజం ఒక్కటే ఉన్నదని గతంలోనే చెప్పాను. చైనా రాజకీయంగా కమ్యూనిస్టు దేశమైనా, అభివృద్ధి, ఆర్థిక వ్యవహారాల్లో కమ్యూనిజాన్ని ఆ దేశం అవలంబించడం లేదు."

● ఢిల్లీది వైఫల్య నమూనా

"గత పదేళ్లలో ఆమ్ ఆద్మీ పార్టీ హయాంలో ఢిల్లీలో పాలన పూర్తిగా విఫలమైంది. ఢిల్లీలో మద్యం కుంభకోణం నా దృష్టిలో అన్నిటికన్నా చాలా ఘోరమైంది. ఢిల్లీది వైఫల్య నమూనా. 1995లో నేను హైదరాబాద్ నమూనాను ఇచ్చాను. హైదరాబాద్ వల్లే తెలంగాణ తలసరి ఆదాయం పెరిగింది. సంపద సృష్టించకుండా ఎలా పంచుతారు? దీనిపై చర్చించాలి."

స్కీమ్‌లపై నిరంతర సర్వే

పథకాల అమలులో అలసత్వం సహించను

సీఎం చంద్రబాబు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల అమలులో ఎక్కడా అలసత్వం, అవినీతి, నిర్లక్ష్యం కనిపించేందుకు వీల్లేదని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు సక్రమంగా ఉన్నదా లేదా అనేది నిరంతరం ప్రజాభిప్రాయం సేకరిస్తుండాలనీ, వారిచ్చే సమాచారం ఆధారంగా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల నిర్వహణపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారంపై చంద్రబాబు సోమవారం సచివాలయంలో సమీక్షించారు. పింఛన్ల పంపిణీ, అన్నక్యాంటీన్లు, ఎరువుల పంపిణీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు, ఆర్టీసీ సర్వీసులు వంటి అంశాలపై ప్రజల నుంచి ఐవీఆర్ఎస్, క్యూఆర్‌కోడ్ స్కానింగ్ సహా పలు మార్గాల్లో సమాచారం సేకరించారు. దీనిపై రియల్ టైమ్ గవర్నెన్స్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. కొన్ని ప్రభుత్వ పథకాల అమలులో అక్కడక్కడా ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదులు, అభిప్రాయాలను పరిశీలించి పనితీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పంట సాగు విషయంలో రైతులకు కొత్త సాగు విధానాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. డ్రోన్ సాయంతో పురుగు మందులు, రసాయనాల పిచికారి వల్ల రైతులు వ్యయాన్ని తగ్గించుకోవచ్చునేది వారికి తెలపాలన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీని ఉదయం ఏడు గంటలకు ప్రారంభించి సాయంత్రం ఆరు లోపే పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు.

గురజాడ స్ఫూర్తితో నిర్మల బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి కొందరు సంకుచితంగా మాట్లాడుతున్నారని, అందులో వాస్తవం లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటూ తెలుగు కవి గురజాడ అప్పారావు కవితతో తన ప్రసంగాన్ని నిర్మలా సీతారామన్ ప్రారంభించారు. గురజాడ స్ఫూర్తిని కేంద్ర బడ్జెట్ ప్రతిబింబించింది. మనుషులకు సాధికారికత కల్పించడమే బడ్జెట్ లక్ష్యం. మధ్యతరగతి దేశంలో చాలా ముఖ్యమైంది. అత్యధిక ప్రజలు పేదరికం నుంచి బయటపడి మధ్యతరగతిలోకి ప్రవేశిస్తున్నందువల్ల 12 లక్షల వరకు ఆదాయపు పన్ను రాయితీని వారికి కల్పించడం సరైన నిర్ణయమే"నని చంద్రబాబు అన్నారు.

ఉదారంగా నిధులివ్వండి

ఫైనాన్స్ కమిషన్‌కు చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ పాలనలో ఏపీ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ దిలీప్ పనగారియాకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఘోరంగా ఉన్నదో నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారని, ఈ దృష్ట్యా నిధుల కేటాయింపు విషయంలో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఏపీకి గత వైసీపీ పాలనలో మరింత నష్టం కలిగిందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పనగారియాకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

ఢిల్లీలో ఆప్‌ది ముగిసిన అధ్యాయం

చంద్రబాబుకు కృతజ్ఞతలు: విష్ణువర్ధన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీది ఇక ముగిసిన అధ్యాయమని బీజేపీ ఏపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం, ఢిల్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం చంద్రబాబును ఆయన అధికారిక నివాసం వన్ జన్‌పథ్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏపీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'గత ఎన్నికల్లో ఆప్ ఇచ్చిన హామీలు అమలు చేయలేక విఫలమైంది. ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ మీద విమర్శలు చేస్తోంది. బిజీ షెడ్యూల్‌లో కూడా ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం పాల్గొన్నారు. టీడీపీ ఎంపీలు, జనసేన ఎంపీలు, నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రజలు గత రెండు ఎన్నికల్లో ఆప్‌కి మద్దతు ఇచ్చి మోసపోయామని చెబుతున్నారు. ఇప్పుడు బీజేపీకి వాళ్లంతా అండగా నిలువబోతున్నారు' అని విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు.



తిరుపతిలో వైసీపీ కార్పొరేటర్ల బస్సు రాగానే నెలకొన్న ఉద్రిక్తత



తుని మునిసిపల్ కార్యాలయం గేటు వద్ద టీడీపీ శ్రేణుల ఆందోళన



నెల్లూరు డిప్యూటీ మేయర్ తహసీన్‌కు ధ్రువీకరణపత్రం ఇస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

పురపాలికల్లో కూటమి జెండా

(మొదటి పేజీ తరువాయి)

పదవిని, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రెండు వైస్ ఛైర్మన్ పదవులను టీడీపీ దక్కించుకుంది. ఇక గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో ఆరు స్థానాల్లో తెలుగుదేశం ఐదు, జనసేన ఒకటి కైవసం చేసుకున్నాయి. కాగా తిరుపతి డిప్యూటీ మేయర్, కాకినాడ జిల్లా తుని మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ఎన్నిక మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ ఎన్నిక, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఎన్నికను సవాల్ చేస్తూ స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. పలు కారణాల వల్ల నిలిచిపోయిన స్థానిక సంస్థల ఎన్నికలను మంగళవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఒక ప్రకటనలో తెలిపారు.

● ఏలూరులో అలవోకగా...

ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో రెండు డిప్యూటీ మేయర్ పదవులను టీడీపీ అలవోకగా కైవసం చేసుకుంది. డిప్యూటీ మేయర్లుగా పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా టీడీపీ అభ్యర్థులకు 32 మంది కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మద్దతు పలికారు. 18 మంది వైసీపీ కార్పొరేటర్లు ఈ ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉన్నారు. నూజివీడు మునిసిపల్ వైస్ ఛైర్మన్ పదవిని టీడీపీ దక్కించుకుంది. మునిసిపాలిటీలో 32 వార్డులు ఉండగా, టీడీపీ అభ్యర్థి పగడాల సత్యనారాయణకు 17 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా మంత్రి కొలుసు పార్థసారథి మద్దతు పలికారు. దీంతో 18 మంది సభ్యుల బలంతో సత్యనారాయణ ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి పోటీ చేసిన నౌడు నాగ మల్లేశ్వరరావుకు 14 ఓట్లే లభించాయి. వైసీపీ నేతల రాజీనామా కారణంగా ఏర్పడిన ఈ ఖాళీలకు తాజాగా ఎన్నికలు నిర్వహించారు.

● నెల్లూరులో ఘనవిజయం

నెల్లూరు డిప్యూటీ మేయర్ పదవి టీడీపీ ఖాతాలో జమైంది. టీడీపీ అభ్యర్థి తహసీన్‌కు 41 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు తెలపగా, వైసీపీ అభ్యర్థి కరిముల్లాకు 12 మంది మాత్రమే మద్దతు తెలిపారు. దీంతో తహసీన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు జాయింట్ కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి కార్తీక్ ప్రకటించారు. ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. తహసీన్‌ను మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు అభినందించారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రెండు వైస్ ఛైర్మన్ పదవులను కూడా టీడీపీ కైవసం చేసుకుంది. టీడీపీ మద్దతుతో 8వ వార్డు కౌన్సిలర్ పఠాన్ నస్రీన్, 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రటపల్లి శివకుమార్‌రెడ్డి గెలుపొందారు. వీరికి 15 మంది మద్దతు తెలపగా, వైసీపీ అభ్యర్థులు బిట్రగుంట ప్రమీలమ్మ, కందుకూరు యానాదిరెడ్డికి ఆరుగురు కౌన్సిలర్లు మద్దతు ఇచ్చారు.

● గుంటూరులో వైసీపీ కోటకు బీటలు

గుంటూరు నగర పాలక సంస్థలో వైసీపీ కోటకు బీటలు బారాయి. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లు అధిక సంఖ్యలో కూటమిలో చేరారు. తాజాగా గుంటూరు నగర పాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌కు జరిగిన ఎన్నికల్లో ఆరు స్థానాలను కూటమి పార్టీలు కైవసం చేసుకున్నాయి. తెలుగుదేశం ఐదు, జనసేన ఒకటి గెలుచుకున్నాయి. తెర వెనక కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ పావులు కదిపారు. గుంటూరు నగరానికి చెందిన ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు, నసీర్ అహ్మద్ తదితరులు పార్టీ కార్పొరేటర్‌లను దగ్గరుండి నడిపించారు. ప్రస్తుత గుంటూరు మేయర్ మనోహర్ నాయుడుపై కూడా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కూటమి నేతలు వ్యూహరచన చేస్తున్నారు. నగర పాలక సంస్థలో వైసీపీ పూర్తిగా బలాన్ని కోల్పోయింది. త్వరలో గుంటూరు మేయర్ పీఠం కూడా కూటమి వశం కానున్నట్టు తెలుస్తోంది.

● తునిలో రసాభాస

కాకినాడ జిల్లా తుని మునిసిపల్ వైస్‌ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియ రసాభాసగా మారింది. అసంతృప్త కౌన్సిలర్లు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తారన్న సమాచారంతో వైసీపీ నాయకులు క్యాంపు రాజకీయాలకు తెరదీశారు. సరిగ్గా ఎన్నిక సమయంలో మునిసిపల్ కార్యాలయం వద్ద వీరందరితో మునిసిపల్ ఛైర్మన్ ప్రత్యక్షమయ్యారు. టీడీపీ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. టీడీపీ, వైసీపీ నేతలు కౌన్సిల్ హాల్‌లోకి చొచ్చుకుని వచ్చారు. పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కౌన్సిల్ హాల్ దద్దరిల్లింది. గంట పాటు కౌన్సిల్ హాల్‌లో ఇదే తీరు కొనసాగడంతో ఎన్నికల అధికారి పి.వేణుగోపాలస్వామి ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

తిరుపతిలో నేటికి వాయిదా

కోరం లేకపోవడంతో తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, జేసీ శుభం బన్సల్ ప్రకటించారు. తిరుపతి కార్పొరేషన్‌లో 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. ఎన్నిక జరగాలంటే 50 శాతం సభ్యులు హాజరుకావాలి. అయితే గడువులోపు 22 మంది మాత్రమే కౌన్సిల్ హాలుకు చేరుకున్నారు. మరోవైపు వైసీపీ ఎక్స్ అఫీషియో సభ్యులైన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీషతో కలిపి 20 మంది సభ్యులు బస్సులో వస్తుండగా, ఎస్వీయూ మెయిన్ రోడ్డులో జనసేన, టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి నుంచి ఫోన్ రావడంతో ఆ పార్టీ సభ్యులు సమావేశానికి వెళ్లలేదు. కూటమి నేతలు కిడ్నాప్ చేశారంటూ వైసీపీ ఆరోపించిన కార్పొరేటర్లు సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తమను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, సురక్షితంగా ఉన్నామని అమరనాథ్ రెడ్డి, అనీష్ రాయల్, అనిల్, మోహన్ కృష్ణయాదవ్ స్పష్టం చేశారు. కాగా తిరుపతి వెంకటేశ్వర యునివర్సిటీలోని సెనేట్ హాల్‌కు వెళ్లేందుకు కార్పొరేటర్లు వినియోగించే బస్సుకు పోలీసు భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీని హైకోర్టు ఆదేశించింది.

నందిగామ ఎన్నికపై తీర్పు రిజర్వ్

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ అయిన రెండు వార్డు కౌన్సిలర్ల స్థానాలకు ఉపఎన్నికలు జరిపిన తరువాతే ఛైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ నందిగామకు చెందిన నాదెండ్ల హారిక హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం జరగాల్సిన నందిగామ మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. 20 వార్డులు ఉన్న మునిసిపాలిటీలో వైసీపీ 13, టీడీపీ 6, జనసేన ఒక స్థానంలో గెలిచాయి. పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ప్రస్తుతం టీడీపీకి 13, వైసీపీకి 4, జనసేనకు ఒక సభ్యుడి బలం ఉంది. మరో కౌన్సిలర్ తటస్థంగా ఉన్నారు. ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్‌పర్సన్ మృతి చెందడంతో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కాగా పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పాలకొండ నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

పురంలో టీడీపీ పాగా

హిందూపురం మునిసిపల్ ఛైర్మన్‌గా ఆరో వార్డు టీడీపీ కౌన్సిలర్ డీఈ రమేశ్‌ను ఎన్నుకున్నారు. మున్సిపాలిటీలో 38 వార్డులు ఉండగా, 2021 ఎన్నికల్లో వైసీపీ 29 వార్డులను కైవసం చేసుకుంది. తెలుగుదేశం పార్టీకి ఆరు స్థానాలు దక్కాయి. బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర్య అభ్యర్థి ఒక్కోస్థానంలో గెలిచారు. వైసీపీ తరఫున మునిసిపల్ ఛైర్‌పర్సన్‌గా గెలిచిన ఇంద్రజ గత ఏడాది ఆగస్టు 15న టీడీపీలో చేరారు. ఆ మరుసటి రోజే ఛైర్‌పర్సన్ పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఆమెతో పాటు 12 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. వీరితో పాటు బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్ టీడీపీకి మద్దతు తెలిపారు. తాజా ఎన్నికలో టీడీపీ అభ్యర్థి రమేశ్‌కు 21 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి ఓటు వేశారు. వైసీపీకి 17 మంది సభ్యులు ఉండగా 14 మంది మాత్రమే ఓటింగ్‌కు హాజరయ్యారు. మునిసిపల్ ఛైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి రమేశ్ విజయం సాధించినట్టు ఎన్నికల అధికారి, ఆర్డీఓ ఆనంద్‌కుమార్ ప్రకటించారు.

రామచిలుకల దండయాత్ర!



ధాన్యం బస్తాలపై రామ చిలుకల దండ యాత్ర. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం-వేంద్ర రోడ్డులోని ఒక రైస్ మిల్లు వద్ద కనిపించింది దృశ్యం. బస్తాలపై వాలిన చిలుకలు వాటిపై ఉన్న ధాన్యాన్ని పొడుచుకు తింటుండడం ఆ వైపు వెళ్లేవారిని ఆకర్షించింది.

నేల వాలుతున్న సూర్యుడు.. నింగిలో ఎగురు తున్న పక్షులు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద సూర్యాస్తమయ సమయం...



ఇక 6వ తరగతిలో బ్రిడ్జి కోర్సు

- ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మొదటి రెండు నెలలు బోధన
- ప్రత్యేకంగా కరిక్యులమ్.. ఆగస్టు నుంచి సాధారణ పాఠ్యాంశాలు
- విద్యార్థుల మధ్య అంతరం తగ్గేలా పాఠశాల విద్యా శాఖ నిర్ణయం



అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్ర జ్యోతి): వివిధ పాఠశాలల నుంచి ఆరో తరగతికి వచ్చే విద్యార్థుల మధ్య అభ్యసనంలో అంతరాన్ని తగ్గించేందుకు బ్రిడ్జి కోర్సు ప్రవేశ పెట్టాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయం తీసుకుంది. ఆరో తరగతిలో మొదటి రెండు నెలలు బ్రిడ్జి కోర్సు అమలు చేయనుంది. ఏటా జూన్ 12న బడులు తెరుచుకుంటాయి. అదే రోజు నుంచి అన్ని తరగతులు ప్రారంభ మవుతాయి. కానీ ఆరో తరగతికి కొంత విరామం లభించనుంది. 5 వరకు ప్రాథ మిక పాఠశాలలలో చదివి, ఆరో తరగతికి ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థు లకు తరగతులు ఆగస్టులో ప్రారంభమవుతాయి. 5 నుంచి 6వ తరగతిలోకి వచ్చే మార్పును విద్యార్థులు అర్థం చేసుకోవడానికి ఆ రెండు నెలలు (జూన్-జూలై) బ్రిడ్జి కోర్సు మాత్రమే బోధిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. ఇందుకోసం పాఠశాల విద్యా శాఖ ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సు కరిక్యులమ్ రూపొందిస్తోంది. వివిధ రకాల పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థుల మధ్య అంతరాన్ని తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ఈ మార్పులపై నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు నుంచి ఆరో తరగతి పాఠ్య పుస్తకాల బోధన ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఉన్నత పాఠశాలలకు వచ్చే ప్రైవేటు పాఠశా లల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల మధ్య వ్యత్యాసం కనిపి స్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ సింగిల్ టీచర్ స్కూళ్ల నుంచి వచ్చేవారికి, ఎక్కువ మంది టీచర్లు, వసతులు ఉన్న పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాల్లో తేడాలు ఉంటున్నాయి. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎక్కువ మంది టీచర్లున్న ప్రభుత్వ బడుల నుంచి వచ్చిన విద్యార్థులు వేగంగా సబ్జెక్టులను అర్థం చేసుకుంటున్నారు. సింగిల్ టీచర్, ఇద్దరు టీచర్లు ఉండే ప్రాథమిక పాఠశాలల్లో చదివి ఉన్నత పాఠశాలలకు వచ్చినవారు వెనకబడిపో తున్నారు. విద్యార్థుల మధ్య ఏర్పడుతున్న ఈ వ్యత్యాసం పై తరగతులకూ కొన సాగుతోంది. దీంతో ఇకపై అందరూ ఒకేవిధంగా ఉండాలనే ఉద్దేశంతో బ్రిడ్జి కోర్సు విధానం తెస్తున్నారు. మొదటి రెండు నెలల పాటు ఆరో తరగతిలోని ప్రాథమిక అంశాలపైనే బ్రిడ్జి కోర్సు ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల్లో ఈ తరహా బ్రిడ్జి కోర్సులు అమలు చేస్తున్నారు. విద్యార్థులకు తొలుత ప్రాథమిక అంశాలు నేర్పించి, ఆ తర్వాత వేగంగా సిలబస్ పూర్తి చేస్తున్నారు. దీంతో విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి వచ్చినా పాఠ్యాంశాలు, బోధన అర్థం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు ఈ విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోకి తీసుకొస్తున్నారు.

సామాన్యుల కోసమే సీఎం తపన

చంద్రబాబు ఓ విజినరీ.. ఎంతో మందికి స్ఫూర్తి

- ప్రముఖ నటుడు సోనూసూద్ వెల్లడి
- అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ
- ప్రభుత్వానికి నాలుగు అంబులెన్స్‌లు విరాళమిచ్చిన 'సూద్ చారిటీ ఫౌండేషన్'
- సోనూసూద్ చొరవ స్ఫూర్తిదాయకం: సీఎం



రాష్ట్ర ప్రభుత్వానికి బహూకరించిన అంబులెన్స్‌లతో నటుడు సోనూసూద్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును ప్రముఖ నటుడు, 'సూద్ చారిటీ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు సోనూసూద్ సోమవారం అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్యం, సామాజిక సంక్షేమం విషయంలో సేవలందించే సోనూసూద్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి 4 అంబులెన్స్‌లను విరాళంగా అందించింది. అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు, సుదూర ప్రాంతాల్లో క్లిష్టమైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా అంబులెన్స్‌లు అందించిన సోనూసూద్‌ను సీఎం అభినందించారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు సైతం అత్యవసర వైద్య సేవలు, అత్యాధునిక సౌకర్యాలతో వైద్యం అందేలా.. తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

సమాజానికి తిరిగి ఇవ్వాలన్న తపనతోనే..

సీఎంను కలిసిన అనంతరం సోనూసూద్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఒక విజినరీ అని, సామాన్యుల కోసం చాలా ఆలోచిస్తారని అన్నారు. సమాజానికి మేలు చేయాలన్న విషయంలో ఆయన చాలా మందికి స్ఫూర్తి అని కొనియాడారు. తనకు ఎలాంటి రాజకీయపరమైన ఆశలు లేవని, సమాజానికి తిరిగి ఇవ్వాలన్న తపనే ఇలా ముందుకు నడిపిస్తోందని స్పష్టం చేశారు. కొవిడ్ సమయం నుంచి చంద్రబాబుతో టచ్‌లో ఉన్నానని చెప్పారు. ఏపీ అభివృద్ధిలో తన భాగస్వామ్యం ఉండాలనే ఉద్దేశంతో, వైద్య సదుపాయాలు సరిగ్గాలేని ప్రాంతాల కోసం అంబులెన్స్‌లను ఇచ్చానని పేర్కొన్నారు. కొవిడ్ సమయంలోనే ప్రజలను ఆదుకోవాలన్న బాధ్యత మొదలైందన్నారు. ఎవరికైనా తాను ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉంటానన్నారు. సూద్ ఫౌండేషన్ ప్రతి సామాన్యుడి కోసం పని చేస్తుందని, అవసరమైతే ప్రభుత్వాలతోనూ కలిసి పని చేస్తామన్నారు. అంబులెన్సులను నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉపయోగిస్తారని అనుకుంటున్నానన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కూడా త్వరలోనే కలుస్తానన్నారు.

మరింత మందికి స్ఫూర్తి: సీఎం

ఏపీలో ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో సూద్ చారిటీ ఫౌండేషన్ భాగస్వామ్యం కావడంపై సీఎం చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశా రు. సోనూసూద్ చొరవ మారుమూల ప్రాంతాలకూ ఆరోగ్య సేవలను అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు సోనూసూద్‌తో భేటీ అనంతరం సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. సూద్ ఫౌండేషన్ చొరవ మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఏపీ నాకు రెండో ఇల్లు లాంటిది..

నటుడిగా తనపై ప్రేమాభిమానాలు చూపుతున్న తెలుగు ప్రజలకు సోనూసూద్ ధన్యవాదాలు చెప్పారు. తెలుగువారు తనకు అత్యంత ఆప్తులని, వారికి ఏదైనా చేయడం బాధ్యతగా భావిస్తానన్నారు. 'ఏపీ నాకు రెండో ఇల్లు లాంటిది. ఇక్కడి ప్రజల కారణంగానే నేను ఇంతవాడినయ్యా. నా సతీమణి కూడా ఆంధ్రాకు చెందిన తెలుగు వ్యక్తే' అని తెలిపారు. టాలీవుడ్‌లో పని చేసేందుకు సిద్ధంగానే ఉన్నానని.. తెలుగు దర్శక, నిర్మాతలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే ఉన్నానని చెప్పారు. నటుడిగా ఏ పాత్ర చేసేందుకైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

జేఈఈ మెయిన్ రెండో విడతకు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3: జేఈఈ మెయిన్ రెండో విడతకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 తేదీ రాత్రి 9 గంటల వరకు గడువు ఉంది. ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 8 మధ్య పరీక్ష నిర్వహిస్తారు. జనవరిలో మొదటి విడత రాసి, రెండో విడతలో కూడా పరీక్ష రాయాలనుకునేవారు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. దరఖాస్తు ఫారమ్ నింపి, నిర్ణీత రుసుము చెల్లిస్తే సరిపోతుంది. మిగతావారు రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తు నింపాలి. ఈ విడత పరీక్షలు పూర్తయిన తరువాత రెండింటిలో ఉత్తమ స్కోరును (రెండు పరీక్షలు రాస్తేనే) తీసుకుని ఏప్రిల్ 17న ర్యాంకులు ప్రకటిస్తారు. మరోవైపు, సీబీఎస్ఈ 10, 12 తరగతుల హాల్ టికెట్లు విడుదలయ్యాయి. సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు ఈ నెల 15 నుంచి మార్చి 18 వరకు, 12వ తరగతి పరీక్షలు ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహిస్తున్నారు.

సీఈసీ, ఈసీల నియామకంపై 12న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: కొత్త చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 12న విచారణ చేపడతామని సుప్రీం కోర్టు ప్రకటించింది. ఏడీఆర్, కాంగ్రెస్ నాయకురాలు జయ ఠాకూర్ ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన స్వతంత్ర కమిటీ నియమించాలని, అలాకాకుండా ప్రభుత్వమే నియమిస్తే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సుప్రీంకోర్టు 2023లో ఇచ్చిన తీర్పు హెచ్చరించిందని ఏడీఆర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. కానీ ఆ కమిటీలో ప్రధాన న్యాయమూర్తిని తొలగిస్తూ.. ఓ మంత్రికి చోటిస్తూ కేంద్రం కొత్త చట్టం తెచ్చిందని పేర్కొన్నారు. సీఈసీ ఈ నెల 18న పదవీ విరమణ చేస్తున్నందున తమ పిటిషన్లపై ఆలోపే త్వరగా విచారణ చేపట్టాలని ప్రశాంత్ భూషణ్, జయ ఠాకూర్ తరఫు న్యాయవాది కోరారు.

ఎందుకీ వివక్ష?

(మొదటి పేజీ తరువాయి)

గత నెల 10న సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి కేటగిరీకి చెందిన చైర్మన్లు, సిబ్బంది గౌరవ వేతనంతో పోలిస్తే రెండో కేటగిరీలో వారి గౌరవ వేతనం చాలా తక్కువగా నిర్ణయించింది. దీనిపై ఆయా వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివక్ష ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. కార్పొరేషన్లే కాకుండా పట్టణాభివృద్ధి అథారిటీలనూ ప్రభుత్వం విభజించింది. రాష్ట్రంలో పలు కార్పొరేషన్లకు చైర్మన్లను, డైరెక్టర్లను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. అయితే వారికి గౌరవ వేతనంలో నిర్ణయించడానికి కార్పొరేషన్లను ఏ, బీ కేటగిరీలుగా విభజించారు. ఏ-కేటగిరికి చెందిన చైర్మన్లకు రూ. 1.25 లక్షలు, బి-కేటగిరి చైర్మన్లకు రూ. 60 వేలు గౌరవ వేతనం ప్రకటిస్తూ జనవరి 10న సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఒకే తరహా కార్పొరేషన్లకు సంబంధించి వ్యత్యాసాలు చూపించడంపై నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఏ ప్రాతిపదికన ఈ కేటగిరీల విభజన చేశారని ప్రశ్నిస్తున్నారు.

విభజనతో భేదాలు

బీసీ కార్పొరేషన్లలో పద్మశాలి, యాదవ కార్పొరేషన్లను ఏ-కేటగిరి కింద, మిగిలిన కార్పొరేషన్లను బి-కేటగిరి కింద చేర్చడం పట్ల ఆయా కార్పొరేషన్లలో అసంతృప్తి నెలకొంది. అదే విధంగా ఏపీ ఫైబర్‌నెట్, ఏపీ ఖాదీ బోర్డు, మాదిగ కార్పొరేషన్, గిరిజన కార్పొరేషన్లు లాంటి పెద్ద కార్పొరేషన్లను కేటగిరి-బి కింద చేర్చడాన్ని తప్పుపడుతున్నారు. కార్పొరేషన్లతో పాటు మున్సిపల్ పట్టణాభివృద్ధి అథారిటీల్లో కూడా వ్యత్యాసం చూపించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అన్నమయ్య పట్టణాభివృద్ధి అథారిటీ, రాజమండ్రి పట్టణాభివృద్ధి అథారిటీలను మాత్రమే కేటగిరి-ఏ కింద చేర్చారు. మిగిలిన పట్టణాభివృద్ధి అథారిటీలన్నీ బి-కేటగిరి కింద చేర్చారు. ప్రభుత్వం కార్పొరేషన్ పదవులిచ్చినా, సాధారణ పరిపాలనశాఖ కేటగిరీలను విభజించి వారి మధ్య అనవసరంగా బేధాలు తెచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్‌లు అన్నింటినీ ఒకే కేటగిరిగా గుర్తించాలని కోరుతున్నారు.

అలవెన్సుల్లో భారీ వ్యత్యాసం

కార్పొరేషన్లలో వ్యక్తిగత సిబ్బందికి సంబంధించి అలవెన్సులను కేటగిరి-ఏ కార్పొరేషన్లకు రూ.52 వేలు ప్రకటించగా, కేటగిరి-బి కార్పొరేషన్ల సిబ్బందికి రూ.33 వేలు మాత్రమే ఇచ్చారు. మొత్తంగా గౌరవవేతనం, అలవెన్సులు కేటగిరి-ఏ కింద కార్పొరేషన్లకు నెలకు రూ.2,77,500 అందుతుంటే.., కేటగిరి-బి కింద ఉన్న కార్పొరేషన్లకు మాత్రం రూ.1,93,500 ప్రకటించారు. ఆ రెండింటి మధ్య రూ.84 వేల వ్యత్యాసముంది. అదే విధంగా కేటగిరి-ఏ, బి-కేటగిరి కార్పొరేషన్ల చైర్మన్లకు మధ్య రూ.65 వేలు వ్యత్యాసముండటంతో చైర్మన్లు అసంతృప్తితో ఉన్నారు. కేటగిరి ఏ-కార్పొరేషన్ల డైరెక్టర్లకు గౌరవేతనం 20 వేలు ప్రకటించారు.

రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి 9,417 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. '2014 నుంచి రాష్ట్రంలో 1,560 కిమీ కొత్త రైల్వే ట్రాకుల నిర్మాణం జరిగింది. ఇది శ్రీలంకలోని మొత్తం రైల్ నెట్ వర్క్ కంటే ఎక్కువ. ప్రస్తుతం రూ.84,559 కోట్ల వ్యయంతో 5,560 కిమీ మేర 43 ప్రాజెక్టులు అమలవుతున్నాయి. రూ.2,051 కోట్లతో 73 అమృత్ స్టేషన్లను అభివృద్ధి పరుస్తున్నాం. విశాఖ స్టేషన్‌ను రూ.446 కోట్లతో, నెల్లూరు-రూ.103 కోట్లతో, తిరుపతి-312 కోట్లు, రాజమండ్రి స్టేషన్‌ను రూ.271.43 కోట్లతో(మొత్తం 1,132.43 కోట్లు) అభివృద్ధి చేస్తున్నాం. రైలు ప్రమాదాలు జరక్కుండా రాబోయే ఆరేళ్లలో దేశవ్యాప్తంగా కవచ్‌ను ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో వివిధ స్టేషన్ల పరిధిలో 2,981 కిలోమీటర్లలో కవచ్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఆమోదం లభించగా.. ఇందులో 130 కిమీ మేర పని పూర్తయింది. ఇంకో 1,700 కిమీల పని పురోగతిలో ఉంది. కొత్త రైల్వే ట్రాకులు, విద్యుదీకరణ విషయంలో కూడా గతంలో కంటే ఎంతో ఎక్కువ పనులు చేశాం. 2014 నాటి నుంచి రాష్ట్రంలో 753 కిలోమీటర్ల కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించాం. 2009-14 మధ్య 37 విద్యుదీకరణ పనులు జరుగగా.. 2014-25 మధ్య 177 పనులు జరిగాయి. దరిదాపుగా 5 రెట్లు ఎక్కువ. అలాగే నూటికి నూరు శాతం విద్యుదీకరణ జరిగింది. 2014 నుంచి రాష్ట్రంలో 770 రైల్ ఫ్లైఓవర్లు, అండర్‌బ్రిడ్జిలు నిర్మించాం. వివిధ స్టేషన్లలో 65 లిఫ్టులు, 34 ఎస్కలేటర్లు ఏర్పాటుచేశాం. రాష్ట్రంలో 15 జిల్లాల పరిధిలో 8 వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. మాల్దా టౌన్-బెంగళూరు మధ్య నడుస్తున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ 9 జిల్లాల్లో 14 చోట్ల ఆగుతోంది' అని వివరించారు.

అమరావతి రైల్వే లైన్‌పై ఆశలు.. రాష్ట్రంలో రైల్వే పనుల కోసం రూ.9,417 కోట్లు కేటాయించడంతో.. అమరావతి నూతన రైల్వే లైన్‌పై ఆశలు నెలకొన్నాయి. నూతన రైల్వే లైన్లు, విద్యుదీకరణ, డబ్లింగ్, ట్రిప్లింగ్, రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు జరిపిన కేటాయింపుల్లో రైల్వే లైన్లకే ఎక్కువగా ఉండనున్నాయి. దీనిలో అమరావతి లైన్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోమవారం స్థూల కేటాయింపులు మాత్రమే ప్రకటించారు. పింక్ బుక్ విడుదలయ్యాక వివరాలు వెల్లడవుతాయి. విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ.పాటిల్ సోమవారం మాట్లాడుతూ.. అమరావతి నూతన రైల్వే మార్గాన్ని మూడున్నరేళ్లలో పూర్తిచేస్తామన్నారు. పింక్ బుక్ వస్తే ఈ మార్గానికి ఎంత కేటాయించిందీ స్పష్టత వస్తుందన్నా రు. అమరావతి ప్రాజెక్టును ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 57 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే భూ సేకరణ నోటిఫికేషన్లు కూడా ఇచ్చిన నేపథ్యంలో ప్రాజెక్టు సాకారానికి తొలిదశలో ఎంత ఇస్తారన్నది చూడాలి.





పాల చిక్కదనం కోసం ఉపయోగిస్తున్న రసాయనం, తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, అధికారులు

చిక్కనైన పాల కోసం.. పామాయిల్, ఉప్పు, మాల్టోడెక్సిన్

- అనంతపురంలో కల్తీ పాల కేంద్రంపై విజిలెన్స్ దాడులు
- పలు డెయిరీలకు వాటినే సరఫరా చేస్తున్న నిందితుడు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నేటి రోజుల్లో కల్తీకి ఏదీ అనర్హం కాదన్నట్లుగా పరిస్థితి తయారైంది. పాలలో చిక్కదనం కోసం పామాయిల్, ఉప్పు, మాల్టోడెక్సిన్ పౌడర్‌ను నీటిలో కలిపి.. తర్వాత ఆ మిశ్రమాన్ని పాలలో కలుపుతున్నారు. ఈ ఉదంతం తాజాగా అనంతపురం జిల్లాలో వెలుగులోకి వచ్చింది. ఈ కల్తీ పాలను విజయ, గాయత్రి డెయిరీలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీనికి సంబంధించి విజిలెన్స్ అధికారులు జిల్లాలోని రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామంలో రామిరెడ్డి నిర్వహిస్తున్న కల్తీ పాల తయారీ కేంద్రంపై దాడులు చేపట్టారు. ఆయన నివాసంలో తనిఖీలు చేశారు. పాల చిక్కదనం కోసం వినియోగిస్తున్న వివిధ మిశ్రమాలను స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. రామిరెడ్డి స్థానిక పాడి రైతుల నుంచి రోజుకు 300 లీటర్ల వరకు పాలు సేకరిస్తుంటాడు. అయితే పైన పేర్కొన్న కల్తీ మిశ్రమాన్ని పాలలో కలుపుతున్నట్లు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అదనపు ఆదాయం కోసం ఇలా చేస్తున్నానని రామిరెడ్డి అంగీకరించాడని విజిలెన్స్ డీఎస్పీ తెలిపారు. ఈ కల్తీపాల ద్వారా గ్యాస్ట్రిక్, క్యాన్సర్ వంటి జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కల్తీ పాల నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపుతున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల సమక్షంలో కల్తీ పాల తయారీ కేంద్రాన్ని సీజ్ చేశామని తెలిపారు. నివేదిక వచ్చాక చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సద్గురుడు, ఏఓ వాసుప్రకాష్, ఫుడ్‌సేఫ్టీ అధికారి తస్లీం, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఆత్మహత్యకు కారణం ఆ ఇద్దరేనా..!?



- తణుకు రూరల్ ఎస్ఐ మూర్తిపై నాలుగు సార్లు చర్యలు
- ఆ ఒత్తిడితోనే అఘాయిత్యం!
- స్నేహితుడి ఆడియోలో కీలక విషయాలు

తణుకు రూరల్/భీమవరం క్రైం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రూరల్ ఎస్ఐగా పనిచేసిన ఆదుర్తి గంగ సత్య నారాయణమూర్తి(38) ఆత్మహత్య వ్యవహారంలో కొత్త కోణాలు వెలుగుచూస్తున్నాయి. పోలీసుల వేధింపుల వల్లే వీఆర్‌లో ఉన్న ఎస్ఐ మూర్తి ఆత్మహత్య చేసుకున్నారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో ద్వారా తెలుస్తోంది. ఆడియోలో.. ఎస్ఐ మూర్తి చివరిగా తన స్నేహితుడితో మాట్లాడిన మాటలు ఉన్నాయి. మూర్తి తనకు జరిగిన అన్యాయం గురించి స్నేహితుని వద్ద వాపోయాడు. భార్య, పిల్లల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ గతంలో పనిచేసిన సీఐ నాగేశ్వరరావు, మరో సీఐ తనను ఇబ్బంది పెట్టడంతో తానిక్కడ పని చేయలేనని అన్నట్టు ఆ ఆడియోలో ఉంది. వీఆర్ నుంచి పోస్టింగ్ ఇచ్చినా కృష్ణా జిల్లాలో ఇస్తామంటున్నారని, అక్కడైతే తాను పని చేయలేనని, తూర్పుగోదావరి జిల్లాలో అడుగుతున్నానని, కానీ ఇక్కడ ఇచ్చే అవకాశం లేదని, ఈ పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని చెప్పారు. దీంతో అలాంటి ఆలోచనేమీ మనసులో పెట్టుకోవద్దని ఆయన మిత్రుడు వారించారు. కాగా.. మూర్తి మృతి అనంతరం ఆయన బంధువులు, బ్యాచ్‌కు చెందిన కొందరు ఎస్ఐలు, మిత్రులు తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద, జిల్లా ఎస్పీ వద్ద.. ఈ వ్యవహారంపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. ఇదిలావుంటే, మూర్తిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో గతంలో ఆయనపై నాలుగు సార్లు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు.



పందెం పావురమా.. త్వరగా గమ్యం చేరుమా!

అది నెల్లూరు జిల్లా బోగోలు మండలం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానం.. సోమవారం ఉదయం చిన్న లారీ వచ్చి ఆగింది. అందులోంచి దించిన 28 క్రేట్లను అలా తెరవగానే.. దాదాపు 800 పావురాలు పరుగు పందెంలో పాల్గొన్నట్లుగా వాయువేగంతో ఎగిరిపోయాయి. తమిళనాడులోని కన్యాకుమారి, తిరుత్తణి, తిరునల్వేళి ప్రాంతాలకు చెందిన పావురాల పెంపకందారులు వాటికి పందెం పెట్టుకున్నారట! తాము కాసిన పందెం ప్రకారం పావురాలు 1,550 కిలోమీటర్ల దూరంలోని కన్యాకుమారికి 7 గంటల్లో చేరుకోవాల్సి ఉంటుందని చెప్పా రు. ఇంత దూరం వెళ్లాలంటే రైలులో 18 గంటలు, బస్సులో అయితే 24 గంటలు పడుతుందని తెలిపారు. -బిట్రగుంట, ఆంధ్రజ్యోతి

అసెంబ్లీకి రాకుంటే.. జగన్ సభ్యత్వం ఆటోమేటిక్‌గా రద్దు!

- సునీల్‌ని ఎందుకు సస్పెండ్ చేయట్లేదు?
- బాధితుడిగా ప్రశ్నించే హక్కు నాకుంది
- డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోసం కోర్టులో కేసు వేశానంటే కుదరదని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. అసెంబ్లీ 60 పని దినాలలో ఎలాంటి సమాచారమూ లేకుండా గైర్హాజరైతే అతడి శాసన సభ్యత్వం ఆటోమేటిగ్గా రద్దవుతుందని తేల్చిచెప్పారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీకి వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోవచ్చు కదా! అని విలేకరులు పేర్కొనగా.. శాసనసభ్యత్వాన్ని కాపాడుకోడానికి ఈ ప్రయత్నం బాగానే ఉంటుంది కానీ, అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానన్న ఆయన మాటలకు విశ్వసనీయ త ఉండదన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోతే మాట్లాడేందుకు సమయం లభించదన్న జగన్ వాదనలో పస లేదన్నారు. కంటెంట్ ఉంటే స్పీకర్ సమయాన్ని ఇస్తారని, మంత్రులు సమాధానం చెబుతారని తెలిపారు. మీరు సభాపతి స్థానం లో కూర్చుంటే అధ్యక్షా అని సంబోధించాల్సి వస్తుందని జగన్ హాజరుకావట్లేదేమోనని విలేకరులు పే ర్కొనగా.. సభాపతి స్థానంలో ఎవరు కూర్చున్న అధ్య క్షా అనాల్సిందేనన్నారు. తన కస్టోడియల్ టార్చర్ కేసు లో సీఐడీ విభాగం మాజీ అధిపతి పీవీ సునీల్‌కుమార్‌ను ఇప్పటివరకు ఎందుకు సస్పెండ్ చేయలేదని రఘురామ ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నప్పటికీ, ఒక బాధితుడిగా ప్రశ్నించే హక్కు తనకు ఉందన్నారు. చట్టాన్ని అతిక్రమించి చట్టసభల సభ్యుడినైన తనను చితక్కొట్టి, కాలు, వేలు విరిచిన నాటి నుంచి న్యాయపోరాటం చేస్తున్నానని చెప్పారు. గుం టూరు ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రభావతి సుప్రీంకోర్టులో అత్యంత ఖరీదైన న్యాయవాదులను నియమించుకున్నారని, వారికి చెల్లించే ఫీజు ను ఆమే సమకూర్చుకున్నారా? లేక ఆమెతో తప్పు చేయించిన వారు సమకూర్చారా? అని ప్రశ్నించారు. సునీల్ కుమార్‌కు కుడి భుజంగా వ్యవహరించిన తులసి బాబు అన్ని దోపిడీల్లోను ఆయనకు సహకరించాడని, సీఐడీ విభాగం న్యాయ సలహాదారుగా కూడా పని చేసినట్టు తెలిసిందని చెప్పారు. ఈ కేసులో సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేయకపోతే సాక్షులు వాంగ్మూలం ఇవ్వడానికి భయపడతారన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.